ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ షష్ఠి రా. 9.40 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: పుబ్బ ఉ. 7.04 వరకు, అనంతరం ఉత్తర తె. 6.30 వరకు; అమృతకాలం: రా. 11.40 నుండి 1.15 వరకు; వర్జ్యం: మ. 2.06 నుండి 3.40 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు

సంపుటి:56 • సంచిక:267 • ఆదివారం 7 జనవరి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+4 • వెల: 6.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ఉద్యమ నేతలకు పదవులు

పెండింగ్ పదవుల భర్తీపై

సీఎం కేసీఆర్ కసరత్తు

తయారవుతున్న జాబితాలు..

వందల్లోనే పదవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉద్యమంలో.. ఎంతోకష్టప డ్డాం.. టిఆర్ఎస్ ఆవిర్భావం నుండీ పార్టీనే నమ్ముకుని శ్రమిస్తున్నాం అయినా ఇంకా పదవి మా తలుపుతట్టలేదు అని ఎదురుచూస్తున్న అనేక మంది నేతలను పదవులు పలకరించేసమయం ఆసన్నమైంది. ఇప్పటివరకు ప్రభుత్వం భర్తీచేసిన పదవుల్లో సీఎం కెసిఆర్ ఆచితూచి వ్యవహరించి.. అన్ని వర్గాలకు ప్రాధాన్యమివ్వగా, ఉద్యమ నేతలతో పాటు కొత్తగా పార్టీలో చేరిన బలమైన నేతలకూ అదే స్థాయి ప్రాధాన్యం దక్కింది. ఇపుడు ఆఖరి ఏడాది మిగిలి ఉన్న పదవుల్లో.. ప్రథమ ప్రాధాన్యం ఉద్యమనేతలకే ఇవ్వాలని టిఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. మూడున్నరేళ్ళ తర్వాత ఇటీవల టిఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యునిగా పనిచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు. దీంతో ఉద్యమనేతల్లో మళ్ళీ ఉత్సాహం కనిపిస్తోంది. కాస్త ఆలస్యమైనా.. కష్టపడ్డ వారికి, ఓపికగా ఎదురుచూసిన వారికి గుర్తింపు ➪ 3వ పేజీలో...



24×7 విద్యుత్ బ్రహ్మాండం

వ్యవసాయ రంగం

బలోపేతం... రైతులకూ మేలు

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను

అభినందిస్తూ ప్రఖ్యాత

వ్యవసాయ శాస్త్రవేత్త

ఎం.ఎస్. స్వామినాథన్ లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రికి ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అభినందనలు తెలిపారు. ఈ నిర్ణయం దేశ చరిత్రలో చారిత్రాత్మకమని ప్రశంసించారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రతి ఏటా ఏదో ఒక రకమైన విపత్తు సంభవించి నష్టపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు తెలంగాణ సర్కారు ➪ 3వ పేజీలో...

పెట్టుబడిపై పీపుల్ పల్స్..!

జిల్లాల్లో పర్యటించాలని

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

నెలరోజుల కార్యాచరణ సిద్ధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ చరిత్రలో మొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన పెట్టుబడి మద్దతు పథకంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించి అవసరం మేరకు సవరణలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఆ మేరకు తన ఆలోచనా విధానాలు, ప్రజల్లోకి వెళ్ళేందుకు తీసుకోవలసిన చర్యలు, పథకం పారదర్శకంగా అమలయ్యేందుకు గల వ్యూహాలను మంత్రివర్గ ఉపసంఘానికి ➪ 10వ పేజీలో...



బడ్జెట్ తీరు మారాలి

తెలంగాణను ఆదర్శంగా తీసుకోవాలి

- క్షేత్రస్థాయి అధ్యయనంతో సత్ఫలితాలు
- ఆర్నెళ్ల ముందే చేపడితే మెరుగైన ఫలితాలు
- కేసీఆర్ బడ్జెట్ కసరత్తుపై సర్వత్రా ప్రశంసలు, అభినందనలు

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

బడ్జెట్ రూపకల్పనలో కొన్నేళ్లుగా ప్రాదేశిక ఆదేశాలు మరుగునపడ్డాయి. పాలకుల ప్రయోజనాలు, ఇష్టాఇష్టాలకే ప్రాధాన్యత పెరిగింది. అందుకు భిన్నంగా ఇప్పుడు ఒక్కో రాష్ట్రం తీరు మార్చుకుంటున్నాయి. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పనకు సమాయత్తమౌతున్నాయి. ఇందులో తెలంగాణ అగ్రభాగాన ఉంది. బడ్జెట్ అంటే ఒక ఏడాదిలో సమకూరే ఆదాయం, జరపాల్సిన కేటాయింపుల చిట్టాపద్దులు. ఇవి ప్రజల అవసరాలు, ఆకాంక్షలే ప్రాధాన్యతాంశాలుగా జరగాలి. ఈ లక్ష్యంతోనే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలతో పాటు అన్ని పాలనా రంగాల్లోనూ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా మారింది. భారత్‌లో కొంతకాలం క్రితం వరకు ప్రతిఏటా ఆరుమాసాల ముందు నుంచే ప్రాధాన్యతాంశాల గుర్తింపు ప్రక్రియ మొదలయ్యేది. అది కూడా క్షేత్రస్థాయి నుంచి అవసరాల్ని ఎంపిక చేసేవారు. అంచెలవారీగా ఈ డిమాండ్ రాష్ట్రానికి, కేంద్రానికి చేరేది. అందుబాటులో ఉన్న నిధులు, అవసరాల ప్రాధాన్యతల ప్రాతిపదికన కేటాయింపులు జరిగేవి. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర పెద్దలతో సమావేశాలు జరిగేవి. అలా జిల్లా, ఆపై స్థాయి వరకు కొనసాగేవి. అయితే కొంతకాలంగా ఈ విధానం గాడితప్పింది. అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన మొదలైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, లేదా తదుపరి ఎన్నికల్లో ఓట్లు రాల్చే పథకాలకే కేటాయింపుల్లో ప్రాధాన్యత అధికమైంది. ఇది ప్రాంతాల వారీగా అసమతుల్యతకు కూడా దారి తీసింది. దేశంలో ప్రస్తుతం దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ విభజన వాదాలు జోరందుకోవడానికి బడ్జెట్ కేటాయింపుల ప్రాతిపదికలో లోపాలు కూడా ఓ ప్రధాన కారణం.

> క్షేత్రస్థాయి సమస్యలే ఆలంబన కావాలి
>
> ప్రజల ఆకాంక్షలకే అద్దం పట్టాలి

ఇప్పుడు తెలంగాణ గత విధానానికి స్వస్తిచెప్పింది. క్షేత్రస్థాయి సమస్యలపై అధ్యయనం మొదలెట్టింది. కానీ ఆరుమాసాల ముందు నుంచే ఈ ప్రక్రియ మొదలెట్టి ఉంటే మరింత మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవి. బడ్జెట్‌కు రెండుమాసాల ముందే ఈ ప్రయత్నాన్ని ప్రారంభించింది. అయినప్పటికీ ఇది సర్వత్రా అభినందనలు అందుకుంటోంది. గ్రామీణస్థాయిలో సమస్యల్ని ఎంచి కలెక్టర్లు, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి శాఖల వారీగా అవసరాలు, ప్రజల ఆకాంక్షల్ని నివేదికల రూపంలో సిద్ధం చేస్తోంది. వీటి క్రోడీకరణ అనంతరం నిధుల అందుబాటును బట్టి కేటాయింపుల్లో ప్రాధాన్యతనివ్వనుంది. ఇదే విధానం కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు అమలు చేస్తే నిజమైన ప్రజాప్రయోజనాలు నెరవేరుతాయి.

బ్రిటీష్ ఏలుబడిలో ఉండగానే భారత్‌లో వార్షిక బడ్జెట్ అమలు చేయడం మొదలైంది. 1869 ఫిబ్రవరి 18న తొలిసారిగా జేమ్స్‌విల్సన్ భారత బ్రిటీష్ ఇండో పార్లమెంట్‌కు ఈ బడ్జెట్ సమర్పించారు. అప్పటి నుంచే కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరించడం మొదలైంది. ఇదే రాష్ట్రాలకు వర్తించింది. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు అమలౌతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇందుకోసం ప్రత్యేకంగా ➪ 3వ పేజీలో...



నేరాలు తేలకుండానే నేతలు జైళ్లకా!

గృహ నిర్బంధమే సబబైన చర్య

కింది కోర్టుల్లో తీర్పులు.. పై కోర్టుల్లో తల్లకిందులు

రాజకీయ నేతలకు అప్పటికే భారీ నష్టం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ పై నమోదైన దాణా కుంభకోణానికి సంబంధించి వ్యాజ్యాలు పూర్తయి నేరం రుజువైన క్షణం నుంచి చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో దేశంలో పేరొందిన పాలకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ వేత్తలకు సంబంధించి శిక్షల అమలు చర్చనీయాంశంగా మారింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగజేశారని, లేదా కాంట్రాక్టులు, ఇతర ప్రయోజనాలు కల్పించి అందుకు బదులుగా ఆర్థికలాభం పొందారంటూ నాలుగు దశాబ్దాల్లో పలువురిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా ఆరోపణలు రాగానే ప్రాథమిక నిర్ధారణతో ➪ 3వ పేజీలో...

లాలూకు మూడున్నరేళ్లు



ఒక్కో కేసులో రూ.5 లక్షల చొప్పున జరిమానా

దాణా కుంభకోణం కేసులో సీబీఐ కోర్టు తీర్పు

బీహార్ మాజీ సీఎంతో పాటు ఏడుగురికి ఒకే శిక్ష

హైకోర్టులో సవాల్ చేస్తామంటున్న తేజస్వి యాదవ్

11లో

దాణా స్కాం కేసులో తీర్పు వెలువరించిన అనంతరం రాంచీ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నుంచి వెలుపలికి వస్తున్న న్యాయమూర్తి శివ్‌పాల్ సింగ్

• ఆర్మూర్ డిక్లరేషన్



కాంగ్రెస్ వస్తే రూ. 2 లక్షల రుణమాఫీ

ఏటా 5వేల కోట్ల ఇంటర్వెన్షన్ ఫండ్

ప్రతి పంటకు గిట్టుబాటు మద్దతు ధర

రైతుల తరపున పంటల బీమా

ప్రీమియం ప్రభుత్వమే చెల్లింపు

ఆర్మూర్ రైతు సదస్సులో పీసీసీ చీఫ్ ఉత్తమ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే రైతు సంక్షేమం కోసం చేయాల్సిన విధి విధానాలు ఖరారు చేసింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ➪ 10వ పేజీలో...

• కౌలాలంపూర్‌లో రజనీ, కమల్ సందడి



10

ఇంటర్‌లో గ్రేడింగ్ లేనట్లే

గ్రేడింగ్ ఇస్తే జాతీయ పరీక్షల అర్హతకు ఇబ్బంది

ఎంసెట్‌లో వెయిటేజ్‌పై సమస్య

మార్కులు లేకపోతే డిగ్రీ అడ్మిషన్లకు కష్టాలు

కేరళ, పశ్చిమ బెంగాల్‌లోనే గ్రేడింగ్ పద్ధతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్‌లో గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలనుకున్న సర్కార్ ఇప్పుడు ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గింది. దేశంలో కేవలం రెండు రాష్ట్రాల్లోనే ఇంటర్ స్థాయిలో గ్రేడింగ్ విధానం అమలు అవుతుండడం, పైగా ఈ విధానం మూలంగా జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు అర్హత కావాలంటే ఇంటర్ మార్కులను ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో గ్రేడింగ్ విధానంపై సర్కార్ పునరాలోచనలో పడింది. గ్రేడింగ్ విధానం తోపాటు ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణల కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదిస్తూ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ➪ 9వ పేజీలో...

• వర్షపు నీరు ఒడిసి పడదాం...



ఇంకుడు గుంతలో కంకర వేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి మహేందర్ రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్

జలం.. జీవం

యుద్ధ ప్రాతిపదికన ఇంకుడు గుంతలు 3

నీటి కష్టాలకు చరమగీతం: మంత్రి కేటీఆర్



ఉమ్మడి హైకోర్టు విభజనకు 3 కమిటీలు

ఫిబ్రవరిలో క్షేత్రస్థాయి పరిశీలనలు

ఏప్రిల్ చివరికల్లా భవనం సిద్ధం

వేసవి సెలవుల్లో ఫర్నిచర్, ఫైళ్లు తరలింపు

హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఆదేశం

1. భవనాల పరిశీలన కమిటీ
2. ఉద్యోగుల విభజన కమిటీ
3. రికార్డుల డిజిటలైజేషన్ పర్యవేక్షణ కమిటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి హైకోర్టును విభజించేందుకు, అమరావతిలో ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనంలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీ సర్కారు ప్రతిపాదించిన భవనాల పరిశీలన కమిటీ, ఉద్యోగుల విభజనకమిటీ, రికార్డుల డిజిటలైజేషన్ ➪ 8వ పేజీలో...

రాహుల్‌పై హక్కుల నోటీస్ లోక్‌సభకు..

ఉల్లంఘన జరిగినట్టు నిర్ధారణ

స్పీకర్‌కు పంపిన రాజ్యసభ చైర్మన్

వివరాలు 11లో...



జలసౌధ టు కాళేశ్వరం లైవ్

- ప్రత్యక్షప్రసారం ద్వారా ఇంజనీర్లు, ఏజెన్సీల సైట్ ఇంజనీర్లతో ముఖాముఖి
- హైదరాబాద్ నుండే పనుల పర్యవేక్షణ • కంట్రోల్ సిబ్బంది పనితీరుపై ఆరా
- సకాలంలో పంపుల సరఫరాకు బీహెచ్ఈఎల్ హామీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధునాతన టెక్నాలజీని ఆదినుండి అందిపుచ్చుకుని పనుల పరుగుకు వినియోగించే రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు శనివారం జల సౌధ నుండి కాళేశ్వరం పనులను ప్రత్యక్షంగా వీక్షించారు. మంత్రి హరీష్ నేరుగా లైవ్‌లోకి రావడంతో అన్నారం బ్యారేజీ వద్ద పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నివ్వెరపోయారు. హైదరాబాద్‌లోని తెలంగాణ నీటిపారుదల శాఖ హెడ్‌క్వార్టర్ జలసౌధ నుండి ఆయా పనుల పురోగతిని మంత్రి లైవ్‌లో తనిఖీచేసే ప్రక్రియ కొనసాగించారు. గత నెలలో తాను చేసిన.. మూడురోజుల పర్యటన సందర్భంగా జరిగిన పనులు.. ఇప్పటిదాకా జరిగిన పురోగతిని లైవ్ ద్వారా పరిశీలించారు. సైట్‌లో ఉన్న సంబంధిత ఏజెన్సీ ఇంజనీర్, ఇరిగేషన్ ఇంజనీర్లతో నేరుగా సంభాషించారు. పనులు జరుగుతున్న తీరు తెన్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. శనివారం ఎంత కాంక్రీట్ వేశారు? ఎంత టార్గెట్ రీచ్ అయ్యారు? ఎన్నిగేట్లు ఫ్యాబ్రికేట్ చేశారు? అని ఇరిగేషన్ ఈఈ మల్లిఖార్జునప్రసాద్ నుండి వివరాలు తెలుసుకున్నారు.

ప్రాజెక్టు సైట్‌లో ఉండే ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌ను తనిఖీచేశారు. క్వాలిటీ ఇంజనీర్లు రెగ్యులర్‌గా సైట్‌కు వస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఫీల్డ్ ఇంజనీర్ల విధుల రికార్డులను కూడా మంత్రి హైదరాబాద్ నుండే తనిఖీ చేశారు. అన్నారం బ్యారేజీలో జరుగుతున్న అన్ని పనులను లైవ్ కెమెరాలో చూస్తూ తగిన సూచనలు చేశారు.

గత నెల డిసెంబర్‌లో ఒక లక్షా నాలుగువేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు జరిగాయని సైట్ ఇంజనీర్లు మంత్రికి తెలిపారు. జనవరి నుండి ప్రతి నెలా లక్షా 50వేల క్యూబిక్‌మీటర్ల లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఇంజనీర్లు హరీష్‌రావుకు వివరించారు. కాగా కాళేశ్వరంకు సంబంధించి ప్యాకేజీ 6, ప్యాకేజీ 8లకు గాను అవసరమైన పంపులు, మోటార్లు, ఇతర యంత్ర పరికరాలను సకాలంలో షెడ్యూల్ ప్రకారం సరఫరా చేస్తామని బీహెచ్ఈఎల్ ఉన్నతాధికారుల బృందం తెలంగాణ ప్రభుత్వానికి హామీనిచ్చింది. శనివారం ఈ బృందం ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావుతో జలసౌధలో ప్రత్యేకంగా సమావేశమైంది.బీహెచ్ఈఎల్ బృందంలో ఆ సంస్థ సలహాదారు నరేంద్రకుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ జోషి, ఈఎన్‌సి మురళీధర్, కాళేశ్వరం సిఈ వెంకటేశ్వర్లు, ఈఈ నూనె శ్రీధర్ పాల్గొన్నారు.



ఫిబ్రవరిలోగా మిడ్ మానేరు పూర్తి

మిడ్‌మానేరు ప్రాజెక్టు పనులన్నీ ఫిబ్రవరి 15లోగా పూర్తికావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు శనివారం ఆదేశించారు. పనుల పురోగతిని, భూనిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస కార్యక్రమాలను శనివారం ఆయన సమీక్షించారు. మిడ్‌మానేరు భూనిర్వాసితుల నష్టపరిహారం కోసం తప్పుడు అఫిడవిట్లు జారీచేసిన మండల అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు సందర్భంగా అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. మిడ్‌మానేరు స్పిల్‌వే పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్వాసితులకు ప్రక్కర్ల పరిహారం కోసం రూ.40కోట్లు, పునరావాసం కోసం రూ.25కోట్లు మంజూరుచేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆర్ అండ్ ఆర్ కింద రూ.1200కోట్లు చెల్లించామన్నారు.



నేడు రాష్ట్రానికి కేంద్రజలసంఘం బృందం

- మూడురోజుల పాటు కాళేశ్వరం పనుల తనిఖీ
- తుది అనుమతులపై నిర్ణయం తీసుకోనున్న కమిటీ

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను కేంద్ర జలసంఘం నియమించిన ముఖ్య ఇంజనీరు సికెఎల్ దాసు నేతృత్వంలోని బృందం పరిశీలించనుంది. ఆదివారం ఈ కమిటీ హైదరాబాద్ రానుంది. ఇప్పటికే కేంద్రం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి 206అనుమతులు ఇవ్వగా, ఇంకా పలు అనుమతులు రావాల్సి ఉంది. పెట్టుబడి ప్రయోజనం, సాగునీటి ప్రణాళికకు సంబంధించి పలు అనుమతులు కోరుతూ కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు వెళ్ళగా, దీనిపై జలసంఘం ఇంజనీర్లలో సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రాజెక్టు ద్వారా మొత్తం 225టిఎంసిల నీటిని వినియోగించుకోనుండగా, ఇందులో 180టిఎంసిలు ఒక్క మేడిగడ్డ నుండే వినియోగించుకోనున్నారు. ఆదివారం హైదరాబాద్ చేరుకుంటున్న కేంద్ర జలసంఘం బృందం మూడురోజుల పాటు కాళేశ్వరం పనుల ప్రత్యక్ష పరిశీలనకు పర్యటించనుండగా, పనులను పరిశీలించడంతో పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతోనూ సమావేశం కానుంది. నీటివినియోగం, ప్రయోజనాలపై ప్రధానంగా కమిటీ ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్లు సమాచారం.

ఇంత నిర్లక్ష్యమా?

- 15రోజుల్లో పురోగతి లేకుంటే ఏజెన్సీని మార్చేస్తాం • జూన్‌లోగా పనులు పూర్తికావాల్సిందేనని ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంత నిర్లక్ష్యమైతే ఎలా.. లక్ష్యానికి అనుగుణంగా పనులు జరగకుంటే ప్రాజెక్టు ఎలా పూర్తవుతుంది? ప్రతి రోజు వేయి క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయకుంటే ఏజెన్సీని మార్చేస్తాం అంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు అధికారులు, ఏజెన్సీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం జలసౌధలో చనాకా-కొరాటా పనులపై సమీక్ష జరిపిన ఆయన 15రోజుల్లో పనుల పురోగతి లేకుంటే సంబంధిత ఏజెన్సీలపై, అగ్రిమెంటు క్లాజ్ ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చనాకా-కొరాటా బ్యారేజీ, పంపుహౌజ్, గ్రావిటీకెనాల్, సబ్‌స్టేషన్‌లు, టవర్ల నిర్మాణం, గెట్ల నిర్మాణం, బిగింపు తదితర పనులను హరీష్‌రావు సమీక్షించారు.

ఈ ప్రాజెక్టు పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి నెలాఖరులోపు బ్యారేజి పియర్స్‌ను బ్రిడ్జి లెవెల్‌వరకు లేపాలని, ఈ లోగా గేట్ల మ్యానుఫాక్చరింగ్ పూర్తిచేయాలన్నారు. వెనువెంటనే గేట్లు బిగించాలన్నారు. జనవరి 15లోపు సర్జ్‌పూల్ డిజైన్, డెలివరీ సిస్టం, ప్రజర్ పైప్‌లైన్ వ్యాలీ క్రాసింగ్ డిజైన్లను పూర్తిచేయాలని సిడిఓ సిఈని ఆదేశించారు. మిగిలిన పైప్‌లైన్ నిర్మాణాన్ని మార్చి చివరిలోగా పూర్తిచేయాలని హరీష్‌రావు కోరారు. పవర్‌లైన్స్ ఏర్పాటుకు 11లొకేషన్స్‌లో భూ యాజమానులతో ఇబ్బందులు ఉన్నట్లు ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు మంత్రికి తెలిపారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగురామన్నతో హరీష్ ఫోన్‌లో మాట్లాడారు. రెండు, మూడురోజుల్లో సమస్యను పరిష్కరించాలని హరీష్‌రావు కోరారు. ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు, ఈఎన్‌సిలు మురళీధర్‌రావు, ఎస్ఈ అంజాద్ హుస్సేన్, ఈఈ, డిఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.





టీఎన్జీవోలు రాష్ట్రప్రభుత్వ కుటుంబ సభ్యులు

నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ : తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో టీఎన్‌జీవోల సంఘం 2018 డైరీని ఎంపీ కవిత ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కవిత మాట్లాడుతూ టీఎన్జీవోలు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. సంఘంలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉద్యోగులున్నారని వారందరినీ అన్ని విధాలుగా ఎలాంటి కష్టాలు లేకుండా ఆదుకోవడమే కేసీఆర్ ధ్యేయమన్నారు. టీఎన్జీవోల సంఘ భవనానికి ఎంపీ, ఎమ్మెల్యేల నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేస్తానని ఎంపీ కవిత హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం 1969లో జరిగిన ఉద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం వరకు జరిగిన పోరాటంలో ఉద్యోగుల పాత్ర కీలకంగా నిలిచిందన్నారు. 1985లో ఎన్టీఆర్ హయంలోనే ఉద్యోగులు పోరాటం చేసి జీవో 610ని సాధించుకోవడం గొప్ప విషయమన్నారు.

ఉపాధి పనులకు రూ. 500కోట్లు

- మార్చినాటికి పనులు పూర్తి
- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఉపాధి హామీ పనులకు రూ. 500కోట్లు అందు బాటులో ఉన్నాయని ఈ నిధులతో మార్చినాటికి ఎంపిక చేసిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా గ్రామీణాభివద్ధి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఉపాధిహామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వందరోజులు పని కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. రానున్న మూడు నెలల కాలంలో కనీసం రూ500కోట్ల విలువనైన పనులు చేయించాలన్నారు. ఉపాధి పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పంచాయతీ భవనాలు , వైకుంఠ ధామాలు, స్కూల్ టాయిలెట్స్, ఫార్మ్ పాండ్స్ వంటి కార్యక్రమాలన్నింటినీ మార్చి31 నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది చివరినాటికి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా లక్ష్యంగా పెట్టుకుని పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు సంబంధించి సస్పెండ్ అక్కౌంట్స్‌లో జమ అయిన డబ్బులు బ్యాంకు లేదా తపాలా కార్యాలయ ఖాతాల్లో జమచేయించాలన్నారు. ఉపాది పథకం కింద పండ్లతోటల పెంపకం లక్ష్యం పూర్తిచేయాలని , ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.



ప్రతిగ్రామంలో పనులపై మైక్ ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. హరిత హారంలో నాటిన మొక్కలను సంరక్షించడంతోపాటు వచ్చే సంవత్సరంలో మొక్కలను నాటడానికి కావలసిన నర్సరీలను పెంచేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవలని సూచించారు.

రూర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్‌లలో పనులు ప్రారంబించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వాటర్ షెడ్ కార్యక్రమంలో చేపట్టిన పనులను వేగంగాపూర్తిచేసి భూగర్భ జలాలను పెంపొందించే ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమీషనర్ నీతూ ప్రసాద్‌తోపాటు సైదులు, జాన్ వెస్లీ తదితర అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పునరుద్ధరణకు రూ.13.15కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో 37చెరువులను మిషన్ కాకతీయ-4కింద చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం దీనికి సంబంధించి రూ.13.15కోట్లు మంజూరుచేసింది. వికారాబాద్ జిల్లాలో మరో రెండు చెరువులకు రూ.21.27లక్షలు మంజూరుచేసింది.



జనసేనాని ట్వీట్ హల్‌చల్

అమరావతి, ఆంధ్రప్రభ: సంచలనాలకు కీలకమైన జనసేనాని పవన్‌కల్యాణ్ తాజాగా చేసిన ట్వీట్లు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలకు నిలయమైన సోషల్ మీడియా ద్వారానే జనసేనాని తాజా అంశాలపై స్పందించిన తీరు హల్‌చల్ చేస్తోంది. ''వ్యక్తిత్వంలో నన్ను ఓడించడం చేతగాని వాళ్లే .. కులం,ధనం,వర్ణం గురించి మాట్లాడతారు '' అంటూ శనివారం పవన్ ట్వీట్ చేయడం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చర్చకు దారితీసింది. ఓ సీనియర్ జర్నలిస్ట్ తనకు దీన్ని ట్వీట్ చేశారని, బాగుండడంతో దీన్ని షేర్ చేసుకోవాలనిపించిందని పవన్ పేర్కొన్నారు. కులాల పరంగా విడిపోవడం, అధికారమే పరమావధిగా సాగే రాజకీయాలు ప్రస్తుత తరుణంలో పోషిస్తున్న పాత్ర ప్రమాద ఘంటికలను మోగిస్తోందన్నారు. ఇది మన ఆర్థిక మందగమనానికి కారణం అవడమే కాక, మన సమాజానికి అత్యంతకీడును కలుగజేస్తుందని చెప్పారు. గత కొంతకాలంగా సోషల్‌మీడియాలో పవన్ కల్యాణ్ అభిమానులకు,ప్రముఖ సినీ విమర్శకుడి మధ్య విమర్శల వెల్లువ కొనసాగుతున్న సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలోనే పవన్ ఈ విధంగా ట్వీట్ చేశారంటున్నారు. పరోక్షంగా సినీ విమ ర్శకుడిని ఉద్దేశించే ఈ ట్వీట్ చేశారంటున్నారు.

సింగరేణి నంబర్‌వన్ కావాలి

- త్వరలో 10మెగావాట్ల సోలార్‌ప్లాంట్ : చైర్మన్ ఎన్.శ్రీధర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి థర్మల్‌విద్యుత్ కేం ద్రం తన పనితీరును మెరుగుపరుచుకుంటూ డిసెంబర్ మాసం లో జాతీయస్థాయిలో నాల్గవర్యాంక్ సాధించడం అభినందనీయ మని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ అన్నారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంచిర్యాల జిల్లా జైపూర్ విద్యుత్‌కేంద్రం పనితీరుపై సమీక్షజరిపిన ఆయన ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలపడానికి అధికారులు, ఉద్యోగులు ప్రయత్నించాలన్నారు. డిసెంబర్ మాసంలో ఎస్టీపిపిలోని యూనిట్-1 ప్లాంట్ 100శాతం పిఎల్ఎఫ్, యూనిట్-2ప్లాంట్ 99శాతం సాధించడంపై అభినందనలు తెలిపారు. డిసెంబర్ నెలలో స్టేషన్ సాధిం చిన 99.5శాతం పిఎల్ఎఫ్ వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన 9మాసాల కాలానికి 90శాతం సగటు పిఎల్ఎఫ్‌కు ఎస్‌టిపిపి ఎదిగిందన్నారు. దేశంలోని అత్యుత్తమ 25ప్లాంట్ల జాబితాలో 4వ స్థానం సాధించగలిగిందని వివరిస్తూ ఈ ఆర్థిక సంవ త్సరంలో మిగిలిన మూడుమాసాల్లో కూడా మంచి సామ ర్థ్యంతో పనిచేసి అత్యుత్తమ పిఎల్ఎఫ్‌తో దేశంలోనే నెంబర్‌వన్ స్థానానికి ఎదగాలని అధికారులను కోరారు. ఇది సింగరేణికి, తెలంగాణ రాష్ట్రానికి మంచిపేరు తెస్తుందన్నారు. ప్లాంట్ ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి 10,658మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని, ఇపుడు రాష్ట్రప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను అందిస్తున్న నేపథ్యంలో పూర్తిసామర్థ్యంతో ప్లాంట్ నుండి విద్యుత్ ఉత్పత్తి జరిగేలా కృషిచేయాలని అధికారులకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.



10మెగావాట్ల సోలార్‌ప్లాంట్..

సింగరేణి వ్యాప్తంగా నెలకొల్పనున్న సోలార్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించిన సింగరేణి చైర్మన్ శ్రీధర్ సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో 10మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. సమీక్షలో డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎస్.శంకర్, చీఫ్ కో-ఆర్డినేటర్ ఎల్.లక్ష్మీనారాయణ, ఈడి సంజయ్‌కుమార్ సూర్, చీఫ్ ఓ అండ్ ఎం జెఎన్ సింగ్, జిఎం ఎస్టీపిపి బి.రాజేష్, జిఎం నర్సింహమూర్తి, జిఎం (సివిల్) వసంత్‌కుమార్ పాల్గొన్నారు.



గురకను నివారించే స్మార్ట్ బెడ్

వాషింగ్టన్: గురకను నివారించే స్మార్ట్ బెడ్‌ను అమెరికాకు చెందిన సెలెక్ట్ కంఫర్ట్ కంపెనీ అభివృద్ధి చేసింది. లాస్‌వెగాస్‌లో సీఈఎస్ ట్రేడ్ షోలో సదరు స్మార్ట్ బెడ్‌ను విడుదల చేసింది. ఇది పడకపై ఉన్నవారికి అనుగుణంగా తనంతటతానుగా అడ్జస్ట్ అవుతుంది. బెడ్‌లో అమర్చిన గ్యాస్ చాంబర్లు నిద్రపోతున్నవారి వీపు లేదా ఉదరానికి అనుగుణంగా పనిచేస్తాయి. సుఖవంతమైన నిద్రను అందిస్తుంది. ఇందులో గురకను కనిపెట్టే వ్యవస్థ కూడా ఉంది. ఉదాహరణకు ఎవరైనా గురకపెడుతూ నిద్రపోతున్నప్పుడు బెడ్ వారి తలను ఏడు డిగ్రీలు పైకి జరిగేలా కదులుతుంది. తాత్కాలికంగా దాని నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాక వ్యక్తుల నిద్రలేచే సమయానికి అనుగుణంగా స్మార్ట్ అలారమ్ మోగిస్తుంది. సీఈఎస్ ఇన్నోవేషన్ అవార్డుల్లో బెస్ట్ ఆఫ్ ఇన్నోవేషన్ అవార్డును స్మార్ట్ బెడ్ దక్కించుకుంది.



దీర్ఘకాలిక అనారోగ్యంతో మానసిక సమస్యలు

టొరొంటో: ఆస్మా, ఆహార అలర్జీ, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పిల్లలకు మానసిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కెనడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఆస్మా, ఆహార అలర్జీ, డయాబెటిస్ లాంటి వ్యాధులతో బాధపడుతున్న ఆరు నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలపై వాటర్‌లూ యూనివర్శిటీ పరిశోధకులు సర్వే జరిపారు. వారి తల్లిదండ్రులు చెప్పినదాని ప్రకారం పిల్లల్లో 58 శాతం మంది కనీసం ఏదో ఒక మానసిక సమస్యతో ఉన్నారు. వేర్వేరు శారీరక పరిస్థితులతో ఉన్న పిల్లలకు మానసిక సమస్య ముప్పు పొంచి ఉందని సర్వేలో తేలిందని వాటర్‌లూ యూనివర్శిటీకి చెందిన మార్క్ ఫెర్రో తెలిపారు. వైద్య నిపుణులు పిల్లల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేసే ముందు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఫలితం నొక్కి చెబుతున్నది. ఈ అధ్యయనం బీఎంజే ఓపెన్ జర్నల్‌లో ప్రచురితమైంది.

స్టిక్కర్‌తో వైర్‌లెస్ ఛార్జింగ్



వాషింగ్టన్: పలుచని లోహపు స్టిక్కర్లతో కూడిన వైర్‌లెస్ ఛార్జర్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసింది. దాని ద్వారా ఒక సన్నని ప్యాడ్‌పై ఉంచిన అనేక పరికరాలను చార్జింగ్ చేసుకోవచ్చు. ఎనర్జీ స్క్వేర్‌గా పిలిచే ఈ ఛార్జర్ ఒక ఛార్జింగ్ ప్యాడ్, ఒక స్టిక్కర్‌ను కలిగి ఉంటుంది. స్టిక్కర్‌ను ఏదైనా ఒక పరికరం వెనుక వైపు ఉంచవచ్చు. రెండు చిన్నపాటి మెటల్ డాట్‌లను సంతరించుకున్న స్టిక్కర్‌తో ఉన్న ఒక కనెక్టర్ పరికరం ఛార్జింగ్ పోర్ట్‌కు అనుసంధానమై ఉంటుంది. అప్పుడు పరికరాన్ని ప్యాడ్‌పై ఉంచి ఛార్జింగ్ చేయాలి. ఇతర వైర్‌లైస్ ఛార్జర్లు ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ ఇండక్షన్‌ను వినియోగిస్తుండగా ఎనర్జీ స్క్వేర్ మాత్రం ఎలక్ట్రిక్ కండక్షన్‌పై ఆధారపడి ఉంటుందని సీనెట్ నివేదించింది. ఇది అనేక పరికరాలను ఏకకాలంలో అత్యంత వేగంతో ఛార్జింగ్ చేయడానికి ఉపకరిస్తుంది. ఫ్రాన్స్‌కు చెందిన స్టార్టప్ తాను అభివృద్ధి చేసిన ఎనర్జీ స్క్వేర్‌ను లాస్‌వేగాస్‌లో సీఈఎస్ ట్రేడ్ షోలో ప్రదర్శనకు ఉంచింది.

రసాయనిక నిషేధంతో ఓజోన్‌కు ఊపిరి

- నాసా ప్రకటన



వాషింగ్టన్: క్లోరోఫ్లోరోకార్బన్స్(సీఎఫ్‌సీలు) గా పిలిచే మానవ నిర్మిత రసాయనాలను కలిగి ఉన్న క్లోరిన్‌పై అంతర్జాతీయ నిషేధం విధించడంతో ఓజోన్ పొర దాదాపు 20 శాతం కోతకు గురికాలేదని నాసా తెలిపింది. సీఎఫ్‌సీలు దీర్ఘకాలం పాటు మనుగడలో ఉండే రసాయనిక మూలకాలు. అవి స్ట్రాటోస్ఫియర్‌కు చేరుకుంటాయి. సూర్యుని అల్ట్రావయొలెట్ రేడియషన్‌కు విడిపోతాయి. ఓజోన్ పరమాణువులను ధ్వంసం చేసే క్లోరిన్ అణువులను విడుదల చేస్తుంటాయి. చర్మ క్యాన్సర్, కంటి శుక్లాలకు తోడు వ్యాధి నిరోధక వ్యవస్థలను అణచివేసి, మొక్క జీవజాలాన్ని ధ్వంసం చేయడానికి కారణమయ్యే అల్ట్రావయొలెట్ రేడియేషన్‌ను గ్రహించడం ద్వారా స్ట్రాటోస్ఫియర్ ఓజోన్ భూగ్రహంపై జీవజాలాన్ని పరిరక్షిస్తున్నది.

సీఎఫ్‌సీల నుంచి క్లోరిన్ అణువుల విడుదల తగ్గుముఖం పట్టడాన్ని మేం స్పష్టంగా చూశాము. దాని వలన ఓజోన్ పొర కోత తగ్గిందని నాసాకు చెందిన సుసాన్ స్ట్రాహన్ తెలిపారు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఓజోన్, ఇతర రసాయనాలు ఏ మేరకు మారుతున్నదీ నిర్ధారించేందుకు అవురా శాటిలైట్‌లో ఏర్పాటు చేసిన మైక్రోవేవ్ లింబ్ సౌండర్(ఎంఎల్ఎస్) ఇచ్చే డేటాను శాస్త్రవేత్తలు వినియోగించుకుంటారు. అది 2004 సంవత్సరం మధ్యలో నుంచి భూగోళం చుట్టూ నిరంతరాయంగా రసాయనాల స్థాయులను కొలుస్తూ ఉంటుంది. ఎంఎల్ఎస్ ప్రతి ఏడాది అందించే హైడ్రోక్లోరిక్ యాసిడ్, నైట్రస్ ఆక్సైడ్ స్థాయులను పోల్చి చూడడం ద్వారా మొత్తంగా క్లోరిన్ స్థాయులు వార్షికంగా సగటున దాదాపు 0.8 శాతం తగ్గుముఖం పడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

నేరాలు తేలకుండానే నేతలు జైళ్లకా!



(మొదటిపేజీ తరువాయి)

కూడా సంబంధం లేకుండానే వీరిపై కేసులు నమోదౌతున్నాయి. వెనువెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగిస్తున్నారు. ఆ తర్వాత వార్ని జైళ్ళకు తరలిస్తున్నారు. అయితే ఇలాంటి కేసుల్లో నేరారోపణలు రుజువవుతున్నది అతిస్వల్పం. రుజువైన నేరాల్లో కూడా పైకోర్టులు అందుకు వ్యతిరేకంగా స్పందిస్తున్నాయి. సీబీఐ కోర్టు లేదా కిందిస్థాయి కోర్టులిచ్చిన తీర్పుల్ని హైకోర్టు, సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేస్తున్నాయి. ఈ లోగానే సదరు రాజకీయవేత్తకు జరగాల్సిన నష్టం జరుగుతోంది. కేవలం రాజకీయ ప్రయోజనాలకు గండిపడ్డమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. నేరుగా వీరిని సాధారణ జైలు గదుల్లోకి నెట్టడం వల్ల ఏళ్ళతరబడి నేరం రుజువుకాకుండానే శిక్ష అనుభవిస్తున్నారు. ఏడు పదుల వయసుదాటిన లాలూ తన వృద్ధాప్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, జైలు గదిలో తీవ్రచలిగా ఉందంటూ న్యాయమూర్తికి తెలియజేసిన సందర్భంలో న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు కూడా పలు విమర్శలకు తావిస్తున్నాయి.

స్వతంత్రమొచ్చాక తొలినాటి పాలకులు నెహ్రూ, నందా, శాస్త్రిల కాలంలో ఎలాంటి ఆరోపణలకు గురికాలేదు. కానీ ఇందిర హయాం నుంచి పాలకులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం మొదలైంది. స్వప్రయోజనాల కోసం ఖజానాను తాకట్టు పెట్టారన్న విమర్శలు జోరందుకున్నాయి. అప్పటి నుంచి సాక్షాత్తు ప్రధాని స్థాయిలోని వ్యక్తి నుంచి ముఖ్యమంత్రులు, ఎంపీల నుంచి ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రుల నుంచి రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు రాజకీయ వేత్తలు, మాజీ పాలకులు కూడా జైలు ఊచలు లెక్కెట్టేసారు. వీరిలో అతికొద్దిమందిపైనే నేరారోపణలను కోర్టులు విశ్వసించాయి. వారికి మాత్రమే న్యాయస్థానాలు జైలు శిక్ష విధించాయి. ఈలోగా వీరు కోల్పోయిన సమయాన్ని గాని, పడ్డ ఇబ్బందులుగాని ఎవరూ జవాబుదారి కావడంలేదు. దేశవ్యాప్తంగా ప్రస్తుత, మాజీ పాలకులు, ప్రజాప్రతినిధులపై కేసులు నమోదయ్యాయి. సాక్షాత్తు ఇందిరాగాంధీని కూడా బోనెక్కించారు. మరో ప్రధాని చరణ్‌సింగ్‌కు కూడా జైలు జీవితం తప్పలేదు. తమిళ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జయలలితను ఆరోపణల పేరిట జైల్లో నెట్టారు. దీంతో ఆమె అర్ధంతరంగా పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. ఆమె మూడు సార్లు జైలుకెళ్ళాల్సి వచ్చింది. ఆమెపై నమోదైన అవినీతి ఆరోపణలను బెంగళూరు హైకోర్టు ధ్రువీకరించి ఆమెకు జైలు శిక్ష విధించింది. అయితే మూడుమాసాల్లోనే ఈ తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రస్తుత బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా కూడా నకిలీ ఎన్‌కౌంటర్, హత్య, మోసం, అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్నారు. వరుసగా ఐదుసార్లు గుజరాత్ శాసనసభకు ఎన్నికైన షా మీద కిడ్నాపింగ్, దొంగతనం కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పటికీ అవి రుజువుకాలేదు. కానీ ఇప్పటికీ ఆయన బెయిల్‌పైనే కొనసాగుతున్నారు. లాలూప్రసాద్ ఇప్పటికే పలుమార్లు జైలుకెళ్ళారు. దాణా కుంభకోణంతో పాటు పలు ఆరోపణలపై ఆయన అరెస్టయ్యారు. ఇన్నాళ్ళకు ఒక ఆరోపణ రుజువైంది. అయితే ఇదే ఆరోపణల్లో బీహార్ మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రాను కూడా న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. తాజా తీర్పులో మిశ్రాకు మినహాయింపు లభించింది. ఎఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి కూడా కేసులు ఎదుర్కొన్నారు. ఆయన్ను జైల్లోపెట్టారు. అయితే వెంటనే బెయిల్ లభించింది. రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ మహిపాల్ మదేర్నపై హత్య, కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. మూడేళ్ళ పాటు జైలు జీవితం తప్పలేదు. ఆ తర్వాత బెయిల్ వచ్చింది. కరుణానిధి కుమార్తె కనిమొళి దాదాపు రెండేళ్ళు జైల్లో ఉండాల్సి వచ్చింది. 2జీ కుంభకోణంలో నిధూ వర్గాల ఆరోపణల్ని కోర్టుకొట్టేయడంతో ఆమె ఈ కేసు నుంచి బయటపడ్డారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి రాజా పరిస్థితి కూడా. ఇక బీహార్‌కు చెందిన ఎంపీ పప్పుయాదవ్‌పై అక్రమ ఆయుధాలు, మర్డర్ కేసులు నమోదయ్యాయి. మరో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప కూడా గనుల కుంభకోణంలో జైలు జీవితాన్ని అనుభవించారు. అయితే ఆయనకూ బెయిల్ లభించింది. ఎంపీలను ప్రభావితం చేశారన్న అవినీతి ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ అమర్‌సింగ్ కూడా ఊచలు లెక్కెట్టక తప్పలేదు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రషీద్ మసూద్ కూడా ఇదే ఆరోపణలపై జైలుకెళ్ళారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాష్ చౌతాల టీచర్ల అక్రమ నియామకాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొని జైలు జీవితం గడిపొచ్చారు. సుఖరాం, మధుకోడా వంటి అతికొద్ది మందిపై మాత్రమే ఈ నేరారోపణలు రుజువయ్యాయి. వారికి కోర్టులు శిక్షలు ఖరారు చేశాయి. కానీ 90శాతం మందిపై ఆరోపణలు రుజువుకాలేదు. కిందికోర్టుల్లో రుజువైనా పై కోర్టులో ఆ కేసులు నిలబడలేదు.



ప్రస్తుతం లాలూప్రసాద్ యాదవ్‌కు జైలు శిక్షపడ్డ దాణా కేసు పరిస్థితి చూస్తే 1991నుంచి 1994మధ్యలో ఈ కుంభకోణం చోటు చేసుకుంది. అప్పట్లో దీని కుట్రదారులపై విచారణకు సంబంధించిన ఫైల్‌ను ముఖ్యమంత్రి హోదాలో తనవద్దే దాచిపెట్టారన్న ఆరోపణల్ని లాలూ ఎదుర్కొన్నారు. కుంభకోణం గురించి తెలిసినప్పటికీ దోపిడీని ఆయన అడ్డుకోకపోవడం ద్వారా ఖజానాకు నష్టం కలిగించారని కేసు పెట్టారు. వాస్తవానికి ఈ కేసులో లాలూతో పాటు మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రా, ఇంకో 18మంది నిందితులుగా ఉన్నారు. వీరితో పాటు మరో 14మందిని అంచెలవారీగా కేసులో చేర్చారు. ఈ 34మందిపై వ్యాజ్యాలు జరుగుతుండగా 11 మంది ఈ మధ్యకాలంలో మృతిచెందారు. 2013 అక్టోబర్‌లో దీనిపై తీర్పు వెలువడింది. అప్పట్లో జగన్నాథ మిశ్రాపై కూడా నేరారోపణ ఖరారైంది. తాజా తీర్పులో మిశ్రాను నిర్దోషిగా న్యాయస్థానం ప్రకటించింది.

రాజీవ్‌గాంధీపై కూడా బోఫోర్స్ కేసు నమోదైంది. సుమారు 20 ఏళ్ళ పాటు ఈ కేసు గాంధీ కుటుంబాన్ని వెంటాడింది. రాజీవ్‌గాంధీ ఈ కేసు కారణంగానే పదవీచ్యుతుడయ్యారు. అయినప్పటికీ ఈ కేసు దీర్ఘకాలం సాగింది. చివరకు ఇందులో తగిన సాక్షాధారాల్లేవని న్యాయస్థానం తేల్చేసింది. కానీ ఈ కేసు నెహ్రూ, గాంధీ కుటుంబాన్ని తీవ్ర అశాంతికి లోనుచేసింది. అలాగే వీరికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రాభవాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది.మయన్మార్ వంటి కొన్ని దేశాల్లో హౌస్ అరెస్టుల విధానం అమల్లో ఉంది. నేరారోపణ ఎదుర్కొంటున్న ఉన్నతస్థాయి వ్యక్తుల వార్ధక్యం, శారీరక దృఢత్వాన్ని దృష్టిలో పెట్టుకుని వీరు ఇంటి నుంచి కదలకుండా ప్రభుత్వం కట్టడి చేస్తుంది. తద్వారా వీరెవరూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనే వీలుండదు. అలాగే ఇతర కార్యకలాపాలకు కూడా దూరమౌతారు. కానీ ఈ విధానం వల్ల వారికి ఆరోగ్య, ఇతర సమస్యలు తలెత్తవు. ఇక్కడ కూడా కనీసం శిక్ష తుది ఖరారయ్యే వరకు ఇలాంటి విధానాన్ని అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వర్శిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ సాయిబాబా 95శాతం అంగవైకల్యంతో కుర్చీలకే పరిమితమైనప్పటికీ ఆయనెప్పుడో మావోయిస్టులకు అనుకూలంగా వ్యవహరించాడని, రాజ్యానికి వ్యతిరేకంగా రచనలు చేసి యువతను రెచ్చగొట్టాడన్న ఆరోపణలపై నాగపూర్‌లోని చీకటికొట్టులో బంధించారు. ఈ చలికితాను తట్టుకోలేక పోతున్నా, చలికాలం దాటే వరకు బతుకుతానన్న ఆశలేదంటూ ఆయన తన భార్యకు రాసిన లేఖ దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. 95శాతం వికలాంగుడు, మాట్లాడలేని వ్యక్తి పలురోగాలతో తీవ్రంగా సతమతమౌతున్న విద్యాధికుడి పట్ల రాజ్యం ఇంత నిర్భయగా వ్యవహరించడం అనేక విమర్శలకు తావిచ్చింది. కోర్టుల్లో ఆరోపణలు పూర్తిస్థాయిలో రుజువుకాకముందే వృద్ధ రాజకీయ నాయకుల్ని అతిభయంకర శిక్షలకు గురిచేయడం ఒక విధంగా దేశంలో రాజకీయ కక్షసాధింపుకు దోహదపడుతుందన్న విమర్శలు కూడా లేకపోలేదు.

24×7 విద్యుత్ బ్రహ్మాండం



(మొదటిపేజీ తరువాయి)

చర్యలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో దాదాపు 70 శాతానికిపైగా చిన్న, సన్నకారు రైతులు ఉన్నందున వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడం శుభపరిణామమని తెలిపారు.

రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న నినాదంతో ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తుండడం, అదే సమయంలో ఉచిత విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేయడం, తాజాగా పెట్టుబడి రాయితీ పథకం పేరుతో ఎకరాకు రూ.8వేల చొప్పున నగదు అందించాలని నిర్ణయించడం ఇవన్నీ దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదన్నారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న తెలంగాణ జిల్లాల్లో 90శాతం వ్యవసాయ భూములు బోరుబావులపైనే ఆధారపడి ఉన్నాయని, వాటికి 24 గంటల విద్యుత్ ఇస్తే ఎంతో మేలు చేసినట్లవుతుందని గుర్తించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పంటనష్టం లేకుండా సాగునీటిని అందుబాటులో ఉంచడం ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడమే కాకుండా రైతు కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. ఇదే సహకారాన్ని, చేయూతను కొనసాగించడంతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా తెలుసుకుని రైతులకు మరింత మేలు చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికే లక్షలాది రైతు కుటుంబాల ఆదరాభిమానాలు చూరగొన్న తెలంగాణ సీఎం భవిష్యత్తులో వారికి తోడుగా నిలవాలని లేఖలో అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి, కేసీఆర్ కుటుంబానికి, రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యమ నేతలకు పదవులు




(మొదటిపేజీ తరువాయి)

ఖాయమన్న సంకేతాన్ని పార్టీ దీనిద్వారా అందించింది. ఇదే క్రమంలో ప్రతి జిల్లాలోనూ.. ఖాళీగా ఉన్న డైరెక్టర్ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లను మాత్రమే నియమించిన ప్రభుత్వం డైరెక్టర్లను నియమించలేదు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ పదవులు, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు అన్నీ కలిపి వందల్లోనే ఉన్నాయి. ఇప్పటికే పూర్వ జిల్లాలకు సంబంధించి.. మంత్రులు, ఆ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీచైర్మన్లతో ఉమ్మడి సమావేశం నిర్వహించి అర్హత ఉన్న నాయకుల పేర్లు, కార్యకర్తల పేర్లతో జాబితా రూపొందించారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి మంత్రి ఈటల రాజేందర్ నేతృత్వంలో పలుమార్లు సమావేశమైన నేతలు.. ప్రతి నియోజకవర్గం నుండి అర్హులైన నేతల పేర్లతో భారీ జాబితా రూపొందించారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ సమావేశం జరగ్గా.. గతంలోనే ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ప్రతిపాదనలు అందజేశారు. నూతన సంవత్సర వేళ.. ఖాళీల భర్తీపై, పదవుల బొనాంజాపై అందుతున్న సంకేతాలు టిఆర్ఎస్ వర్గాల్లో మళ్ళీ చర్చనీయాంశమయ్యాయి. తమకు పెద్దదిక్కుగా భావించే నేతల వద్దకు మళ్ళీ నియోజకవర్గస్థాయి, మండల స్థాయి ముఖ్యనేతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్థికసంస్థను కూడా ఏర్పాటుచేసిన ప్రభుత్వం.. ఇప్పటికే కార్పొరేషన్ పదవులను భారీగానే భర్తీచేసింది. ఇంకా మిగిలిఉన్న కార్పొరేషన్లతో పాటు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవులు, జిల్లా డైరెక్టర్ పదవులకు సంబంధించి భర్తీ జాబితా త్వరలోనే వెలువడనుంది. ఈనెలలోనే పదవుల జాబితాలు వస్తాయని, 300నుండి 400పదవులు భర్తీకి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని టిఆర్ఎస్ వర్గాలలో చర్చ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు కలిపి ఒకేసారి జాబితాలు విడుదల చేయాలా.. ఒక్కో జిల్లా జాబితాలు ఒక్కోరోజు విడుదల చేయాలా అన్న చర్చలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. 2019ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, పార్టీకి ఉపయోగపడేవారికి, బలమైన నేతలకు ప్రాధాన్యం లభించనుంది. ఇప్పటికే పార్టీ రాష్ట్రకమిటీ, కార్పొరేషన్ చైర్మన్ల నియామకంతో ముఖ్యనేతల్లో సంతోషం ఉండగా, నియోజకవర్గాల్లో కీలకంగా ఉండే నేతలకు మార్కెట్ పదవులు తప్ప మరేం దక్కలేదు. రాష్ట్రడైరెక్టర్, జిల్లా స్థాయి పదవులపై అనేకమంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ జాబితాలు వస్తే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు కూడా ఉపశమనం కలగనుంది.

జల సంరక్షణకు జీవం

- మరో బృహత్ కార్యక్రమానికి మున్సిపల్ శాఖ శ్రీకారం
- జలం-జీవం పేరుతో జల సంరక్షణకు నాంది
- పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం
- భవిష్యత్తులో నీటి సమస్యలకు చెక్
- నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త సంవత్సరంలో మరో బృహత్ కార్యక్రమానికి మున్సిపల్ శాఖ శ్రీకారం చుడుతోంది. జలం-జీవం పేరుతో జలసంరక్షణకు నడుం బిగిస్తోంది. భవిష్యత్తుల్లో నీటి కష్టాలు తలెత్తకుండా....ఉన్న నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం....భూమి మీద పడే ప్రతి వర్షపు నీటి బొట్టును భూగర్భంలో దాచుకునే విధంగా ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా రానున్న కాలంలో పెద్దఎత్తున నీటి గుంతల నిర్మాణం చేపట్టడంపై దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తలెత్తుతున్న నీటి సమస్యను చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇంకుడు గుంతల నిర్మాణం నిబంధనలను విధిగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా.... సంబంధిత భవన నిర్మాణ దారులు పట్టించుకోకపోయినా సరే....పెద్దఎత్తున జరిమానాలు విధించాలని తలపెట్టారు. ముఖ్యంగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో వేసవి కాలంలో తలెత్తున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇంకుడు గుంతల నిర్మాణాన్ని విధిగా అమలు చేసే విధంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు.

వాస్తవానికి హైదరాబాద్ వంటి పట్టణంలో తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక జాగ్రత్తలను తీసుకుంది. నగరానికి నలుమూలల నీటిని నిల్వచేసుకునేందుకుగానూ రిజర్వాయర్లను నిర్మిస్తోంది. అయితే నీటి సమస్యను పరిష్కరించడానికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటీ భూగర్భంలో అసలు నీరు నిల్వలేకపోతే ఎన్ని కార్యక్రమాలను చేపట్టినా ఆశించిన విధంగా ఫలితాలు వచ్చే అవకాశాలు లేవు. పైగా నగరం, శివారు ప్రాంతాలు రోజురోజుకు శరవేగంగా విస్తరిస్తోంది. పెద్దఎత్తున బహుళ అంతస్థల భవనాలు వెలుస్తున్నాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. దీంతో గ్రామాల నుంచి, ఇతర రాష్ట్రా ల నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడే వారి సంఖ్య ప్రతిసంవత్సరం అనూగ్యంగా పెరుగుతోంది. ఫలితంగా ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోకపోతే భవిష్యత్తులో మళ్ళీ గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల మేరకు నడచే పరిస్థితి తలెత్తనుంది. అలాగే నీటి కుళాయిలు, వాటర్ ట్యాంకర్ల వద్ద పానిపట్టు యుద్ధలనుచూడాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని గ్రహించిన మంత్రి కేటీఆర్ మరింత ముందస్తు చూపుతో ఇంకుడు గుంతల నిర్మాణం ఇకపై మొక్కుబడిగా కాకుండా అందరిభాగస్వామ్యంతో ఒక ఉద్యమంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే జల సంరక్షణ కోసం జలం-జీవం కార్యక్రమానికిశ్రీకారం చుడుతున్నట్లు మంత్రి కేటీఆర్ స్వయంగా వెల్లడించారు. ప్రస్తుతం నగరంలో నీటి కష్టాలు ఉన్నాయని....ఇవి రావొద్దనే ఉద్దేశంతోనే ఇంకుడు గుంతల ఏర్పాటు చేయాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 300 చదరపు మీటర్ల స్థలంలో....ఆపైనా నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులు విధిగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గతంలోనే ఈ ఉత్తర్వులను జారీ చేసినప్పటికీ సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. నగరంలో వేల సంఖ్యల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నా.... వందల సంఖ్యలో కూడా ఇంకుడు గుంతల నిర్మాణంజరగడం లేదన్నారు. అందుకే రాబోయే ఆరునెలలలోపు ప్రతి ఇంటిలో ఇంకుడు గంత ఉండాల్సిందేనన్నారు. దీని కోసం ప్రత్యేకంగాఒక కార్యచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని కుత్బుల్లాప్రాంతంలో మన నగరం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన తెలిపారు. నీటి కొరత అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉందని, ఇది ఒక నగరానికో....దేశానికే పరిమితం కాలేదన్నారు. అందుకే భూగర్భజలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆ దిశగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో మరింత చైతన్యవంతం తీసుకవచ్చే విధగా చూడాలన్నారు.




బడ్జెట్ తీరు మారాలి



(మొదటిపేజీ తరువాయి)

ట్రెజరీ టీమ్ ఏర్పాటు చేస్తారు. దీనికి రాజకీయాలతో సంబంధం ఉండదు. పూర్తిగా అధికారులే ఇందులో ఉంటారు. దీనికి ఛాన్సలర్ స్థాయి అధికారి అధిపతిగా వ్యవహరిస్తారు. ఈ బృందమే ప్రజల అవసరాలు, ఆకాంక్షల్ని అధ్యయనం చేస్తుంది. వాటిని ప్రధాని కార్యాలయంతో చర్చిస్తుంది. అందుబాటులో ఉన్న నిధుల్ని బట్టి కేటాయింపులు జరుపుతుంది. ఈ బృందమే బ్రిటీష్ పార్లమెంట్‌కు బడ్జెట్‌ను సమర్పిస్తుంది. అమెరికాలో ఫెడరల్ బడ్జెట్ రూపకల్పనకు ప్రతిఏటా అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తుంటారు. ఫిలిప్పీన్స్‌లో అయితే వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన బృందాన్ని నియమిస్తారు. వీరే బడ్జెట్ అకౌంట్‌బులిటీ, బడ్జెట్ ఎగ్జిక్యుషన్‌లు నిర్వహిస్తారు. ఫిలిప్పీన్స్‌లో జీరో బేస్డ్ బడ్జెట్‌ను అమలు చేస్తున్నారు. విధానం ఏదైనా అన్ని దేశాలు ప్రజావసరాలకు అనుగుణంగానే బడ్జెట్ రూపకల్పన చేస్తున్నాయి. గతంలో కొందరు ప్రధానులు, ముఖ్యమంత్రులు ప్రవేశపెట్టిన పార్టీల ప్రయోజనాల వారీ బడ్జెట్‌కు ఇప్పటికైనా తిలోదకాలివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణను ఆదర్శంగా భావించాలని ఉద్బోధిస్తున్నారు.




ఎనర్జీ కోడ్ అమలుచేస్తేనే అనుమతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య, గృహ నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ విధానంలో మంజూరుచేస్తూ, ఆయా నిర్మాణాలు ఈసీబీసీ (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్) విధానాన్ని తప్పనిసరిగా అమలుచేసేలా చూస్తున్నామని పట్టణ పరిపాలన, ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. శనివారం ఆస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) లో నిర్వహించిన కన్సల్టెంట్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్ నగరం తెలంగాణ రాష్ట్రానికి హై టెక్ రాజధానిగా ఉందని, దేశం మొత్తంమీద తెలంగాణ 12వ పెద్ద రాష్ట్రమని కేటీఆర్ వెల్లడించారు. ఎనర్జీ కోడ్‌ను అమలుచేసే విధంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ఈసీబీసీ విధానం అమలు ద్వారా అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరం గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓరాకిల్, సిస్కో, ఫెడ్‌ఎక్స్, ఇన్ఫోసిస్, ఆమెజాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. ముఖ్యంగా ఆయా సంస్థలు ఇటీవల విద్యుత్‌ను ఆదా చేసే అంశాలపై దృష్టిసారించాయన్నారు. ఈసీబీసీ విధానంలో నిర్మాణం అవుతున్న భవనాలు, కిటికీలు, విద్యుద్ధీకరణ, నిర్మాణానికి ఉపయోగించే సామాగ్రి, వెలుతురు, భవనాల ప్రాంగణంలో గార్డెనింగ్ తదితర అంశాలకు నిర్మాణదారులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని కేటీఆర్ తెలిపారు. సమావేశంలో ఆస్కీ, ఎన్‌డీఆర్‌సీ, ఐఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లకు చెందిన అధికారులు రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుని కోడ్‌ను రూపొందించనున్నారు.

సమస్యల పరిష్కార వేదిక ‘మన నగరం’

- ప్రధాన సమస్యలకు తక్షణ పరిష్కారం
- ప్రజలతో కేటీఆర్ ముఖాముఖి
- నగర అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడమే ముఖ్య ఉద్దేశం



మియాపూర్, ప్రభన్యూస్: నగర అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడమే మన నగరం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఐటీ, పురపాలక శాఖమంత్రి కేటీఆర్ తెలిపారు. శనివారం మియాపూర్ విశ్వనాథ్‌గార్డెన్స్‌లో మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్‌లకు సంబంధించి నగర మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన మన నగరం కార్యక్రమానికి మంత్రి కెటీఆర్ ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కెటీఆర్ మాట్లాడుతూ మన నగరం వేధిక ద్వారా సమస్యలు పరిష్కారాలు చేసుకోవచ్చన్నారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ వేధిక ఉపయోగపడుతుందన్నారు. సుమారు కోటి మంది వరకు నివాసముండే నగరంలో అందరం కలిసికట్టుగా వెళ్తేనే అభివృద్ధి సాధ్యమని మంత్రి వివరించారు.

చెత్తను విడదీద్దాం..అద్భుతాలు సృష్టిద్దాం...

ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా విదదీయడం ద్వారా అద్భుతాలు సృష్టిచవచ్చని మంత్రి కెటీఆర్ తెలిపారు. స్వచ్ఛ హైదరాబాద్‌కు తడి, పొడి చెత్తను వేరు చేయడానికి రాష్ట్రంలో ఏ నగరంలో లేని విధంగా హైదరాబాద్ నగరవాసులకు ఇంటింటికి రెండు డస్ట్‌బిన్‌ల చొప్పున 44 లక్షలతో డస్టుబిన్‌లు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. అయితే ఈ డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చేత్త కాకుండా పప్పులు, ఇతర నిత్యావసర వస్తువులను నిల్వ చేస్తున్నారని మంత్రి విచారం వ్యక్తం చేశారు. మార్పు అనేది మన నుండే రావాలని, ఇందుకుగాను మన ఇంటి నుండే తడి, పొడి చెత్త వేరు చేయడం, ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం చేయాలని మంత్రి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తడి, పోడి చెత్త ద్వారా చెత్తను సేంద్రియ ఎరువులను తయారు చేయడం, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తికిగాను జవహర్‌నగర్‌లో 20 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కోటికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్ లాంటి నగరంలో సిటీ నిర్వహణ అనేది కేవలం జిహెచ్‌ఎంసి, ఎమ్మెల్యే, కార్పొరేటర్లతోనే సాధ్యం కాదని, తప్పనిసరిగా నగర మౌలిక సదుపాయాల నిర్వహణలో పౌరుల భాగస్వామ్యం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో తాగునీటి కొరత, విద్యుత్ కోతలను పూర్తిగా నివారించామని, మున్ముందు నీటి ఎద్దడి రాకుండా నిర్మించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జలం..జీవం...కార్యక్రమం పేరుతో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛ హైదరాబాద్‌లో చేసిన 400 యూనిట్లకు ఒక ప్రత్యేక అదికారిని నియమించి వంద శాతం ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో రోడ్ల పరిస్థితిని చక్కదిద్దే కార్యక్రమం మొదలైందని పేర్కొన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాన్ని 3,100 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శివారు ప్రాంతాలకు 2వేల కోట్ల వ్యయంతో మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఈ సంవత్సరం పూర్తి చేశామని, వచ్చే సంవత్సరం అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంబిస్తామని మంత్రి కెటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, చేవేళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జిహెచ్‌ఎంసి కమిషనర్ బి. జనార్దన్‌రెడ్డి, జలమండలి ఎండి దానకిషోర్, హైదరాబాద్ మెట్రోరైలు ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, వెస్టుజోన్ జడ్సీ హరిచందన తదితరులు హాజరయ్యారు.



ఢిల్లీ పిలుపు.. ఓ మెరుపు!

కొత్త సంవత్సరం మీద కోటి ఆశలు.. ఆశయాలుంటాయో లేదో చెప్పలేం గాని ఆశలు మాత్రం ఉంటాయి. జీవితంలో అనుకోని మలుపులు ఉండాలని కోరుకుంటారు. ఆ మలుపుల్లో మెరుపులే ఉండాలి గాని మరకలు ఉండకూడదనీ భావిస్తారు. 2018 సంవత్సరం మాత్రం ఎంతమందికి ఎన్నెన్ని మెరుపులు తెచ్చింది? ఎంతెంత మరకలతో మొదలైంది? ఓసారి అవలోకిస్తే ప్రారంభమే ఓ కలగాపులగపు మలుపులతో మొదలైనట్టు తోస్తుంది.

ఈ కొత్త సంవత్సరం ప్రారంభంలో ఎక్కువగా ఆనందించే నాయకుల్లో మొదటగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుణ్ణి చెప్పుకోవాలి. అవును. నిజంగా ఇది ఆయనకు ఓ శుభ ఘడియే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనతో కలిసి మాట్లాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యల మీద చర్చించి ఒక అవగాహనకు రావాలని సంకల్పించడం కన్నా శుభ పరిణామం చంద్రబాబుకి ఇంకేమీ ఉండదు. కొద్ది నెలలుగా వారిద్దరి మధ్యా రాజకీయ సత్సంబంధాలు సరిగా లేవని వరస సంఘటనలు తేటతెల్లం చేశాయి. ఇద్దరు రాజకీయ నేతల మధ్య సంబంధాలు అన్నివేళలా సజావుగా ఉండాలన్న నియమమేమీ లేదు. అందులోనూ భారతదేశపు ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ సంబంధాలు ఎప్పటికప్పుడు కొత్తకొత్త నిర్వచనాలను వాటికవే సంతరించుకుంటూ చీకటి వెలుగుల మాదిరి మారుతుంటాయి. కాని ఒక ప్రధానమంత్రి-ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్య సంబంధాలు మాత్రం వ్యక్తిగతం కాదు. అవి రాజ్యాంగ చట్రానికి లోబడి నడిచేవి. పాలకులుగా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పదవులు అవి. ఈ కోణంలో చూసినప్పుడు నిస్సందేహంగా వారిద్దరి మధ్య ఏదో తెలీని అగాధం నెలకొన్నట్టు మాత్రం అర్థమవుతున్నది. ఆ అగాధం పెద్దదా చిన్నదా అన్న మీమాంస కూడా ఉన్నది. అయితే ప్రధానమంత్రి తాజాగా తీసుకున్న నిర్ణయంతో అది చాలా చిన్న అగాధమేనని అనుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఏర్పడుతున్నది. పోలవరం అంశం అటు కేంద్ర ప్రభుత్వానికి ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య దూరాన్ని పెంచిందన్న అభిప్రాయాలు వ్యాపించి ఉన్నాయి. దానికి తోడుగా కొన్ని పాత అంశాలు తోడయ్యాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశం ఈ మొత్తం సంక్షోభానికి బీజం వేసింది. ఎడ్డెం అంటే తెడ్డెం అన్నట్టు.. నువ్ తమలపాకుతో ఒకటంటే.. నేను తలుపు చెక్కతో ఒకటంటా అన్నట్టు.. అది పెరిగి పెరిగి పెద్దదైంది. ఫలితంగా ఎన్నో అపోహలు.. అపార్థాలు.. మధ్యలో పోలవరం వ్యవహారం పూర్తిగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ పరిణామం అగ్నికి ఆజ్యం తోడైనట్టయిందా..లేక సమస్య దూదిపింజలా తేలిపోవడానికి మలుపైందా.. అంచనా వేయడానికి చంద్రబాబుకే చాలా సమయం పట్టింది. అందుకే ఒక దశలో ఆయన నిష్ఠూరమాడేంత వరకు వెళ్లారు. మొత్తానికి కేంద్ర వైఖరితో.. ప్రత్యేకించి ప్రధాని మోడీ తన పట్ల వ్యవహరిస్తున్న తీరుతో చంద్రబాబులో అశాంతి.. అసహనం.. ఆవేదన.. ఆలోచన.. ఆవేశం.. ఆక్రోశం.. పెల్లుబికాయి. స్వతహాగా ఆచితూచి మాట్లాడటం.. ఆగి ఆగి స్పందించడం.. ఆలోచించి చర్చలు తీసుకోవడమే ఆభరణాలుగా పేరొందిన చంద్రబాబు ఈ విషయంలో యాష్టపడి.. తెల్లారేసరికి మళ్లీ సర్దుకుని తేరుకున్నారు. తనలోని రాజనీతిజ్ఞతను అవసరమైన సమయంలో అవసరమైనంత మేర ప్రయోగించి పరిస్థితి చేయి దాటి వెళ్లకుండా తనకు తానే జాగ్రత్త పడ్డారు. అంతిమంగా అదే ఆయనకు శ్రీరామరక్ష అయినట్టుంది. ప్రధాని మోడీ నుంచి సంకేతం వచ్చింది. సందేశం అందింది. నిజానికి అదీ నాటకీయంగానే జరిగింది. రాష్ట్రస్థాయిలో బీజేపీ-తెలుగుదేశం నాయకులు ఉప్పు-నిప్పు మాదిరి ప్రకటనల పోరాటంలో తలమునకలై ఉన్న తరుణంలో ఆ రెండు పార్టీల ఎంపీలు ఢిల్లీలో సరికొత్త ప్రయోగం చేశారనే చెప్పుకోవాలి. అందుకు వారిని అభినందించాల్సిందే. తమ మధ్య మనస్పర్థలు లేవని.. అవసరమైతే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కటవుతామని చేతల ద్వారా నిరూపించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల చివరి రోజున ప్రధానమంత్రి మోడీని కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలను ఒక చిట్టా రూపంలో సమర్పించి.. సరికొత్త లాబీయింగ్‌కు తెరతీశారు. అది సత్ఫలితాన్నే ఇచ్చింది. ప్రధానమంత్రి మోడీ కూడా ఊహకందని విధంగా స్పందించారు. అంతకుముందు వాతావరణం చూస్తే ఆయనలా స్పందించడం నిజంగా ఏదో అదృశ్య శక్తి ఆవహించినట్టే అనుకోవాలనిపిస్తుంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అప్పాయింట్మెంట్ ఇవ్వడానికి ఆయనకు మనస్సు రావడం లేదని ఇన్ని నెలలుగా ఒక అభిప్రాయం ప్రచారంలో ఉంది. అలాంటిది మోడీ హృదయాంతరాల నుంచి స్పందించినట్టు అనిపించింది. రాష్ట్రబాగోగులబాధ్యత తనకు వదిలేయాలని ఆయన అనడం ద్వారా చాలా పెద్ద బాధ్యతను తన భుజస్కంధాల మీద వేసుకుంటున్నట్టు తనకు తానుగా అంగీకరించినట్టయింది. చంద్రబాబుని పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఇంకాస్త ముందుకెళ్లి ఆయనే హామీ ఇవ్వడం.. ఆడబోయే తీర్థం ఎదురైనట్టుగానే భావించాలి. చంద్రబాబు త్వరలోనే ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీతో భేటీ అయితే... ఇదే పెద్ద విజయమవుతుంది. మోడీతో ఒకసారి భేటీ అయితే ఆ తర్వాత ఇంకొన్ని భేటీలకు అది మార్గం వేస్తుంది. తద్వారా ముందర.. వాళ్లిద్దరి మధ్య.. వాళ్లిద్దరి ప్రమేయం లేకుండానే.. వాళ్లిద్దరికీ తెలీకుండానే.. ఏర్పడిన మంచుపొగ కరిగిపోతుంది. ఒక్కసారి అది కరిగితే భవిష్యత్ మార్గం స్పష్టమవుతుంది. ఒకసారి జరిగిన పొరపాటు మళ్లీ జరగదు. అంతిమంగా ఇదంతా రాష్ట్రానికే ప్రయోజనకరం. అందులోనూ ఎన్నికల సమయం దగ్గరపడుతున్నవేళ ఈ సంక్షోభం ఇంకా సాగడం ఉభయులకీ క్షేమదాయకం కాదని ప్రధాని మోడీ భావించి ఉండొచ్చు. అందులో భాగంగానే ఈ కసరత్తు మొదలై ఉండొచ్చు. కారణం ఏదైనా సమస్య పరిష్కారానికి ఉద్దేశించిన భేటీ కాబట్టి మిగతా వాటికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజకీయాలన్నాక రాజకీయ ప్రయోజనాలు లేకుండానే ఇలాంటి దౌత్యాలు జరుగుతాయని అనుకోలేము. మొత్తం మీద చంద్రబాబుకి ఇది శుభ శకునం. ఇంతకాలం ఆయనలో పేరుకుపోయిన అసంతృప్తి కరిగిపోతుంది. వాజ్‌పేయి, దేవెగౌడ లాంటి నేతలు ప్రధానమంత్రులుగా ఉన్న తరుణంలో తానే అంతా అయి ఢిల్లీలో చక్రం తిప్పిన రోజుల్ని అనుక్షణం గుర్తుచేసుకునేలా మోడీ వ్యవహరించిన నేపథ్యంలో చంద్రబాబు కొత్త ఉత్సాహంతో మోడీ దగ్గరకు వెళ్లి.. ఆయన అభిమానాన్ని చూరగొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక్కసారి భేటీ అయితే భవిష్యత్ మార్గాన్ని తనకు తానే వేసుకునేలా చంద్రబాబు జాగ్రత్తలు తీసుకోగలరు. అందులోనూ ఒకసారి దెబ్బ తిన్నతర్వాత ఆయన మరింత జాగ్రత్త పడతారు. ఇక కొత్త సంవత్సరంలోని మరో పార్శ్వాన్ని చూస్తే.. డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా డ్రంకెన్ అండ్ డ్రయివ్ కేసులు.. పోలీసుల ఛేజింగ్... ఇదొక కొత్త సంస్కృతిలాగా వెంటాడుతోంది. ఏటికేడాది ఇలాంటి కేసులు పెరుగుతున్నాయే గాని తగ్గడం లేదు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో సైతం ఆ రాత్రి జరిగిన డీజేలు అందర్నీ పునరాలోచనలో పడేస్తున్నాయి. హైదరాబాదులో మద్యం సేవించి.. అదీ అమితంగా.. కాస్తంత ముతకగా చెప్పాలంటే.. పీకల దాకా తాగి.. కారు నడుపుతూ పట్టుబడ్డ టీవీ యాంకర్ ప్రదీప్ ఉదంతం కొత్త సంవత్సరం మొదటి వారమంతా తెలుగు రాష్ట్రాల్లో ఒక వినోదంలా మారింది. మద్యం సేవించి వాహనం నడపొద్దని సోషల్ మీడియాలో సుద్దులు చెప్పిన ఓ సెలెబ్రిటీ అదే నేరం చేసి పట్టుబడితే... సమాజం దాన్ని ఎలా తీసుకోవాలి? ఇది ఒక ప్రదీప్ విషయం కాదు. సామాన్యులు సెలెబ్రిటీలను భిన్నంగా చూస్తారు. వారిని అనుకరించడానికి, అనుసరించడానికి ప్రయత్నిస్తారు. అలాంటిది సెలెబ్రిటీలు తమ సహజ వ్యక్తిగత జీవితాలకు భిన్నంగా నీతిబోధనలు చేస్తే.. వాటికి విలువేముంటుంది? అప్పటిదాకా ఆ మాటలను వేదవాక్కులుగా నమ్మిన జనం సంగతేమిటి? ప్రతి వ్యక్తిలోనూ ఒక అపరిచితుడు ఉంటాడు. ఆ అపరిచితుడు ఎల్లవేళలా అందరికీ కనిపించడు. వాణ్ని లోలోనే బలవంతాన నిద్రపుచ్చుతారు. కాని అతను నిద్రలేస్తే అసలు నిజం జడలు విప్పుతుంది.



ఆటలో అరటిపండు మాదిరి గజల్ శ్రీనివాస్ ఉదంతం. సమాజంలో ఒక స్థాయికి చేరిన సెలెబ్రిటీలు వ్యక్తిగత జీవితాల్లో సైతం నైతికతను పాటించకపోతే చివరకు ఇలాంటి వైపరీత్యాలే జరుగుతాయని ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది. మసాజ్.. ఫిజియోథెరపీ.. ఈరెంటికీ తారతమ్యాన్ని సామాన్య జనం గ్రహించలేరన్న ఓ భ్రమ ఇంత దూరం తెచ్చి ఉంటుందేమో. ఆఫీసుల్లో ఫిజియోథెరపీ చేయించుకోవడం ఎంతవరకు సబబు? అది ఫిజియోథెరపీ అవుతుందా? ఇలాంటి ప్రశ్నలు ఈ ఉదంతంలో సమాధానాల్లేనివిగానే మిగిలిపోతున్నాయి. ఇదంతా నైతిక విలువలకు సంబంధించినవి. నైతికత అంటే ఏమిటి అన్న ప్రశ్నపైనే ఆధారపడాలనుకుంటే ఇక సమస్యే లేదు.

ఆటలో అరటిపండు మాదిరి గజల్ శ్రీనివాస్ ఉదంతం. సమాజంలో ఒకస్థాయికి చేరిన సెలెబ్రిటీలు వ్యక్తిగత జీవితాల్లో సైతం నైతికతను పాటించకపోతే చివరకు ఇలాంటి వైపరీత్యాలే జరుగుతాయని ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది. మసాజ్.. ఫిజియోథెరపీ.. ఈరెంటికీ తారతమ్యాన్ని సామాన్య జనం గ్రహించలేరన్న ఓ భ్రమ ఇంత దూరం తెచ్చి ఉంటుందేమో. ఆఫీసుల్లో ఫిజియోథెరపీ చేయించుకోవడం ఎంతవరకు సబబు? అది ఫిజియోథెరపీ అవుతుందా? ఇలాంటి ప్రశ్నలు ఈ ఉదంతంలో సమాధానాల్లేనివిగానే మిగిలిపోతున్నాయి. ఇదంతా నైతిక విలువలకు సంబంధించినవి. నైతికత అంటే ఏమిటి అన్న ప్రశ్నపైనే ఆధారపడాలనుకుంటే ఇక సమస్యే లేదు. వీడియోలు కుట్రలో భాగమేనని చెప్పుకున్నా.. ఫిజియోథెరపీకి, మసాజ్‌కి తేడా గురించిన ప్రశ్నలు.. ఆ రెండూ ఆఫీసుల్లో చేయించుకోవచ్చా అన్న ప్రశ్నలు ఆ కుట్ర కోణాన్ని క్రీనీడల్లా ఆక్రమించేస్తున్నాయి. పైకి స్వాములుగా కనిపిస్తూ.. తెరచాటు బాగోతాలు వెలగబెట్టిన చాలామంది వికృత చేష్టలు ప్రసార మాధ్యమాల్లో కనిపిస్తుంటాయి. ఇలాంటివి చూసినప్పుడు ఎవరిని నమ్మాలి? ఎవరిని నమ్మకూడదు? అన్న ప్రశ్న పుట్టుకొస్తుంది. కాని దానికి సమాధానం మాత్రం దొరకదు. డ్రంకెన్ అండ్ డ్రయివ్‌లో దొరికినప్పుడు.. చట్టాన్ని గౌరవించి.. కౌన్సెలింగ్‌కి హాజరైతే అదొక పద్ధతి. కాని పోలీసులకు కూడా ఆనుపానులు లేకుండా వారం రోజుల పాటు సాగలాగడం ద్వారా యువతకు ఏమి సందేశం ఇస్తున్నాం? చట్టానికి దొరక్కుండా అజ్ఞాతంలో ఉండిపోవచ్చని చెప్పడమే అవుతుంది. ఎవ్వరైనా ఎంతోకాలం చట్టం కళ్లుగప్పి ఉండటం సాధ్యం కాదు. ఈ నిజం తెల్సీ అదే తప్పు చేయడం సమాజానికి దుర్నీతి సంకేతాలు ఇవ్వడమే. చివరకు తాను మళ్లీ సోషల్ మీడియాలోకి వచ్చి.. తాను కౌన్సెలింగ్‌కు వెళతానని చెప్పక తప్పలేదు. దీనికి ఓ వారం సమయం పట్టడం విడ్డూరం. ఈలోగా యువతకు వెళ్లాల్సిన సందేశం వెళ్లిపోయింది. తప్పుచేసినా తప్పించుకుని తిరగొచ్చు అని. ఈ సంగతి అలా ఉంచితే.. భార్యల హత్యోదంతాల నుంచి ఒక్కసారిగా సీన్ భర్తల హత్యోదంతాలకు మారినట్టు కనిపిస్తున్నది. కిందటి ఏడాది చివర్లో ఒక స్వాతి ఉదంతం మరవక ముందే తాజాగా ఒక జ్యోతి తెరమీదికొచ్చింది. ప్రియుడితో కలిసి భర్త హత్యకు పకడ్బందీ ప్లాన్ వేసి సక్సెస్ అయింది. ఆ అమ్మాయిని చూస్తే నిండా పాతికేళ్ల వయస్సు లేదు. మానసిక పరిపక్వత లేదు. కాని ఆ అమ్మాయి భర్తనే హతమార్చిందంటే నమ్మలేని స్థితి. కాని దర్యాప్తులో ఆమే హత్య చేసినట్టు సాక్ష్యాధారాలు తేటతెల్లం చేశాయి. ఇష్టం లేని పెళ్లి జరిగితే దాన్ని పరిష్కరించుకోవాల్సిన పద్ధతి వేరు. ఇష్టం లేకపోతే భర్తకి విడాకులు ఇచ్చి ఇష్టపడ్డ ప్రియుణ్ణి కట్టుకోవచ్చు. కాని భర్తని హతమార్చి ఆ తర్వాత సుఖంగా బతకొచ్చు అనుకోవడమే విచిత్రం. ఇదిలా నడుస్తుండగానే కోస్తాంధ్రలో ఒక శ్రీవిద్య. ఆమెదీ ఇదే తంతు.. ఇష్టం లేని భర్తను వదిలించుకునే మార్గం హత్యే అని నమ్మడమే ప్రమాదకర ధోరణికి అద్దం పడుతున్నది. మానవ మనస్తత్వాల్లో.. ఆలోచనా ధోరణుల్లో వస్తున్న మార్పుగా దీన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. భార్యలే కాదు.. భర్తలూ ఇలాంటి దుస్సాహసాలకు ఒడిగడుతున్న సంఘటనలు ఉంటున్నాయి. ఆడమగా తేడా కాదు. స్థూలంగా మనుషుల్లో వస్తున్న ఈ విపరీత ఆలోచనా ధోరణి గురించే చర్చంతా. సామాజిక, ఆర్థిక పరిస్థితులు కూడా ఇలాంటి సందర్భాల్లో ప్రధాన కారకాలుగా ఉంటున్నాయి. సరైన విద్య లేకపోవడం మరొక కారణం. అందరికీ విద్య అన్న నినాదం మిధ్యగా మారడం కూడా ఇలాంటి ఉపద్రవాలకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణమవుతున్నది. నేరం చేశాక చట్టానికి చిక్కడం తప్పదని తెలిసీ.. ఇలా తెగించడాన్ని మూర్ఖత్వమని సరిపెట్టుకోలేము. చేసిన నేరానికి ఎటూ తగిన శిక్షలు పడతాయి కదా అని సరిపెట్టుకోలేము. శిక్షలు పడే మాట నిజమే అయినా.. రోజుల తరబడి ఆ దుష్ట వీరోచిత గాధలు ప్రసార మాధ్యమాల్లో చూస్తున్న యువత ఏం నేర్చుకుంటారన్నదే ప్రశ్న. మొత్తం మీద కొత్త సంవత్సరం వృద్ధుల నుంచి యువత దాకా ఇచ్చిన సందేశం ఏమిటని ఓసారి అవలోకనం చేస్తే మాత్రం గర్వించదగ్గ పరిణామమేదీ లేదు. మిగతా సంవత్సరం మీద ఆశతో ఎదురుచూడటమే మిగిలింది!

❑ వయ్యస్సారెస్

ద్వేష భూషణుల దేహాలు

ఎంత ఖరీదైన దుస్తులు వేసుకున్నా కొందరికి ద్వేషమనే భూషణం లేకపోతే, వాళ్ళ అందం ఎవరినీ ఆకర్షించదు. అది వాళ్ళకు సహజంగానే ఉంటుంది. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గానీ పోదంటారు. వాళ్ళను మార్చడం ఎవరితరం కాదు. దురదృష్టం ఏమిటంటే, ఆ జనాభాయే ఎక్కువగా అనుక్షణం తారసపడుతుంటారు. అయితే వాళ్ళను కనిపెట్టడం, అంత సులభం కాదు. ఎందుకంటే, తాము ద్వేషిస్తున్న విషయాన్ని, అవతల వ్యక్తికి, ఏమాత్రం తెలియకుండా వుండేలా, చాలా జాగ్రత్త పడుతుంటారు. అది వాళ్ళకు దైవమిచ్చిన వరం.

మనముందు, ముచ్చటగొలిపే ముఖకవళికలతో ఆకట్టుకుంటారు. మనపట్ల వారికి గల, ఆప్యాయతను తెగవెలగబెడతారు. మామూలుగానే, మన్ని మనం చూసుకొని, పొంగిపోతుంటాము. దీనికి తోడు, వీళ్ళ అనురాగ వీక్షణాలతో, క్షణ క్షణం పొంగిపొర్లిపోతూ, వారడిగినా, అడక్కపోయినా, మనకున్న జ్ఞాన సంపత్తినీ, మన ఆస్తిపాస్తుల ప్రస్తావననూ, మన పిల్లల ప్రయోజకత్వాన్నీ, కొంత సొంత కవిత్వం కూడా జోడించి, మనకున్న యావద్విషయాలనూ ఆవగింజంత కూడా వదలకుండా, వారు మనల్ని చూసి, ఆవలించేంతగా, చెప్పుకుపోతూనే ఉంటాం. ఈ బలహీనతను, వదిలించుకోవడం ఎవరివల్లా కావడం లేదు.

ఒక మహా పండితుడున్నాడనుకోండీ, ఆయన తన విద్వత్తుతో, అందరినీ ఆకట్టుకుంటుంటాడు. అంతే అప్పట్నుంచీ వారికి మొదలవుతుంది. ఔరా! ఇందుకా ఈయన్ను అందరూ అందలమెక్కించి, మోస్తున్నది. అని అనుకొంటూ మనసులో తెగ కృంగిపోతుంటారు. అంతేగానీ, ఆయన ఆ స్థితికి చేరుకోవడానికి ఎంత కష్టపడ్డదీ, వాళ్ళ కవసరం లేదు. పోనీవాళ్ళు కూడా, కష్టపడి, నేర్చుకొని, ఆ స్థితికి చేరుకోవడానికి ఏమైనా ప్రయత్నం, చేస్తారా అంటే చెయ్యరు. చెయ్యకపోగా, ఆయన ప్రతిభను తగ్గించడానికి గల అవకాశాలను, అన్వేషించడానికి అహర్నిశలు శ్రమిస్తూ, వారి జీవిత కాలాన్ని వృథా చేసుకొంటారు. ఇది వాళ్ళ అజ్ఞానానికి పరాకాష్ఠ. ఇటువంటి వారివలన దేశానికి అప్రతిష్ట.




తమ పక్కింటివారు ఎవరైనా తమ డాబాపైన ఓ గదిని తమ ఇంటికన్నా, ఎక్కువగా వేసుకొని, కాలుపైన కాలేసుకొని, కూర్చొని పేపరు చదువుతుంటే అంతే. ఇక తట్టుకోలేక, వాళ్ళతో ఏదోరకంగా తగవు పంచుకొని, తిట్ల పురాణం మొదలెడతారు. శరీర లావణ్యాల సంగతి సరేసరి. తమకన్నా వారు అందచందాలతో, అనేక ఆభరణాలతో వుంటే, వాళ్ళను చూసి శారీరకంగా మానసికంగా నీరసించి పోతారు. ఇలాంటివెన్నో వున్నయ్. దీనివలన కేవలం ఇరుగుపొరుగువారే కాదు, దేశదేశాలే ఇలాంటి వ్యక్తులవలన దిమ్మతిరిగిపోతుంటయ్. అందుకే అపుడపుడు యుద్ధ వాతావరణం ఆవహిస్తూ ఉంటుంది. శాంతి సామరస్యాలు, సంస్కృతీ సాంప్రదాయాలను గూర్చి ఎవరు మాట్లాడినా, అవి హాస్య ప్రసంగాలుగా తీసి పడేస్తారు. వారనుకున్న దారిలోనే వారు వెళ్తుంటారు. సమాజ శ్రేయస్సుకన్నా, వ్యక్తిగత శ్రేయస్సే ముఖ్యం. దానికోసం ఏం చేయడానికైనా వెనుకాడరు.

చిన్న పిల్లల దగ్గరనుంచీ పెద్దలదాకా, ఆడవాళ్ళల్లో అయితే తోడికోడళ్ళు, ఆడపడుచులు, అప్పచెల్లెళ్ళు ఎవరైనా సరే, రక్తసంబంధాలను కూడా విస్మరించి, తమకన్నా ఎవరు మిన్నగా వున్నా, కన్నెర్ర జేసి, వారిపైన అకారణంగా విరుచుకుపడుతుంటారు కొందరు. ఇలాంటి నయనతారలను చూసే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారన్న అమృత వాక్యం వెలుగులో కొచ్చింది. సభ్యత, సంస్కారంవున్న వ్యక్తులెవరూ, ఇటువంటి అల్పబుద్ధులతో ఆలోచించరు. తమకున్న దాంట్లో, సంతృప్తి చెంది, సరిపెట్టుకోవడమో, లేదా సరైన మార్గంలో, తమ ఎదుగుదలకు ప్రయత్నించడమో చేసుకుంటారు. అంతేగానీ, వారికి మల్లే మనం లేమనుకొని, కుళ్ళు పోవడమో, కృంగిపోవడమో, ప్రగతి పథంలో పయనించేవారికి, అడ్డంకులు సృష్టించడమో చెయ్యరు.

ఎక్కువ తక్కువలను తమ మనసులలో ఎక్కుపెట్టుకొని, వెక్కివెక్కి ఏడుస్తూ, ప్రశాంత జీవన విధానానికి దూరమై అనారోగ్యం పాలౌతుంటారు వీళ్ళు. దీనివలన ఎవరికి నష్టం? మీకు నచ్చితే, మీ తాహతుకు తగినట్లు, అవతలవారి విషయాల్లో, చేదోడు వాదోడుగా వుంటూ సహాయపడడం. నచ్చకపోతే, తమ విషయాలేవో తాము చూసుకోవడం, సమాజ శ్రేయస్సుకు మంచిది. ఏతావాతా అందరూ సుఖశాంతులతో వుండాలి.

శరీర మాద్యం ఖలు ధర్మసాధనం అన్నారు పెద్దలు. ధర్మసాధన కోసం ఈ శరీరం అవసరమన్నారు. అనుక్షణం అధర్మసాధన కోసం, మీదేహాల్ని వినియోగించమని కాదు. ద్వేషభూషణాలను వదలి, ధర్మభూషణాలను ధరించి మీదేహాలను తరింపజేసుకోండి. అందరినీ తరింపజేయండి.

● షణ్ముఖశ్రీ



ఆదిత్యహృదయం

వి.ఎస్. ఆదిత్య

మనసులపై టార్గెట్ల సవారీ

కొత్త సంవత్సరం అనగానే, వేడుకలు, సంబరాలు మాట అటుంచితే, ఏవేవో ఆశయాలు, టార్గెట్లు, ఫైనాన్షియల్ ప్లానింగ్‌లు, వర్క్ ఔట్‌పుట్లు తెలీకుండానే మనసుల్ని, మనుషుల్ని ఆక్యుపై చేసేస్తున్నాయి ఈ మధ్య. నేను విజయవాడ సిద్ధార్థ కాలేజీలో చదివే రోజుల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్లు, మొబైల్ ఫోన్లు తెలుగువాళ్లకి తెలీని 1990- 92 మధ్య కాలంలో ఓ ఇరవైమంది ఫ్రెండ్స్ మా ఇంటిమేడమీద 1.5 లీటరు స్ప్రైట్ సీసాలు నాలుగు, 1.5 లీటరు కోక్ సీసాలు నాలుగు, చెగోడీలు, మిక్చరు, మిర్చి బజ్జీలు, పునుగులు తలో ప్లేటు, మనిషికొక స్వీటు, పన్నెండు గంటలకి కోయడానికి ఒక రెండు కేజీల కేకు. దీపం ఆర్పటానికి మేమంతా అప్పటికే వ్యతిరేకులం కాబట్టి, 12 గంటలకి దీపం వెలిగించడానికి ఒక కొవ్వొత్తి, అగ్గిపెట్టె. ఇదే న్యూ ఇయర్ పార్టీ అంటే. ఆ రోజు అక్కడ ఉన్న ఆ 20 మంది గ్యాంగ్‌లో ఇద్దరం దర్శకులవ్వాలని అప్పటికే డిసైడెడ్. అదృష్టవశాత్తు అయ్యాం. నేను, ఇవాళ్టి ప్రముఖ దర్శకుడు, మిత్రుడు ఇంద్రగంటి మోహనకృష్ణ. ఆ ఇరవైమందిలో మరో మిత్రుడు చార్టెడ్ అకౌంటెంట్ అయ్యి, నిర్మాత అవ్వాలని సంకల్పం. అయ్యాడు. ఈ తరం యువ నిర్మాత, వివేక్ కూచిభొట్ల మంచి సినిమా ఎడిటర్ అవ్వాలని ఆ గ్యాంగ్‌లో సంకల్పించి, ఎడిటర్ అయ్యి. తర్వాత దర్శకత్వం వైపు ప్రయత్నాలు ప్రారంభించిన మరో మిత్రుడు మోహన్ ఏఎల్‌ఆర్కే. సంగీతదర్శకుడవ్వాలని సంకల్పించిన మిత్రుడు కేశవ్ ప్రభుత్వ విద్యాసంస్థలో సంగీత అధ్యాపకుడయ్యాడు. నేపథ్య గాయకుడవ్వాలని సంకల్పించిన మరో మిత్రుడు మల్లాది రవికుమార్ తన సోదరుడు రాంప్రసాద్‌తో కలిసి మల్లాది బ్రదర్స్‌గా పేరు పొందిన కర్ణాటక సంగీత విద్వాంసులై ప్రపంచమంతా అభిమానుల్ని శిష్యుల్ని సంపాదించుకుంటున్నారు. మంచిగీత రచయిత అవుతాడని నేను బాగా ఆశించిన మిత్రుడు అరుణ్ సింగపూర్‌లో సెటిల్ అయ్యారని ఇటీవలే తెలిసింది. పిలిచి పాట రాయించాల్సి ఉంది. మిగిలిన వాళ్లెవరూ సినిమాలని కలగనలేదు కాబట్టి వేర్వేరు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మంచి నటుడవ్వాలని కలలు గన్న హనుమంతు అనే మిత్రుడు మాత్రం నా మొదటి




నాలుగు సినిమాల్లోను మంచి వేషాలేసి, తర్వాత అహ్మదాబాద్‌లో స్థిరపడ్డాడు. మొత్తంమ్మీద సినిమాలు సంకల్పించిన మెజారిటీ జనాలం సినిమాలే వృత్తిగా బతుకుతుండడం చాలా ఆనందించదగ్గ పరిణామం. ఇంత బాగా జరిగిన, గుర్తున్న న్యూ ఇయర్ వేడుకలు నా జీవితంలో ఇవి మొదటివి. తర్వాత నేను దర్శకుడు కాక మునుపు 2000వ సంవత్సరంలో మిలీనియం వేడుకలు చేసుకున్నాం. అదో మధురానుభూతి. డిసెంబర్ 31 రాత్రి 11 గంటలకు రామ్‌నగర్‌లో మా మేనత్తగారమ్మాయి పెళ్లి. 12 గంటలకి కుక్కట్‌పల్లిలో మిలీనియమ్‌ని ముప్పై మంది మిత్రులం క్యాంప్ ఫైర్ వేసుకుని వేదం చదువుతూ సహస్రాబ్దిని ప్రారంభించాలని సంకల్పించాం. 11 గంటల 25 నిముషాలకి రామ్‌నగర్ శంకర మఠంలో బయల్దేరి, 11 గంటల 45 నిముషాలకి కుక్కట్‌పల్లిలో ఉన్నాన్నేను.

ఫార్ములావన్ రేస్ కారు నడిపిన డ్రైవర్‌లా ఎక్కుపెట్టిన బాణంలా, గురిచూసి కొట్టిన బుల్లెట్‌లా. 5 నిముషాల్లో స్నానం చేసి శివ రామారావు అనే స్నేహితుడి ఇంటి మేడమీద 2000కి వేదం చదువుతూ స్వాగతం చెప్పాం. గంట తర్వాత జోకులు, తెల్లారేదాకా నవ్వులే నవ్వులు. కోక్, స్ప్రైట్, స్నాక్స్ షరామామూలే. అప్పటికి ఏ ఇద్దరు ముగ్గురి దగ్గరో సెల్‌ఫోన్లున్నాయి. వాటిని మధ్యలో పెట్టి అందరం బిగ్గరగా కోరస్‌లు హ్యాపీ న్యూ ఇయర్ అని అరిచే వాళ్లం. ఆ తర్వాత ఏ న్యూ ఇయర్ పార్టీకి వెళ్లినా 12 వరకూ అందరూ సరదాకా కబుర్లు, 12 అయ్యేసరికి ఎవరి ఫోన్లు వాళ్లు తీసుకుని చెరోమూలకీ వెళ్లిపోవడం. 12 గంటలకి అభినందిద్దామంటే మనిషి కనబడడం మానేసి చాలా ఏళ్లయింది. ఈ పార్టీలో ఉంటూ ఇంకోళ్లకి ఫస్ట్ విష్ చేయాలని ఉంటే, వాళ్లతోనే ఉండచ్చు కదా అనిపిస్తుంటుంది నాకు. 12 నుంచి 2 దాకా అందరూ వాట్సప్పుల్లోనే. సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రిపేరవుతున్నంత శ్రద్ధగా. వర్చువల్ అభిమానాలు, వర్చువల్ ప్రేమలు ఎదురుగా ఉన్న వ్యక్తుల ఉనికి ప్రశ్నార్థకమై పోతున్న ప్రగతి పథం. ఇవ్వాళే మాబావ ఏవిఎన్‌హెచ్ శర్మ గారి పుట్టిన రోజని విషెస్ చెప్పడానికి ఇంటికి వెళ్తే, మొబైల్ హాలిడేస్ అని పెట్టాలా. లేదా రోజులో కనీసం కొన్ని గంటలైనా మొబైల్ ఫ్రీ అవర్స్ అని పెట్టాలి అన్నాడు. ఈ ఐడియా నాకు నచ్చింది. ఇకపై నేను ఏ పనిలో ఉన్నా, ఆ పని చేస్తున్నన్ని గంటలూ మొబైల్ హాలీడే ప్రకటించేస్తాను. దానికంటే గొప్ప న్యూ ఇయర్ రిసల్యూషన్ నేను 2017లో వినలేదు. డిజిటల్ బతుకుల్లో విజిటర్లు అయిపోయారు తల్లిదండ్రులు, భార్యాపిల్లలు. ఒకే ఇంట్లో ఉంటున్నా కూడా. మొబైల్‌లో కాకుండా మనుషులని కొన్నాళ్లు కలుస్తుంటే మళ్లీ కొత్తగా ఉంటుందేమో. ప్రయత్నించి చూడాలి. ఎవర్ని కలిస్తే వారితో కాస్సేపు మాట్లాడుకునేలా ఉంటే ఎంతబావుంటుందో వారు ఇంకొకరితో మాట్లాడుతుంటే వినడం కన్నా. మనం ఇంకొరితో మాట్లాడుతుంటే వారు వినడం కన్నా. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నాలాగే అందరికీ సత్సంకల్ప సిద్ధిరస్తు.

ఆధార్ లింక్‌తో అంతా పబ్లిక్కే!

సినీ కళాకారులు రోజుకి రెండు,మూడు షిఫ్టులు పనిచేస్తూ తీరిక లేకుండా ఉన్నామని తరచూ చెబుతూ ఉంటారు. షిఫ్టు పద్ధతి సినీ నిర్మాణ రంగానికే కాదు, అన్ని రంగాలకూ విస్తరించింది. కాలేజీల్లో, ఆస్పత్రుల్లో అధ్యాపకులు, వైద్యులు కూడా షిఫ్టు ప్రకారమే పనిచేస్తుంటారు.



అధికారికంగా పని చేయడం వేరు, అనధికారికంగా ఒకే అధ్యాపకుడు రెండు, మూడు చోట్ల పని చేయడం వేరు. ప్రైవేటు కళాశాలల్లో జీతాలు తక్కువిస్తారు కనుక, అధ్యాపకులు ఒకటికి మించి ఎక్కువ కళాశాలల్లో పనిచేయడాన్ని ఓ విధంగా సరిపెట్టుకోవచ్చు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ ఆస్పత్రులు ట్యూషన్లకూ, ప్రైవేటు ప్రాక్టీసుకు ఏనాటి నుంచో అలవాటు పడ్డారు.
ఇంతకాలం వారి గురించి సమాచారం ఏదైనా అందినా కళాశాలల యాజమాన్యాలు, అధికారులూ ఏం చేయలేకపోయేవారు. ఇప్పుడు ప్రభుత్వం అన్నింటికీ ఆధార్‌ని వర్తింప జేస్తుండటం వల్ల ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఒకటి కన్నా ఎక్కువ కాలేజీల్లో పని చేస్తున్నట్టు లెక్క తేలింది. ఆ విధంగా పనిచేస్తున్న లెక్చరర్ల సంఖ్య దేశ వ్యాప్తంగా 80 వేలు పైనే ఉంటుందని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. ప్రభుత్వ వైద్యుల ప్రైవేటు ప్రాక్టీసు గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అది బహిరంగ రహస్యం. వారు బోర్డులు తగిలించుకుని క్లినిక్‌లు నడుపుతున్నారు. లంచాలు తీసుకునే ప్రభుత్వ డాక్టర్లు, అధికారుల కన్నా, రెండేసి చోట్లపనిచేసే డాక్టర్లను చూసీ చూడనట్టు ఊరుకునే వారు. ఇప్పుడు ఆధార్ పుణ్యమా అని వారి ప్రైవేటు ప్రాక్టీసు పబ్లిక్ అవుతోంది.

పర్యావరణ పరిరక్షణ

ప్రతి ఒక్కరి బాధ్యత

అటవీశాఖ మంత్రి జోగు రామన్న



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన కార్యక్రమాలను పర్యావరణ హితంగా ఉండేలా జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి క్యాలెండర్, పోస్టర్‌ను కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి మహేష్ శర్మతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడారు. స్వచ్ఛమైన వాతావరణంతో ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని మంత్రి వివరించారు. హరితహారం, మిషన్ కాకతీయ అద్భుతమైన పథకాలని వెల్లడించారు. నగరాలు చెత్త మురుగు నీటికి నిలయాలుగా మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చెత్త, వ్యర్థాల నిర్వహణకకు విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేయడం ద్వారా చెత్తను సమర్ధవంతంగా నిర్వహించవచ్చన్నారు. నీటి వనరుల వినియోగం తగ్గించుకోవడంతో జల సంపదను కాపాడుకోవలసి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రజిత్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పునాదిగా ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీయ పుస్తక ప్రదర్శనను తెలంగాణ కళాభారతి(ఎన్‌టీఆర్ స్టేడియంలో) ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. శనివారం సచివాలయంలోని మీడియా పాయింట్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెవీ రమణాచారి, పర్యాటక, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంలు పుస్తక ప్రదర్శన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ గత సంవత్సరం 10 లక్షల మంది పుస్తక ప్రియులు హాజరయ్యారని, ఈ ఏడాది కూడా అంతకు మించి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి పబ్లిషర్స్ వస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రదర్శనను ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఇ-బుక్స్(ఎలక్ట్రానిక్స్) ఎన్ని వచ్చినా పుస్తకాన్ని చదివినంత తృప్తి ఉండదన్నారు. కెవీ రమణాచారి మాట్లాడుతూ జ్ఞాన సాధనకు పుస్తకమే మూలమని, పుస్తకంలోకి వెళితే ప్రపంచాన్ని వీక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాష సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ ప్రధాన కార్యదర్శి కోయ చంద్రమోహన్, ఖయ్యుంలు పాల్గొన్నారు.


22 నుంచి పులులు, వన్య ప్రాణుల గణన

అటవీ సంరక్షణ ప్రధానాధికారి పి.కె. ఝా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ నెల 22 నుండి పులులు, వన్య ప్రాణుల జనగణన మొదలవుతుందని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పి.కె.ఝా వెల్లడించారు. నాలుగేళ్లకు ఒకసారి ఈ విధంగా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మొదటి సారి పులుల లెక్కింపు జరుగుతుందన్నారు. సర్వే సన్నద్ధతపైన జిల్లాల్లోని అటవీ అధికారులతో ఆయన సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో విద్యార్థులు, ఔత్సాహికులు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. నైపుణ్యం ఉన్న అటవీ అధికారి పర్యవేక్షణలో సర్వే కొనసాగవలసి ఉందన్నారు. హరితహారంలో నాటిన మొక్కల పరిరక్షణ పై కూడా అధికారులతో చర్చించారు. నర్సరీల నిర్వహణపై దృష్టికేంద్రీకరించాలని, తదుపరి హరితహారంలో పెద్ద మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులకు ఇరువైపుల మరింత అధిక మొత్తంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకొనవలసి ఉంటుందన్నారు. అన్ని జిల్లాల్లో అర్బన్ పార్కుల ఏర్పాటు కోసం స్థలాలు గుర్తించవలసి ఉందన్నారు. అటవీ గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, విద్యుత్ సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలకు అటవీ అధికారులు సహకరించవలసి ఉందన్నారు. తెలంగాణలో సుమారు 440 అటవీ ప్రాంతాల్లోని గ్రామాలలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందుస్తు జాగ్రత్తలు తీసుకొనవలసి ఉందన్నారు. ఫిబ్రవరి నుండి మే మాసాంతం వరకు అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కవ్వాల్ అమ్రాబాద్ లాంటి అభయారణ్యాల్లో అగ్ని ప్రమాదాల నివారణ పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని స్థానిక అధికారులకు సూచించారు.

టీఆర్‌టీ పూర్తయ్యేవరకు

టీ-శాట్ ప్రసారాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్‌టి పరీక్ష నిర్వహించే వరకు టి-శాట్ ద్వారా మరిన్ని పాఠ్యాంశాలను ప్రసారం చేస్తామని ఆ సంస్థ సీఈవో శైలేష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షల మందికిపైగా టిఆర్‌టి అభ్యర్థులకు టి-శాట్ ప్రసారాలు ఉపయోగ పడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు టి-శాట్ నెట్‌వర్క్ ఛానళ్ళు టిఆర్‌టి ఉద్యోగ గైడ్ పేరుతో చేస్తున్న ప్రసారాలకు విస్తృత ఆదరణ వస్తోందన్నారు. కేవలం 15 రోజుల్లోనే 10 లక్షల మంది వీక్షించగా, 10వేల సభ్యులుగా చేరారు. దాదాపు 30 మంది అనుభవజ్ఞులైన ఉపన్యాసకులతో రోజుకు 10 గంటల చొప్పున 150 గంటల ప్రసారాలు అందించినట్లు శైలేష్‌రెడ్డి చెప్పారు. లక్ష ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం, పేద, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు వ్యయ ప్రయాసాలు తగ్గించాలన్న మంత్రి కేటీఆర్ లక్ష్యం నెరవేరనుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న నాలుగు ఛానళ్ళకు అదనంగా మరో రెండు ఛానళ్ళు చేరనున్నాయని, ఎంపెగ్-2 నుంచి ఎంపెగ్-4కు మారినందునే ఈ ఛానళ్ళు తోడయ్యాయని ఆయన తెలిపారు.

టీఆర్‌టీ దరఖాస్తుకు నేడు చివరి రోజు

ఎస్‌జిటికి 1,01,600 దరఖాస్తులు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,81 లక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి నేడు చివరి రోజు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న టిఆర్‌టికి దరఖాస్తు చేసుకోవడానికి నేడు చివరి రోజు అయినప్పటికీ ఎడిట్ ఆప్షన్‌ను 11 వరకు కొనసాగించారు. శనివారం వరకు స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు 1,81 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, ఎస్‌జిటి పోస్టులకు 1,01,600 మంది దరఖాస్తు చేసుకున్నారు.

మావోయిస్టులపై

హెలీ నిఘా?



●డీజీపీ జిల్లాల పర్యటనలో ప్రత్యేక ఆరా ●ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించొద్దని ఆదేశాలు ●గ్రేహౌండ్స్‌తోపాటు ఎస్ఐబీ విభాగాలు అప్రమత్తం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో మావోయిస్టులు మరోసారి చెలరేగి పోనున్నారా ? చాప కింద నీరులా కేడర్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహిస్తున్నారా ? ఎక్కడికక్కడ దళాలను ఏర్పాటు చేసే పనులను ముమ్మరం చేశారా? అంటే వీటన్నింటికీ పోలీసు అధికారులు అవుననే అంటున్నారు. ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలలో కొంత కాలంగా మావోయిస్టుల అలజడి తీవ్రమవడం, ఏకంగా దళాలే తిరుగుతున్నట్లు తేలడంతో పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తమయ్యారు. అంతే కాకుండా మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి మావోయిస్టులు చొరబడకుండా ఉండేందుకు బందోబస్తును ముమ్మరం చేశారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత స్వాధీనం చేసుకున్న కిట్‌బ్యాగులు, సాహిత్యం తదితర వాటిని పరిశీలించిన పోలీసులు మావోయిస్టులు తెలంగాణపై గురి పెట్టారన్న విషయాన్ని రూఢీ చేసుకున్నారు. మారుమూల గ్రామాలలోని యువతను ఉద్యమం వైపు ఆకర్షితులను చేయాలని, పాలకుల తీరును ఎండగట్టడంతో పాటు అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని యువతకు తెలియజేయాలన్న సూచనలు, రిక్రూట్‌మెంట్ సమయంలో అనుసరించాల్సిన పద్ధతులు, గ్రామీణులతో ఎలా కలిసిపోవాలి అనే పలు సూచనలున్న కొన్ని పేపర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా సింగరేణి గనుల ప్రాంతంతో పాటు ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాలలో దళాల ఏర్పాటు తదితర సమాచారం కూడా లభించాయి. వీటన్నింటినీ డిజిపి మహేందర్‌రెడ్డి జరుపుతున్న జిల్లాల పర్యటనలో పరిశీలించారు. మావోయిస్టుల పట్ల ఏ మాత్రం ఏమరుపాటుగాఉండొద్దని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునే వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటి వరకు ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులలోనే నిఘాను పెట్టిన గ్రేహౌండ్స్ బలగాలను మరింతగా పెంచుకుని రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలలోనూ వినియోగించాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించాలని డిజిపి ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం 300 మంది వరకు మావోయిస్టు ఉద్యమంలో ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు వారి వివరాలను సేకరించడంతో పాటు కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చే ప్రక్రియను ముమ్మరం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మావోయిస్టుల చర్చలకు సిద్ధమై అణచివేత ప్రక్రియను ముమ్మరం చేసి విజయం సాధించింది. అప్పటి నుంచి రాష్ట్రంలో మావోయిస్టుల హింస తగ్గింది. ప్రజా ప్రతినిధులు స్వేచ్ఛగా గ్రామీణ ప్రాంతాలలో పర్యటించేందుకు వెసులుబాటు లభించింది. 2013లో రాష్ట్ర పోలీసు శాఖ తెలిపిన గణాంకాల ప్రకారం కేవలం 87 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. తాజా ప్రకటనలో ఈ సంఖ్య రెట్టింపు అయిందని పేర్కొన్నప్పటికీ అంతకంటే రెట్టింపు సంఖ్యలోనే మావోయిస్టులు ఉద్యమంలో చురుగ్గా ఉన్నారని అంటున్నారు. రానున్నది ఎన్నికల సంవత్సరమైనందున మావోయిస్టులపై ఇప్పటి నుంచే కఠినంగా వ్యవహరించాలని, ఇందుకోసం అవసరమైతే గగనతల గస్తీని తీవ్రం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాలలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) అధికారులు పర్యటిస్తూ పరిస్థితిని బేరీజు వేస్తూ స్థానిక అధికారులతో భేటీ అవుతున్నారు.

గజల్ శ్రీనివాస్‌కు దెబ్బమీద దెబ్బ

కళా బహిష్కరణ వేటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహిళలను లైంగిక వేధింపులకు గురిచేశాడనే ఆరోపణలపై కటాకటాలు లెక్కిస్తున్న గజల్ శ్రీనివాస్‌పై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ఆయనపై పలు సాంస్కృతిక సంఘాలు మండిపడుతున్నాయి. తన కార్యాలయంలో పనిచేసే ఓ యువతిని లైంగికంగా వేధింపులకు గురిచేసిన గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని ఆనందలహరి సాంస్కృతిక సంస్థ డిమాండ్ చేసింది. కళను అడ్డం పెట్టుకుని మహిళలను లొంగదీసుకుంటున్న శ్రీనివాస్‌ను సామాజికంగా తమ సంస్థ బహిష్కరిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మిగతా కళా సంస్థలు కూడా గజల్ శ్రీనివాస్‌ను సామాజికంగా బహిష్కరించాలని ఆనందలహరి ప్రతినిధి సూచిం చారు. కొందరు ఆయనకు మద్దతుగా మాట్లాడటంపై ఆ సంస్థ అభ్యంతరం తెలి పింది. గజల్ శ్రీనివాస్ కేసును నీరుగార్చేందుకు ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆనందలహరి ప్రతినిధి.. ఈ కేసును సమగ్రంగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆనందలహరి సంస్థ కన్వీనర్ మల్లం రమేశ్ అన్నారు. గజల్ శ్రీనివాస్ అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతూ కళా రంగాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని మల్లం రమేష్ అన్నారు.

పార్వతి కోసం పోలీసులు జల్లెడ

ఇక బాధిత మహిళకు రోజురోజుకు మహిళా సంఘాల మద్దతు పెరుగుతోంది. వీడియోలు వెల్లడి కాకముందు మీడియాతో మాట్లాడిన పనిమనిషి పార్వతి వీడియోలు బయటపడిన వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఈ కేసులో పార్వతిని ఎ2 నిందితురాలిగా పోలీసులు పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఆమె ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌పై వాదనల సందర్భంలో మీడియాలో కనిపించిన పార్వతి ప్రస్తుతం ఎక్కడ? అని కోర్టు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మరోవైపు గజల్ శ్రీనివాస్‌కు బెయిల్‌ను నిరాకరించింది. కేసులో కీలకమైన పార్వతిని పట్టుకుని మరిన్ని ఆధా రాలు సేకరించాలని పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారు. ఆమెకు సరైన చిరు నామా లేకపోవడంతో ఆమె ఆచూకీ లభ్యతలో కొంత జాప్యం కలుగు తున్నప్పటికీ పార్వతిని ఆచూకీ కనుగొని ఆమెకు నోటీసులు అందజేయనున్నట్లు పోలీసులు తెలి పారు.

ఆనక ఆమెను విచారిస్తామని పోలీసులు చెప్పారు. ఈ కేసులో పనిమనిషి పార్వతియే కీలకమన్న విషయాన్ని పోలీసులు సైతం పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక ముసుగులో గజల్ శ్రీనివాస్ వికృతచేష్టలను స్ట్రింగ్ ఆపరేషన్ చేపట్టడం ద్వారా బాధిత మహిళ వెలుగులోకి తేవడమే కాదు.. పోలీసులకు ఆ వీడియోలను అందజేసింది. దీంతో పోలీసులు గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పార్వతి కోసం పోలీసులు ఓవైపు జల్లెడ పడుతూనే మరిన్ని ఆధారాల కోసం యత్నిస్తున్నారు.

ఆదినారాయణరెడ్డికి అశ్రునివాళి



నేరేడుచర్ల, ప్రభన్యూస్ : ఆస్ట్రేలియా దేశంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తూ అస్వస్థతతో మృతిచెందిన కోన ఆదినారాయణ రెడ్డి భౌతికఖాయానికి శనివారం స్వంత గ్రామం ఇంజవారిగూడెం గ్రామంలో శోభతప్త హృదయాలతో బంధుమిత్రులు అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. నేరేడుచర్ల మండలం, కందుల వారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఇంజలవారిగూడెం గ్రామానికి చెందిన కోన వెంకటరెడ్డి ఏకైక కుమారుడు ఆదినారాయణరెడ్డి హైదరాబాద్ ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలల క్రితం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కంపెనీ తరపున విధులు నిర్వహిస్తున్నాడు. గత యేడాది డిసెంబర్ నెలలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. మెదడు సంబంధిత వ్యాధితో మరణించాడు.

రైళ్లలో ఆహారంపై ఫిర్యాదుల వెల్లువ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైళ్లలో ఆహార పదార్థాల సరఫరా పైన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి, నాణ్యమైన ఆహారం సకాలంలో అందడం లేదని అత్యధికులైన ప్రయాణికులు ఆన్‌లైన్లో ఫిర్యాదు చేస్తున్నారు. భారత రైల్వేలు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ఆహార పదార్థాల విషయంలో అప్పుడప్పుడు నాణ్యత లోపిస్తుందని ఫిర్యాదుల అందడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. రైళ్లలో ఆహార పదార్థాల సరఫరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సంబంధిత అధికారులకు అంతర్గత ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ ఆకస్మిక తనిఖీల్లో రైళ్లలో ఆహర పదార్థాల సరఫరాలను పరిశీలిస్తున్నారు. నాణ్యత లోపించిన పక్షంలో సంబంధిత అధికారుల పై చర్యలకు ఉపక్రమించిన సంఘటనలు కూడా ఉన్నాయి. రైళ్లలో పరిశుభ్రత, భద్రతతో పాటుగా దూర ప్రాంత ప్రయాణికులకు వారు కోరిన మేరకు ఆహారం సరఫరా చేయవలసి ఉంటుంది. ఆన్ లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసే సౌకర్యం కూడా అందుబాటులోకి రావడంతో అత్యధికులైన ప్రయాణికులు మంచి ఆహారం కోసం తహతహలాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులకు భోజనం, టీ, టిఫిన్స్ సరఫరా చేయడంలో నాణ్యత లోపిస్తుందని వస్తున్న ఫిర్యాదులను అధికారులు పరిశీలించి క్యాటరర్స్‌తో చర్చించడం, చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. వేడి వేడి భోజనం ఇవ్వడంలో క్యాటరర్స్ విఫలమవుతున్నారని అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని ఫిర్యాదుల్లో నాణ్యత లోపించిందని, ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉంటున్నాయి, పాడయిపోతున్న సమయంలో ప్రయాణికులకు ఆహారం సరఫరా అవుతుందనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత మూడేళ్ల కాలంలో 9804 ఫిర్యాదులు అందాయి. అందులో 3486 ఫిర్యాదుల పైన చర్యలు తీసుకున్నారు. రాజధాని, శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌తో పాటుగా దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఇదే పరిస్థితి నెలకొంటుందని తరచుగా ఫిర్యాదులు అందడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ - క్యాటరింగ్ సర్వీస్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అత్యధికులైన ప్రయాణికులు ఆన్‌లైన్లో తమకు ఇష్టమైన ఆహారం బుక్ చేసుకుంటున్నారు. దేశంలోని 300లకు పైగా నగరాలలో 4 వేలకు పైగా రైళ్లలో ప్రతి రోజు 3 వేలకు పైగా ప్రయాణికులు రైల్ రెస్ట్రో వెబ్ సైట్ ద్వారా శాఖహారం, మాంసహారం, సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్, గుజరాతీ, చైనీస్, బిర్యాని, పిజ్జా, ఫాస్టు ఫుడ్ తదితర ఆహారాలను ఆర్డర్ చేస్తున్నారు. రుచి, శుచితో ఈ ఆహారాలను ప్రయాణికులు కోరుకున్న స్టేషన్‌లో వేడివేడిగా అందచేయవలసి ఉంటుంది. అత్యధికులైన ప్రయాణికులు ఈ ఆహారం కోసం ఎదురు చూస్తుంటారు. రైలు ప్రయాణికులకు ఆహారం సరఫరా చేయడానికి దాదాపు 2,500 రెస్టారెంట్లతో ఈ వెబ్ సైట్ నిర్వాహకులు అనుసంధానం కలిగి ఉంటారు. ఆర్డర్ చేసిన ఆహారం నేరుగా ప్రయాణికుల సీట్ల వద్దకు చేరే ఏర్పాట్లు చేశారు. రైళ్లలో ఉండే క్యాటరింగ్ నుండి కూడా కొన్ని ఆహార పదార్థాలను సరఫరా చేయడం జరుగుతుంది. రైల్వే క్యాటరింగ్‌ను మెరుగుపర్చడం, సకాలంలో ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందచేయడం పట్ల దృష్టి కేంద్రీకరించామని రైల్వే అధికారులు తెలిపారు. తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, ప్రయాణికులకు అందచేస్తున్న ఆహారం పరీక్షించడం, ప్రయాణికుల అభిప్రాయం తెలుసుకోవడంతో మార్పులు చేర్పులకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.


సవాళ్లను అధిగమించాలి

పద్మశ్రీ డాక్టర్ హర్షకుమార్ గుప్తా



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రకృతి వైపరీత్యాలు,ఓజోన్ పొర తదితర సవాళ్లను అధిగమించేందుకు అందుకు అవసరమైన పరిశోధనలు పెరగాలని పద్మశ్రీ డాక్టర్ హర్షకుమార్ గుప్తా అన్నారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్), సీఆర్ఈఓఏ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాటూరు సుధాకరరెడ్డి, సిఆర్ఇఎ లెర్నింగ్ అకాడమీ డైరెక్టర్లు సంజయ్‌రాయ్, అనుజా రాయ్, ప్రిన్సిపల్ డాక్టర్ టి సుధా తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా డాక్టర్ గుప్తా మాట్లాడుతూ, చిన్నారుల్లోని ఆలోచననైపుణ్యం , ఊహాత్మకశక్తి సన్నగిల్లకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు.ఎమ్మెల్సీ సుధాకరరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నిబిడీకృతమైన మేధస్సును వెలికితీసేలా విద్యావిధానం ఉండాలన్నారు. సంజయ్‌రాయ్ మాట్లాడుతూ, క్రమబద్ధమైన పరిశోధన, ఆలోచనల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకే యూఎస్ కేంద్రంగా పని చేస్తున్న రీసర్చ్ బేసిక్స్ ఫర్ యంగ్ అచీవర్స్ (సీఆర్ఈఏ) పని చేస్తోందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం మాట్లాడుతూ, విద్యార్థుల్లో నిబిడీకృతమైన పరిజ్ఞానాన్ని వెలికితీయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నందుకు సీఆర్ఈఏ , ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాలను అభినందించారు.ఈ సందర్భంగా పైలెట్ ప్రాజెక్టుగా పరిశోధనలు చేసిన13 సంవత్సరాల లోపు విద్యార్థులు తాము చేసిన పరిశోధనల వివరాలను వివరించారు.

అన్ని జిల్లాల్లో కోర్టులను ఏర్పాటు చేయండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైకోర్టు విభజన అంశంపై తెలంగాణ రాష్ట్ర సర్కార్ రాజకీయ ప్రయోజనాలకోసం యత్నించడం తగదని భాజపా రాష్ట్ర న్యాయవాదుల సంఘం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో కేంద్రంపై బురదజల్లేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోందని మండిపడింది. హైకోర్టు విభజన చేస్తామని కేంద్ర న్యాయశాఖ ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ తెరాస ఎంపీలు ఉద్దేశపూర్వకంగానే పార్లమెంట్‌లో ప్లకార్డులు ప్రదర్శించారని పలువురు న్యాయవాదులు తీవ్ర స్థాయిలో అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం జరిగింది. లీగల్ సెల్ కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ కేందమంత్రి బండారు దత్తాత్రేయ, శాసనసభలో పార్టీ ఫ్లోర్‌లీడర్ జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జాతీయ నాయకుడు ఎన్. ఇంద్రసేనారెడ్డి, లీగల్, అసెంబ్లీ వ్యవహారల కమిటీ చైర్మన్ ఎ. నర్సింహ్మారెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ, న్యాయశాఖను తెరాస ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా31 జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఆయా జిల్లాల వారిగా జిల్లా కోర్టులను ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు దృష్టిసారించడం లేదని ప్రశ్నించారు. కేవలం హైకోర్టు విభజన జరగడం లేదని కేంద్రంపై నిత్యం ఆరోపణలు చేయడం తప్ప....రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు జిల్లా కోర్టులను ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.




ఎలక్ట్రిక్ కార్లు ఇప్పట్లో రానట్లే..

•2030 సంవత్సరం గడువు సడలింపు • భారత్ స్టేజ్-6 వాహనాల ఉత్పత్తిపై దృష్టి

న్యూఢిల్లీ: దేశంలో 2030 నాటికి అన్ని ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఇటీవల సడలించడంతో కార్ల ఉత్పత్తి కంపెనీలు భారత్ స్టేజ్-6 ఉత్పత్తులపై తమ దృష్టిని కేంద్రీకరించనున్నాయి. ఈనిర్ణయం దేశీయ మార్కెట్లో కార్ల అమ్మకాలను డిసెంబర్‌లో భారీగానే పెంచింది. డిసెంబర్‌లో అమ్మకాల్లో 7 శాతం వృద్ధి నమోదైంది. భారత్ స్టేజ్-6 వాహనాలు భారత మార్కెట్‌లోకి 2020లో రానున్నాయి. ఇటీవల పార్లమెంట్‌లో భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో ఈ విషయంపై ఒక ప్రకటన చేస్తూ.. 2030 నాటికి దేశంలో అన్నీ ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న నిబంధన తేవాలన్నదానిపై ప్రభుత్వాని కి ఎటువంటి ప్రణాళిక లేదని స్పష్టం చేశారు. అటోమొబైల్ పరిశ్రమ కాలుష్య రహితంగా ఉండేందుకు, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం, క్రూడాయిల్ దిగుమతులను తగ్గించటం లక్ష్యంగా 2030 నాటికి దేశంలో అన్ని కార్లు ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న నిబంధన తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ వాదనను మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మద్దతు తెలిపారు. కియా

కియా మోటార్స్‌కు కొత్త ఎండి



కియా మోటార్స్ ఇండియ (కెఎంఐ) కూక్యూన్ షిమ్ ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస ర్, మేనేజింగ్ డైరెక్ట ర్‌గా నియమించింది. 2019 రెండవ అర్ధ సంవత్స రంలో కియా కంపెనీ స్థానికంగా ఉత్పత్తిచేసిన కారును మార్కెట్‌లోకి తేనుంది. దేశంలో కియా మార్కెట్‌ను విస్తరించేందుకు షిమ్ కీలక పాత్ర నిర్వహించనున్నట్లు కంపెనీ పేర్కొంది. కియా తొలి మానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం పర్యవేక్షణ నుకూడా షిమ్ చేపడతారు. భారత్‌లో కియా చేపట్టనున్న మార్కెట్ విస్తరణ ప్రాజెక్టుకు 1.1 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది.



డిసెంబర్లో కార్ల అమ్మకాల్లో 7% వృద్ధి

మారుతి సుజుకి, టాటా మోటార్స్, హోండా మినహా మిగతా కార్ల తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల అమ్మకాలు తగ్గాయని ప్రకటించాయి. కొత్త సంవత్సరం ప్రారంభకాను న్నందున డీలర్లు కొత్త స్టాకును తీసుకోవడాని కే మొగ్గు చూపారని కంపెనీలు ప్రకటించాయి. 98 శాతం ప్యాసింజర్ కార్ల మార్కెను ఏడు కంపెనీలు ఆక్రమిస్తు న్నాయి. గత నెలతో పోలిస్తే డిసెంబర్‌లో అమ్మకాల్లో వృద్ధి 7 శాతం నమోదు చేసుకున్నాయి. డిసెంబర్ 2017లో అమ్మకాలు 2.17 లక్షయూనిట్లు అమ్ముడు పోగా, 2016 ఇదే నెలలో అమ్మకాల సంఖ్య 2.02 లక్షయూనిట్లుగా ఉంది.

2017లో లగ్జరీ కార్ల అమ్మకాలు పెరిగాయి

గత ఏడాదిలో జీఎస్టీ ప్రారంభించనున్నామని ప్రభుత్వం ప్రకటన రావడంతో లగ్జరీ కార్ల ప్రియులు ఎక్కడ ధరలు పెరుగుతాయోనన్న భయంతో వాటి కొనుగోళ్లకు ఎగపడ్డారు. ఈ విభాగం 38,700 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసుకుంది. ఈ విభాగంలో కార్లను ఉత్పత్తి చేస్తున్న ఆరు కంపెనీలు అమ్మకాల్లో 15 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

టాటా మోటార్స్ వెస్ట్‌పోర్ట్‌తో భాగస్వామ్య ఒప్పందం



వ్యాపార అవసరాలకు ఉపయోగించే వాహనాలను ఉత్పత్తి చేసే ప్రముఖ భారత సంస్థ టాటా మోటార్స్ కెనడాకు చెందిన వెస్ట్‌పోర్ట్ ఫ్యూయల్ సిస్టంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా టాటా మోటార్స్ తన సిఎన్‌జీ ట్రక్కులు, బస్సులకు అవసరమైన భారత్ స్టేజ్ 6 ఇంజన్ల అభివృద్ధిచేసి వెస్ట్‌పోర్ట్ కంపెనీ సరఫరాచేస్తుంది. ఈ అభివృద్ధి, సరఫరా ఒప్పందం.. నాలుగు సిలిండర్లు, ఆరు సిలిండర్లున్న సహజ వాయవుతో మండించే వాణిజ్య వాహనాల కుటుంబానికి పరిమితమవుతుంది. కాగా, డీజిల్ వాహనాలకు సంబంధించి ముంబైకి చెందిన కంపెనీ భారత్ 6 ఇంజన్లను టాటాకు సరఫరా చేస్తుంది.

దివాళ కంపెనీలకు మ్యాట్ నిబంధనలు సడలింపు

న్యూఢిల్లీ: రుణాలను తిరిగి చెల్లించడంలో విఫలమై దివాళ పరిస్థితులకు దగ్గరైన కంపెనీలకు ఊరటనిచ్చే ప్రకటనను ఆదాయ పన్ను శాఖ శనివారం ప్రకటించింది. సదరు కంపెనీలపై కనీస ప్రత్యామ్నాయ పన్ను(ఎంఏటీ) విధింపు పరిమితిని సడలించింది. ఇన్‌కం టాక్స్ చట్టం సెక్షన్ 115జెబి ప్రకారం బుక్ ప్రాఫిట్ నుంచి నష్టాలను లేదా ఆదాయంలో కలపని తరుగుదలను తీసివేసిన తర్వాత ఏది తక్కువైతే దానిపై పన్ను విధించనున్నట్లు సిబిడిటి వెల్లడించింది. ఈ చట్టం వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. 'ఏదైనా కంపెనీ కార్పొరేట్ దివాళ దరఖాస్తు తీర్మాన ప్రక్రియ ఐబిసి అధికార మండలి పరిశీలించి అంగీకరించినప్పుడే ఈ నిబంధన వర్తిస్తుంది. తరుగుదలతో కలిపి మొత్తం నష్టంను బుక్ ప్రాఫిట్ నుంచి తీసివేసిన తర్వాత మ్యాట్ నిబంధనను వర్తింపచేయటం జరుగుతుంది' అని సబిడిటి(కేంద్ర ప్రత్యక్షపన్నుల బోర్డు) ప్రకటించింది. తాజా సడలింపు నిజమైన కష్టాలను ఎదుర్కొంటున్న కంపెనీలకు ఉపకరిస్తుందని సిబిడిటి తెలిపింది. ఈ తరహా కంపెనీలకు రుణాలిచ్చిన సంస్థలు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ కింద దివాళ, రుణాల ఎగవేత కింద కేసులను దాఖలు చేయాలని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో సిబిటిడి మ్యాట్ సడలింపు వీటికి కొంత ఊరట నిస్తాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, ఇండస్ ఇండియా బ్యాంక్‌తో ఒప్పందం



న్యూఢిల్లీ: ఇండస్ ఇండియా బ్యాంకుతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ శనివారం ప్రకటించింది. వినియోగ దారుల బ్యాలెన్స్ నిలువలు లక్షరూపాయలు మించితే వారికి ఫిక్సిడ్ డిపాజిట్ సౌకర్యాన్ని కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సీఈవో రేణుసత్తి చెప్పారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ వినియోగదారులు తక్షణమే తమ డిపాజిట్లను రీడీమ్ చేసుకోవచ్చని తెలిపింది. దీనికి వారు ఎటువంటి ఛార్జీలు కాని చెల్లించనవసరంలేదని స్పష్టం చేసింది. ఈ డిపాజిట్లపై 6.85శాతం ఏటా వడ్డీని ఇవ్వనున్నట్లు పేటీఎం తన ప్రకటనలో వెల్లడించింది. ఎఫ్‌డీలు కొనసాగే సమయంలో వినియోగదారులు వయసుపెరిగి సీనియర్ సిటిజన్‌లుగా మారితే.. వారి ఖాతాలు సీనియర్ సిటిజన్ పథకంలోకి అటోమేటిక్ మారుతాయని తెలిపారు. ఆ విధంగా వారు అధిక వడ్డీరేటును పొందుతారని తెలిపింది. భారతీయులు ఎక్కువమంది తమ పెట్టుబడులు సురక్షితంగా ఉండి, ఎక్కువ వడ్డీ రావాలని కోరుకుంటారు. వారి ఆశలను మా టైఅప్ తీరుస్తుంది. ఇందుకోసం వినియోగదారులు ఎటువంటి పేపర్ వర్క్ రేణుసత్తి చెప్పారు.

ఎన్‌ఏసీఎల్ నిధుల సమీకరణకు సిద్ధం

న్యూఢిల్లీ: పంట ఉత్పత్తుల వ్యాపా రంలో రైతులకు భద్ర త కల్పించే ప్రముఖ సంస్థ ఎన్ఎసి ఎల్ ఇండస్ట్రీస్ రూ.3వేల కోట్ల నిధుల సమీకరణకు కంపెనీ బోర్డు అంగీకరించిందని ప్రకటించింది. కంపెనీ వృద్ధి ప్రణాళికల్లో భాగంగా ఈ ప్రక్రియకు బోర్డు ఓకే చెప్పిందని పేర్కొంది.

ఎన్ఎసిఎల్ గతంలో నాగార్జున ఆగ్రోకెమ్ లిమిటెడ్‌గాపిలువబడేది. నిధుల సమీకరణ ప్రక్రియ ఫిబ్రవరి 3న ప్రారంభించను న్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ నిధులను కంపెనీ ఉత్పత్తుల ఎగుమతులను అంతర్జాతీయంగా, దేశీయంగా పెంచేందుకు ఉపయోగించనుంది.

టయోటా మాజీ అధ్యక్షుడు టయోడా మృతి




టోక్యో: జపాన్‌కు చెందిన ప్రముఖ అటోమొబైల్ కంపెనీ టయోటా మాజీ అధ్యక్షుడు టయోడా మరణించినట్లు టయోటా కంపెనీ శనివారం ఒక ప్రకటన చేసింది. టయోట కంపెనీ ప్రస్తుత సీఈవో అకి టయోడాకు మరణించిన టయోడా స్వయాన మామయ్య. 88 ఏళ్లున్న టయోడా న్యూమోనియాతో బాధపడుతూ డిసెంబర్ 30న మరణించినట్లు కంపెనీ తెలిపింది. టయోడా, టయోటా అధ్యక్షుడిగా 1992 నుంచి 1995వరకు పనిచేశారు. టయోడా కంపెనీకి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో టయోటాను ఎదురు కంపెనీగా తీర్చి దిద్దారు. ఆయన హయాంలో కంపెనీ ఉత్తర అమెరికాకు విస్తరించింది. ఆయన అంత్య క్రియలు దగ్గరి బంధువుల సమక్షంలో జరిగాయి. కాగా టయోటా కంపెనీ ప్రత్యేక సంతాప కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపింది. టయోడా తండ్రి స్థాపించిన టయోట కంపెనీలో టయోడా 1953లో ప్రవేశించాడు. టయోటా, జనరల్ మోటార్స్ కలసి స్థాపించిన కొత్త సంస్థకు 1984లో టయోడా తొలి అధ్యక్షుడుగా పనిచేశారు. క్యాలిఫోర్నియాలో బేస్‌గా ఉన్న ఈ జాయింట్ వెంచర్‌ను టయోటా ఉత్తర అమెరికాకు విస్తరించింది.

కాంగ్రెస్ చేతికి సీఎస్‌వో అస్త్రం

- వృద్ధి రేటు తగ్గుదల, ప్రభుత్వంపై విమర్శల దాడి
- కేంద్ర గణాంక సంస్థ అంచనాలతో కాంగ్రెస్ దూకుడు
- జీడీపీని విభజన రాజకీయాలుగా అభివర్ణించిన రాహుల్
- మోడీ, జైట్లీ చెప్పినవన్నీ కబుర్లే: చిదంబరం
- అహంకార ప్రధాని, విఫలమైన ఆర్థికమంత్రితో విపత్తు: సూర్జేవాలా

న్యూఢిల్లీ: ఎన్డీఏ ప్రభుత్వ సంస్కరణలపై పదేపదే విమర్శనాస్త్రాలు సంధిస్తున్న కాంగ్రెస్ పార్టీ కేంద్ర గణాంక సంస్థ (సీఎస్‌వో) అంచనాతో మరింత దూకుడు పెంచింది. దేశ ఆర్థిక వృద్ధి రేటు 6.5 శాతానికి పడిపోవడాన్ని ఉటంకిస్తూ..ప్రధాని నరేం ద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలే లక్ష్యంగా విమర్శ నాస్త్రాలు సంధిస్తోంది. ప్రభుత్వం సంస్కరణలుగా చెప్పు కుం టున్న జీఎస్టీ, నోట్ల రద్దు వ్యవహారంతోనే జీడీపీ వృద్ధిరే టు నాలుగేండ్ల కనిష్ఠానికి పడిపోయిందని.. తలసారి ఆదా యం గతేడాదితో పోలిస్తే 1.4 శాతం తగ్గి..8.3 శాతంగా నమోదై నందని కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. కాంగ్రెస్ రాహుల్ గాంధీ సహా పలువురు సీనియర్ నాయకులు బీజేపీ టార్గెట్‌గా విమర్శల బాణాలను ఎక్కుపెట్టారు.

మోడీ సర్కార్‌పై చిదంబరం ఫైర్



దేశ జీడీపీ వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయిం దని కేంద్ర గణన సంస్థ (సీఎస్‌వో) ప్రకటించడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి చిదంబ రం స్పందించారు. మోడీ ప్రభు త్వం తీసుకు న్న నిర్ణయాలతో దేశంలో ఆర్థిక మందగమనం మునుపె న్నడూ లేనివిధంగా తీవ్రస్థాయికి చేరిందని మండిపడ్డారు. పదేపదే అభివృద్ధి మంత్రం జపిస్తున్న మోడీ..ప్రజలకు ఇన్నాళ్లు చెప్పినవన్నీ కబుర్లేనని తేలిపోయిందని విమర్శించారు. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం అవలం భించిన వైఖరి బీజేపీ అతిపెద్ద వైఫల్యంగా అభివర్ణించారు. కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు తగ్గిపోయాయి. తాజా పెట్టుబడులు లేవు. పెద్దనోట్ల రద్దు ప్రభావం నేటికీ ఇన్ ఫార్మల్ సెక్టర్ పై తీవ్రంగా ఉంది. ఉద్యోగాల కల్పన పాతాలానికి పడిపోయింది. తయారీరం గం వృద్ధి దిగజారిపోయింది. వ్యవసా యంపై మునుపెన్న డూ లేనివిధంగా తీవ్ర ప్రభావం పడింది. అని చిదంబరం కేంద్రంపై మండిపడ్డారు.గత నవంబర్ లో 4.88 గా రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠానికి పెరిగిపోయిందని.. పారిశ్రామిక ఉత్పత్తులు మూడునెలల కనిష్ఠానికి తగ్గిపో యాయని పేర్కొన్నారు. ఇలాగైతే మీరు ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీలు ఎలా నెరవేరుస్తా రు.. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పిన హామీ లన్నీ ఉత్తుత్తి మాటలేనా అని చిదంబరం మండిపడ్డారు.

జీడీపీ అంటే స్థూల విభజన రాజకీయాలు



సీఎస్‌వో నివేదిక తర్వాత రాహుల్ మరింత దూకుడు పెంచా రు. ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానా లతో దేశ ఆర్థికరంగం కుదేలైందని రాహుల్ మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం దృష్టిలో జీడీపీ అంటే స్థూల ఆర్థిక వృద్ధి కాదని.. స్థూల విభజన రాజకీయాలని రాహుల్ వ్యాఖ్యా నించారు. మోడీ, జైట్లీపై ట్విట్టర్ వేదికపై విమర్శనాస్త్రాలు సంధించిన రాహుల్.. రాజకీ యాల పెట్టుబ డిలో మోడీ, జైట్లీ సాధించింది ఇదీ అంటూ ట్విట్టర్ లో ఓ పట్టిక వేశారు. అంటూ కేంద్ర ప్రభు త్వంపై రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు.

మోడీ, జైట్లీ ఆర్థిక జ్ఞానం మరిచారు: సూర్జేవాలా

ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక జ్ఞానాన్ని మరిచిపోయారని..ఫలితంగా దేశ ఆర్థిక వృద్ధి రేటు విపత్తులో పడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్ దీప్ సూర్జేవాల్ విమర్శించారు. డిమానిటై జేషన్ అనే విపత్తును ప్రధాని మోడీ సృష్టించారని చురకలంచారు. ఆర్థిక మందగమనానికి జీఎస్టీని సరిగ్గాఅమలు చేయకపో వడమే కారణమని మండిపడ్డారు. అహంభావి అయిన ప్రధాని, విఫలమైన ఆర్థికమంత్రి ఆర్థిక జ్ఞా నాన్ని మరిచిపోయారు. దీంతో దేశ ఆర్థికవృద్ధి విపత్తులో పడిపో యిం ది అని సూర్జేవాలా విమర్శిం చారు.

నూతన పెట్టుబడులు	13 ఏళ్ల స్థాయికి దిగజారాయి
బ్యాంక్ పరపతి పెరుగుదల	63 ఏళ్ల కనిష్ఠానికి పతనం
ఉద్యోగాల కల్పన	8 ఏళ్ల స్థాయికి పతనం
వ్యవసాయ స్థూల విలువ(జీవీఏ)	1.7 క్షీణత
ద్రవ్యలోటు	8 ఏళ్ల గరిష్ఠానికి చేరిక
నిలిచిపోయిన ప్రాజెక్టులు	సంఖ్యలో పెరుగుదల

నందన్ నీలేకని బోర్డు తప్పిదాలను సవరించారు

ఇన్ఫీ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బాలక్రిష్ణన్

బెంగళూరు: ఇన్ఫోసిస్ కంపెనీ గత బోర్డు సీఈవోల వేతనాల నిర్ణయంలో చేసిన తప్పును కంపెనీ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సరిదిద్దారని ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి బాలక్రిష్ణన్ అన్నారు. 'నందన్ నీలేకని ఆధ్వర్యంలోని బోర్డు ప్రస్తుత సీఈవో సలీల్ పారేఖ్ వేతనంను ఆయన ప్రతిభకు తగ్గట్టుగా నిర్ణయించారు. అంతేకాక దీర్ఘకాలంలో అతని సేవలను దృష్టిలో పెట్టుకొని చేసిన నిర్ణయం' అని బాలక్రిష్ణన్ మీడియాతో అన్నారు. సీనియర్ మేనేజ్‌మెంట్ వేతనాలు వారి సామర్థ్యాలను బట్టి ఉంటాయి. బోర్డు ఈ విషయాన్ని గమనించి తగిన విధంగా చర్య చేపట్టిందన్నారు. బోర్డు అనుసరిస్తున్న ప్రమాణాలు పెరుగుతున్న షేర్‌హోల్డర్లను దృష్టిలో పెట్టుకొని చేసింది. ఒకవేళ బోర్డు తన విచక్షణమేరకు ప్రక్రియను చేపడితే. ఆ వివరాలను షేర్ హోల్డర్లకు తెలుపాల్సి ఉంటుంది అని బాలక్రిష్ణన్ అన్నారు. ఇన్ఫోసిస్ బోర్డు పారేఖ్ వేతనం ఏడాదికి రూ.6.5 కోట్లుగా నిర్ణయించింది. 2018-19 నాటికి ఇది రూ.9.75 కోట్లుగా పెరిగే అవకాశముంది. గత బోర్డు తప్పుడు నిర్ణయాలు చేసింది. అది ఇన్ఫోసిస్ స్థాపకుల ఉద్దేశాలను సంస్కృతి, విలువలను గుర్తించలేదు. మాజీ సీఈవో విశాల్ సిక్కా వేతనంను ఎటువంటి కారణంలేకున్నా భారీగా పెంచి మిగతా ఉద్యోగుల వేతనాలను స్వల్పంగా పెంచిందని బాలక్రిష్ణన్ గుర్తుచేశారు. క్యాపిటలిజంలో పరిమితిని మించిన అధిక వేతనాలు క్యాపిటలిజంను అర్థంచేసుకోవడంలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడతారన్న ఎన్ ఆర్ నారా యణ మూర్తి వ్యాఖ్యలను బాలక్రిష్ణన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక షేర్ హోల్డ ర్‌గా బోర్డును త్వరగా పునర్నిర్మాణం చేయాలని కోరుకుంటున్నట్లు అయన చెప్పారు.

నాలుగు కొత్త కోర్సులు ప్రారంభించనున్న ఐసీఎఐ

కోయంబతూర్: దేశంలో చార్టెడ్ అక్కౌంట్ల కోర్సులను నిర్వహించే ఇన్సిటిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఎఐ) త్వరలో కొత్తగా నాలుగు కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇవి ఐసిఎఐ సభ్యులు, సభ్యులు కాని వృత్తి నిపుణులకు ఉపయోగపడతాయని పేర్కొంది. శనివారం ఈమేరకు వివరాలను ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ హెచ్. పద్మనాభన్ విలేకరులకు వెల్లడించారు. ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ఇన్ బిజినెస్ వాల్యుయేషన్, సెర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఆర్బిట్రేషన్, సెర్టిఫికెట్ కోర్స్ ఇన్ జిఎస్‌టీ, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ఇన్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ఫర్ ఇంజినీర్స్ అనే కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కంపెనీల ఖాతాల మదింపులు, ఆడిటింగ్ రంగాలు ప్రస్తుత కాలంలో అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, అర్బిట్రేషన్ కోర్సు అధ్యయనం వల్ల వివాదాలను కోర్టు బయటే పరిష్కరించుకోవచ్చని పద్మనాభన్ తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన జిఎస్‌టీ విషయానికి వస్తే పన్ను సంస్కరణల్లో ప్రధానమైనదన్నారు. ఇది నేర్చుకోవడంలవల్ల వ్యాపారంలో సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చాన్నారు. తమ సంస్థ ఇటీవల జాతి నిర్మాణ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోందని, ముఖ్యంగా కేంద్రం చేపట్టిన ఒకే జాతి ఒకే పన్ను, స్వచ్ఛ భారత్ అభియాన్, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నమాని ఆయన తెలిపారు.







హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ వెహికల్ రెనవబుల్ ఎనర్జీ ఎగ్జిబిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైటెక్స్‌లో జరిగిన ఎలక్ట్రిక్ రెనవెబుల్ ఎనర్జీ వాహనాల ప్రదర్శనకు సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చింది. శనివారం హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ వెహికల్ రెనవబుల్ ఎనర్జీ ఎగ్జిబిషన్ (ఈవిరెక్స్) పేరుతో ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శనను ప్రారంభించారు. దక్షిణ భారత దేశంలో తొలిసారి ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు సోలార్ విద్యుత్‌తో నడిచే మోటార్ సైకిల్స్ , మోపెడ్స్ , ఆటోలు , కార్లు , కార్గొలు ఉత్పత్తి చేసే 70కిపైగా కంపెనీలు పాల్గొన్నాయి. కర్బన ఉద్గారాల కాలుష్యం తగ్గించి వావారణానికి మేలు చేసేలక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌కు భారీ స్పందన ఉన్నట్టు ఈవీఆర్ఇఎక్స్ సీఈవో డా.కె.ఎస్.మూర్తి తెలిపారు. శనివారం ప్రారంభమైన ఈ ప్రదర్శన రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. తెలంగాణను కాలుష్య రహింతగా మార్చేందుకు సోలార్ విద్యుత్ వాహనాలు ఉపయోగపడతాయని వారు మీడియాతో అన్నారు. వంద కిలోమీటర్లు సాధారణ వాహనంలో ప్రయాణించాలంటే రెండు లీటర్ల పెట్రోల్ అవసరం . ఇందుకోసం రూ.140 రూపాయల దాక ఖర్చు చేయాల్సివస్తుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ద్విచక్రవాహనం నడిపేందుకు నెలకు నాలుగు వేల రూపాయల దాక పెట్రోల్ కొనుగోలుకే సరిపొతుందని అదే ఎలక్ట్రిక్ వెహికల్ అయితే కేవలం రెండు మూడు వందల రూపాయలతోనే సరిపోతుందని వాహన ఉత్పత్తిదారులు చెబుతున్నారు. విద్యుత్ చార్జింగ్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు ప్రస్తుతం రెండు మాడల్స్‌లో లభిస్తున్నాయి. టాటా కంపెనీతో కలిసి అగస్త్యఆటోమొటివ్ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాన్ని రూపోందించింది. ఈ వాహనం ఆరు గంటలు చార్జింగ్‌తో 350కిలోమీటర్ల దాకనడవనుంది. ఈవి లెరిట్, ఈ2వోకార్లు కూడా ప్రదర్శించారు. సందర్శకులు వీటిని ఆసక్తితో తిలకించి వాటి పనితీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

పీసీబీలో పోస్టుల భర్తీకి 11న ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, అనాలిస్టు గ్రేడ్-2, సీనియర్ టైపిస్టు ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థులకు 11న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు. ఎంపికయిన అభ్యర్థుల వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో 8 నుంచి అందుబాటులో ఉంటాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి 16 నుంచి 'పది' ప్రీఫైనల్ పరీక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఫిబ్రవరి 16 నుంచి ఎస్ఎస్‌సీ ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రీఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12లోపు ప్రకటించనున్నారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ఈనెల 3నుండి 7 వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణనిస్తుండగా, సింగరేణి మైన్స్ రెస్క్యూ విభాగం శనివారం ప్రదర్శననిచ్చింది. కార్యక్రమంలో సింగరేణి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మహేష్, రాష్ట్రకార్యదర్శి చంద్రశేఖర్, సింగరేణి ఆర్గనైజర్ కెవి రమణ పాల్గొన్నారు.

కొత్త స్కూల్స్ స్థాయిపెంపునకు 310 దరఖాస్తులు


హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు పాఠశాలల పెంపు, ఇప్పటికే కొనసాగుతున్న స్కూల్స్ స్థాయి పెంపు కోసం 310 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా హైదరాబాద్ జిల్లా నుంచి 50 దరఖాస్తులు రాగా మేడ్చల్ జిల్లా నుంచి 48, రంగారెడ్డి జిల్లాలో 46 దరఖాస్తులు వచ్చాయి. 2018-19లో కొత్తగా ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం, ఉన్న స్కూల్స్‌లో స్థాయి పెంపుకోసం పాఠశాల విద్య శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. డిసెంబర్ 30 వరకు దరఖాస్తులను స్వీకరించారు.

కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ - కాకినాడ మధ్యన మూడు ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నారు. ఈ నెల 14న హైదరాబాద్ నుండి ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ నుండి ఈ నెల 15, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్ చేరుకుంటాయి. ప్రత్యేక రైళ్లు అన్ని ప్రధానమై స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. 16న మరో రైలు కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుం టుందన్నారు. కాకినాడ నుండి ప్రయాణికుల రద్దీ కారణంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌కు మూడు ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నామని వెల్లడించారు.

ఇసుక మాఫియాపై విచారణ జరిపించండి

సీఎస్‌కు వినతి పత్రం సమర్పించిన ఎమ్మెల్సీ పొంగులేటి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇసుక మాఫియా, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పిం చారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా, మాఫియా ఆగడాలు మితిమీరి పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వివిధ సంఘటనలను ఉదహరిస్తూ ఇదే అంశాన్ని సీఎస్ దృష్టికి తీసుకువెళ్ళానని చెప్పారు. వేలకోట్ల రూపాయలు సంపాదిస్తున్నామని చంకలు గుద్దుకుంటున్న అధికార పార్టీ నాయకులు ఈ మాఫియాకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.

దూరప్రాంతాలకు అదనపు బస్సులు

- మరో 1500 కొత్త బస్సుల కొనుగోలుకు చర్యలు
- రూ.1000 కోట్లు ప్రభుత్వ సాయం కోరనున్న ఆర్టీసీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీ దూర ప్రాంతాలకు అదనపు బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. పర్యాటక ప్రాంతాలు, పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడిపించడం లాభ సాటి భేరంగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ముఖ్యమైన పట్టణాలకు టిఎస్‌ఆర్టీసీ బస్సులను నడిపించడంతో పాటుగా ముం బాయి, బెంగుళూరు, షిర్డీ, తిరుపతి, శ్రీశైలం, పూణె తదితర ప్రాం తాలకు అదనపు బస్సులు నడిపించ బోతున్నామని ఆర్టీసీ అధి కారులు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ లోని కొన్ని ప్రధానమైన పట్టణాలకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుండి బస్సులు నడిపించడానికి చర్యలు తీసుకుంటు న్నామని వివరించారు. దర్శనీయ ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు లను నడిపించే అంశం కూడా పరిశీలనలో ఉందన్నారు. తిరుపతి, శ్రీశైలం, షిర్డీ దేవాలయాల అధికారులతో ఇప్పటికే సంప్ర దింపులు ప్రారంభించామన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణి కులకు దైవ దర్శనం, వసతి తదితర అంశాలను సమకూర్చే విషయం లో అవగాహన ఏర్పడిన వెంటనే పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను తిప్పడం జరుగుతందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అదనపు బస్సులు నడిపించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, రాబోవు రోజుల్లో మరిన్ని బస్సులు నడిపించబోతున్నామని వెల్లడించారు. సంక్రాంతి సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ కె ఎక్కువ బస్సులు వేయడం జరిగిం దన్నారు. ప్రభుత్వం కొత్త బస్సులు కొనడానికి ఆర్థిక సహకారం ఇస్తుందని, డిపోలు నష్టాలను అధిగమిస్తు న్నాయని. హైదరాబాద్ సిటీ డిపోల నుండి కూడా దూర ప్రాంతాలకు బస్సులను నడిపించి గ్రేటర్ డిపోలను లాభాలబాట పట్టించేందుకు చర్యలు తీసు కుంటున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం 2017 -18 బడ్జెట్ లో ఆర్టీసీకి రూ. 1000 కోట్లు కేటాయించిందని, ఇప్పటి వరకు రూ. 650 కోట్ల మేరకు ఆర్టీసీకి విడుదల చేయడం జరిగిందని, మిగతా మొత్తం విడుదల చేయించుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో తిప్పే బస్సుల్లో అత్యధికంగా పాతవై నందున వాటి స్థానంలో దశల వారిగా కొత్త బస్సులను ప్రవేశపెట్ట బోతున్నామని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్ స్టేషన్లను ఆధునీకరించామని, తెలంగాణలోని అన్ని ప్రయాణ ప్రాంగ ణాలను అభివృద్ధి చేయడంతో పాటుగా అహ్లాదకరమైన వాతావరణం కల్పించబోతున్నామని వివరించారు. సొంత వనరుల ను వృద్ధి చేసుకోవడంలో భాగంగా ఇప్పటికే పెట్రోల్ బంకుల ఏర్పాటు ప్రక్రియ ప్రారం భమైం దన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుండి మరో రూ. 1000 కోట్లు పొందడంతో పాటుగా దాదాపు 1500ల కొత్త బస్సులను కొనుగోలు చేయడానికి కూడా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రయాణ ప్రాంగణాలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ పద్దుల కింద ప్రభుత్వం నుండి ఆర్టీసీకి రావలసి న బకాయిలను రాబట్ట డానికి చర్యలు తీసుకుం టున్నారు.

రవాణా మంత్రి పి.మహేం దర్ రెడ్డి ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తు న్నార ని ఉన్నతాధి కారులు తెలి పారు. ఆర్టీసీని బలో పేతం చేయాలనే ముఖ్య మంత్రి ఆకాంక్ష నెరవేర్చే దిశగా ప్రణాళికాబద్ధమైన చర్యలతో ముందుకు సాగుతున్నామన్నారు.

తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ

మందకృష్ణమాదిగను బేషరతుగా విడుదల చేయాలి: సమావేశంలో వక్తలు



సోమాజిగూడ, ప్రభ న్యూస్ : ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడ్డ తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూని అవుతుందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనలకు సైతం అవకాశమివ్వకుండా అణిచివేతలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 23 ఏళ్లుగా శాంతియుతంగా సాగుతున్న వర్గీకరణ ఉద్యమాన్ని కించపరుస్తూ మందకృష్ణపై అక్రమ కేసులు బనాయించిందని తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, విరసం నేత ఖాసిం తదితరులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ నరసింహన్ లు దళిత వ్యతిరేకులని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో ముందున్న మాదిగల పట్ల కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ దీక్ష చేస్తున్న కేసీఆర్‌ను కలిసి దీక్ష విరమించాలని, బతికుండి సాధించుకుందామని తాను కోరానని సర్వే సత్యనారాయణ అన్నారు. సోనియాగాంధీని ఒప్పించి దీక్ష విరమింపజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు దీక్ష చేసిన కేసీఆర్‌కు నిమ్మరసం ఇచ్చింది మాదిగ అని, అనంతరం తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది సుశీల్ కుమార్ షిండే అని, దానిని పాస్ చేసింది మీరాకుమారి మాదిగ బిడ్డేన్న విషయాన్ని కేసీఆర్ మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి, ఆయన కుటుంబానికి వకాల్తా పుచ్చుకొని గవర్నర్ మాట్లాడ టాన్ని నిలదీశామని చెప్పారు. దేశం మొత్తంలో గవర్నర్ చేసే అర్హత కలిగిన బీజేపీకి చెందిన వ్యక్తి లేడా అని నిలదీశారు. వర్గీకరణ కోసం తన ప్రాణాలైన అర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సర్వే సత్యనారాయణ ప్రకటిం చారు. దళితులను, మహిళలను కేసీఆర్ నీఛంగా చూస్తున్నారని, అధికార దర్పంతో కేసీఆర్‌కు కళ్లు మూసుకు పోయాయని, ఆయన కళ్లు తెరిపించేది మాదిగలేనని అన్నా రు. మందకృష్ణపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బేషర తుగా ఆయనను విడుదల చేయా లని ఎమ్మెల్యే సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం కేసీఆర్ స్వంత జాగీరులా వ్యవహరిస్తున్నారని చెరుకు సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను శాంతియుతంగా దీక్ష చేపడుతానని ప్రభుత్వానికి అనుకూలమైన ప్రదేశాన్ని ఇవ్వమని అభ్యర్థించి ప్రభుత్వం ఇవ్వకపోతే తనకు తానుగా తన కార్యాలయంలో దీక్షకు దిగితే అరెస్ట్ చేసే అధికారం ముఖ్యమంత్రికుందా అని ప్రశ్నించారు. నిరం కుశ వైఖరికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయ కులు నాగయ్య, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మేడారం జాతరకు రూ. 2కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగే మేడారం జాతరకు రూ.2 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం పాలనమైన అనుమతులను జారీ చేసింది.

సమక్క-సారలమ్మ జాతరకు రండి

రమణసింగ్‌ను ఆహ్వానించిన బీజేపీ ప్రతినిధి బృందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జనవరి-ఫిబ్రవరిలో జరిగే మేడారం సమక్క, సారలమ్మ జాతరకు చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను భాజపా ప్రతినిధి బృందం ఆహ్వానించింది. ఆదివాసి కుంభమేళగా ప్రసిద్ధి గాంచిన జాతర విశేషాలను తెలుసుకున్న రమణ్‌సింగ్ ఈ జాతరకు తప్పకుండా వస్తానని తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చింతా సాంబమూర్తి, ప్రేమేందర్‌రెడ్డి, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సేవా సమితి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తదితరులు ఉన్నారు.

సీఎం దళిత వ్యతిరేకి

చంచల్‌గూడలో మందకృష్ణను కలిసిన బీజేపీ నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీజేపీఎల్పీ నేత కిషన్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డిలు శనివారం చంచల్‌గూడ్ జైలులోకి వెళ్లి మంద కృష్ణ మాదిగను కలిశారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ప్రధాన మంత్రి మోడి వద్దకు తీసుకెళ్లాల ఒత్తిడి చేస్తామన్నారు. శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న కృష్ణమాదిగను అరెస్టు చేసి రెండు సార్లు జైల్లో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని ఆయన అన్నారు.

వర్గీకరణకు ప్రాణాలర్పిస్తా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంపై ప్రధాన మంత్రి అపాయింట్‌మెంట్ ఇచ్చినా.. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు వెళ్లడం లేదని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. వర్గీకరణ కోసం 23 ఏళ్లుగా శాంతియుతంగా ఉద్య మిస్తున్న మంద కృష్ణమాదిగ ఒక్కడిని అరెస్టు చేస్తే.. రెండు రాష్ట్రాల్లోని మాదిగ లంతా మంద కృష్ణలే అవుతారని ఆయన హెచ్చరిం చారు. శనివారం ఆయన మాజీ ఎంపీ రాజయ్యతో కలిసి చంచల్‌గూడ జైల్లో ఉన్న మంద కృష్ణమాదిగను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్‌తో సీఎం కేసీఆర్‌లు మాదిగల వ్యతిరేకులుగా ఉన్నారని ఆయన విమర్శించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నప్పుడు ధర్మం, న్యా యం వైపు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్ మాత్రం టీఆర్ఎస్ కార్య కర్తగా వ్యవహరిం చడం సరికాదన్నారు. వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ తన కార్యాలయంలో దీక్ష చేస్తుంటే అరెస్టు చేసి జైల్లో పెట్టడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. తమ ప్రాణాలు అడ్డుపెట్టైనా ప్రభుత్వం మెడలు వంచి వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. ఈ రాష్ట్రంలో మాత్రం ప్రజాస్వామ్యాన్ని సీఎం కేసీఆర్ ఖూనీ చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మాదిగలతో పాటు అన్ని వర్గాల ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

ఏపీ ఉద్యోగులను అడ్డుకోవద్దు

ఆంధ్రా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తమ సచివాలయంలోకి రాకుండా ఏపి ఉద్యోగులను అడ్డుకోవద్దని ఎపి గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రతి శనివారం ఎపి సచివాలయానికి వచ్చే తమ ఉద్యోగులను సచివాలయం లోపలికి రాకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. శనివారం సచివాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మరో ఎనిమిదేళ్లు ఎపి సచివాలయం తమ పరిధిలో ఉంటుందని, లోపలికి రాకపోకలు సాగించే హక్కు ఉద్యోగులకు ఉందన్నారు. ప్రతి శనివారం బ్యాంకు పనులు, యూనియన్ కార్యకలాపాలు, సహకార కార్యాలయ పనుల నిమిత్తం ఉద్యోగులు వస్తారని , వారిని అడ్డుకోవద్దని సూచించారు. పరిస్థితి ఇలాగే ఉంటే చిలికి చిలికి గాలివానగా మారే ప్రమాదం ఉందని కృష్ణయ్య హెచ్చరించారు.

మమ్మల్ని తెలంగాణకు రప్పించండి

తెలంగాణకు చెందిన తమను తెలంగాణకు కేటాయించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు విజ్ఞప్తిచేశారు. అటెండర్లుగా పని చేస్తున్న దాదాపు 168 మంది తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా నికి కేటాయించారని, తెలంగాణ స్థానికులమైన తమను స్వరాష్ట్రా నికి రప్పించేందుకు సీఎం కేసీఆర్ చొరవ చూపాలని ఉద్యోగులు విజయలక్ష్మి, అస్రా బేగం, ఫహీమున్నీసా, డి ఉషాదేవి, లక్ష్మి తదితరులు కోరారు. తామొక చోట,కుటుంబాలొక చోట ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శనివారం సచివాలయంలో తమకు కలిసిన ప్రతి అధికారికి వారు తమ గోడును చెప్పుకున్నారు.

ఎంపీలో డీజీపీ, ఐజీపీల జాతీయ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ రాష్ట్రాల డీజీపీ, బీఎస్ఎఫ్ అకాడమీ ఐజీపీల జాతీయ సమావేశం మధ్యప్రదేశ్ గ్వాలియర్ జిల్లా టెకన్‌పూర్‌లో శనివారం ప్రారంభమైంది. కేంద్ర హోంమంత్రి ఈ సమావేశాన్ని ప్రారంభించగా.. ప్రధాని నరేంద్రమోడీ ముగింపు సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో కేంద్ర సాయుధ బలగాలైన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ తదితర సంస్థల నుంచి 250 మంది అధికారులు పాల్గొన్నారు. 2014లో గౌహతి, 2015లో గుజరాత్, 2016లో హైదరాబాద్‌లో ఈ సదస్సు నిర్వహించగా, మిగతా అన్ని సమావేశాలు ఢిల్లీలోనే నిర్వహిస్తూ వచ్చారు. టెకన్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ అకాడమీలో సోమవారం వరకూ ఈ సమావేశం నిర్వహిస్తారు.

శంషాబాద్‌లో మహిళ కిడ్నాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రంగారెడ్డి జిల్లాలో అరుణ అనే మహిళ కిడ్నాప్ కలకలంగా మారింది. శంషాబాద్ మండలం మల్కారంలోని ఆశాజ్యోతి రిహాబిలిటేషన్ సెంటర్‌లో మానసిక చికిత్స తీసుకుంటున్న అరుణను కిడ్నాప్ చేశారు. గత నెల 30న బంధువులమని చెప్పిన ఇద్దరు వ్యక్తులు అరుణను తమతో తీసుకెళ్లారు. కాగా జనవరి 3న అరుణ సోదరి రిహాబిలిటేషన్ సెంటర్‌కు ఫోన్‌చేసి తమ చెల్లెలి క్షేమ సమాచారం అడిగింది. దీంతో కంగుతిన్న కేంద్రం నిర్వాహకులు.. అరుణను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తెలుసుకున్నారు. శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌ముఠా పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని నలుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14.28 లక్షలు, 17 సెల్‌ఫోన్స్, ఇన్నోవా కారు, ల్యాప్‌టాప్, టీవీని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ముఠాలో ప్రధాన నిందితుడు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు పోలీసుల దర్యాప్తులో ఉంది.

బాయిలర్ పేలి ఇద్దరు మృతి

సూరంపల్లి పరిశ్రమలో ప్రమాదం

నలుగురి పరిస్థితి విషమం

అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలోని జీఎస్ అల్లాయ్ కాస్టింగ్స్ సంస్థలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఇద్దరు కార్మికులు మృతి చెందగా తీవ్ర గాయాలకు లోనైన నలుగురిని చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు కొందరు చెపుతుండగా, అధిక వేడి కారణంగా బాయిలర్లు పేలడమే ప్రమాదానికి కారణమని కొందరు అంటున్నారు. మంటలు అదుపు చేస్తే తప్ప ప్రమాద కారణాలు వెల్లడించలేమని అధికారులు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే..శనివారం రాత్రి 8గంటల సమయంలో జీఎస్ అల్లాయ్-2 పరిశ్రమలో నుంచి పెద్ద పెట్టున శబ్దాలతో కూడిన మంటలు వచ్చాయి. ఇనుమును కరిగించేందుకు నిర్ధేశించిన బాయిలర్ ఒక్కసారిగా పేలడం ఇందుకు కారణంగా చెపుతున్నారు. ప్రమాద ఘటనతో ఆందోళనకు గురైన కార్మికులు బయటకు పరుగులు తీయగా ఆరుగురు మంటల్లో చిక్కుకున్నారు. మంటల ధాటికి తీవ్రంగా గాయపడిన వారిలో శివ శంకర్ కుమార్(38), ముబారక్(30) మృతి చెందగా, రమేష్ నాయక్(31), సత్యనారాయణ(35), ముజాహిద్దీన్(30), ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని విజయవాడ గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు చెపుతున్నారు. 80శాతంకి పైగా గాయపడిన వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు చెపుతున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పోలీసు, అగ్నిమాపక అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. మంటలు ఎగిసిపడటంతో లోనికి ఎవరిని అనుమతించడం లేదు. జరిగిన ఘటనపై గన్నవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ తర్వాత ప్రమాద కారణాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

జన్మభూమితో మారుతున్న గ్రామాల రూపురేఖలు

అమరావతి, ఆంధ్రప్రభ : జన్మభూమి- మా ఊరు కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం సమకూరుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజల నుంచి పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తమవుతోందని మూడున్నరేళ్ల నిరంతర శ్రమకు ఫలితాలు అన్నిచోట్ల కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో 5వ రోజు జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారన్నారు. వారిలో సానుకూలత, స్పష్టత పెరిగిందని ఇది మంచి పరిణామంగా అభివర్ణించారు.

జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో తొలి రోజు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొంటే నాల్గవ రోజు 6.54 లక్షల మంది హాజరయ్యారని, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలని ఆకాంక్షించారు. గత నాలుగు రోజుల్లో 4,68,063 అర్జీలు వచ్చాయని వాటిలో 1,52,444 ఫిర్యాదులు ఆన్‌లైన్ చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో 85 శాతం ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరిచారని మిగిలిన జిల్లాలు కూడా అదే విధంగా పనిచేయాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును రియల్ టైమ్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వ్యవస్థల సామర్ధ్యం పెంపు, ప్రజా భాగస్వామ్యం ఒక డెడ్లీ కాంబినేషన్ అని ఎంతమందికి వీలైతే అంతమందికి న్యాయం చేయాలని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి సూచించారు. సమస్యలు సకాలంలో పరిష్కరించకపోతే ప్రజల్లో అసంతృప్తికి దారి తీస్తుందని హెచ్చరించారు. సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారమే ప్రజా సంతృప్తికి కొలమానమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి-మా ఊరు గ్రామసభల్లో ఇప్పటి వరకు 34,060 పశు వైద్య శిబిరాలు నిర్వహించి 6,24,000 పశువులకు చికిత్సలు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వైద్య శిబిరాల వల్ల రైతులకు, పశు పోషకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని మార్గదర్శకం చేశారు.

ఉమ్మడి హైకోర్టు విభజనకు 3 కమిటీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియను పర్యవేక్షించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశారు. ఉమ్మడి హైకోర్టు ఉద్యోగుల కమిటీలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ , జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ ఏ. శంకరనారాయణ, జస్టిస్ షమీమ్ అక్తర్, ఉన్నారు. భవనాల కమిటీలో జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్‌ఏవీ.శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, ఉన్నారు. ఇక రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలో జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్, జస్టిస్ పి.నవీన్ రావు, జస్టిస్ ఎస్వీ.భట్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా హైకోర్టులు వచ్చే జూన్ 2 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకోసం అవసరమైన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ కు లేఖ రాసిన విషయం తెలిసిందే. పర్యవసానంగా హైకోర్టు న్యాయమూర్తులందరూ (ఫుల్ కోర్ట్) ఇటీవల సమావేశమై, కమిటీల ఏర్పాటు చేసే బాధ్యతను ఏసీజేకు అప్పగించిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయం మేరకు ఏసీజే ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీలో ప్రభుత్వం ప్రతిపాదించిన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తులు ఫిబ్రవరి మొదటి వారంలో అమరావతికి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏపీకి వెళ్లి అక్కడి భవనాలను పరిశీలించి హైకోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాన్ని ఎంపిక చేసి తుది నిర్ణయాన్ని ఫిబ్రవరి చివరి వారంలోగా తెలియజేస్తే జూన్ లో హైకోర్టు ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేసుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఆ లేఖలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ లేఖను ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఏసీజే కు అందజేసిన విషయం తెలిసిందే..ఏపీ ప్రభుత్వం గుర్తించిన కొన్ని భవనాలను జడ్జీల కమిటీ పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, మార్పులు - చేర్పులు చేసేందుకు తగు సూచనలు చేస్తారు. జడ్జీల కమిటీ సూచనలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం భవనాన్ని ఏప్రిల్ చివరి వారంలో సిద్ధం చేసేందుకు, వేసవిసెలవుల్లో ఫైళ్లు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ఏపీ హైకోర్టుకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ లో ఉన్న హైకోర్టుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి కక్షిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏపీ హైకోర్టును అమరావతి ప్రాంతంలోని తాత్కాలిక భవనంలో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం హైకోర్టు అవసరాలకే కాకుండా న్యాయమూర్తులు, సిబ్బంది నివాసాలకు కూడా తగిన భవనాలు అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి హైకోర్టు విభజనపై తెలంగాణ ప్రభుత్వం, న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి.

అయితే అప్పట్లో ఏపీ అంతగా సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం, భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఆలస్యమైంది. అయితే తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ప్రత్యేక హైకోర్టు చేసేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. దీనికి తోడు లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటన చేయడంతో ఉమ్మడి హైకోర్టు విభజనకు మార్గం సుగమమైంది.

ఐచ్చికాల ఆధారంగా న్యాయమూర్తుల కేటాయింపు.

ఉమ్మడి హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు ఇచ్చిన ఐచ్చికాల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులకు కేంద్ర ప్రభుత్వం న్యాయమూర్తులను విభజించిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టుకు మొత్తం 61 మంది న్యాయమూర్తులను కేటాయించారు. 60 :40 నిష్పత్తిలో ఏపీకి 37 మంది, తెలంగాణకు 24 మంది న్యాయమూర్తులను నిర్ణయించారు. ఉమ్మడి హైకోర్టులో ప్రస్తుతం పనిచేస్తున్న 31 మంది న్యాయమూర్తుల్లో 17 మందిని ఏపీకి ,12 మందిని తెలంగాణ కు కేటాయించారు. ఈ విషయాన్ని ఏసీజేన్యాయమూర్తులతో చర్చిస్తారు. ఏపీలో భవనాల్ని చూసేందుకు జడ్జీలతో కమిటీని ఏర్పాటు చేస్తారు. అంతా సవ్యంగా జరిగితే కేంద్ర మంత్రి వర్గ అనుమతితో రాష్ట్రపతి ప్రకటన వెలువడుతుంది.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వీరే

జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్, జస్టిస్ ఎమ్మెస్.రామచంద్రరావు, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ పి.నవీన్ రావు జస్టిస్ చల్లా.కోదండరామ్, జస్టిస్ బి.శివశంకరరావు, జస్టిస్ ఎమ్మెస్కే.జైస్వాల్, జస్టిస్ డాక్టర్షమీమ్ అక్తర్ , జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్ నాథ్ గౌడ్.ఉన్నారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎస్వీ.భట్, జస్టిస్ ఏవీ.శేషసాయి, జస్టిస్ దామా.శేషాద్రినాయుడు, జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ ఎ.శంకరనారాయణ, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జి.ఉమాదేవి, జస్టిస్ ఎన్.బాలయోగి, జస్టిస్ టి.రజనీ, జస్టిస్ డీవీఎస్ఎస్.సోమయాజులు, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ఎం.గంగారావు.ఉన్నారు.

ప్రణాళికలన్నీ అమలుచేస్తాం

ఏపీ గ్రామీణాభివృద్ధి ఐటీశాఖ మంత్రి లోకేష్



కాకినాడ, ప్రభ న్యూస్ బ్యూరో: నిర్ధేశిత ప్రణాళిక పను లన్నింటినీ అమలు చేసిన తర్వాతే తాము ఓట్లు అడు గుతా మం టూ గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. గతెన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కాల పరిమితిలోగా నూరుశాతం అమలు చేసి తీరుతామన్నారు. మార్చి నుంచి పెళ్ళికానుకపథకాన్ని అమల్లోకి తెస్తున్నామన్నారు. 2018 చివరినాటికి గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కల్పిస్తామన్నారు. 157పంచాయతీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 14వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను సిసి రోడ్లుగా మార్చామన్నారు. గ్రామాల్లో 4200అంగన్‌వాడీ భవనాల్ని నిర్మించామన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లాలో లోకేష్ విస్తృతంగా పర్యటించారు. ఉదయం పండూరులో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అచ్చంపేటలో ఘనవ్యర్ధపదార్ధాల నిర్వహణ, సంపద కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పెద్దాపురంలో నిర్మాణంలో ఉన్న అందరికీ ఇళ్ళు ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. అక్కడే అపర్ణటైల్స్ ప్యాక్టరీని ప్రారంభించారు. జగ్గంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఆర్ధిక లోటున్నప్పటికీ ఇచ్చిన హామీల్లో వెనక్కితగ్గేదిలేదన్నారు. ఒకేసారి పింఛన్ మొత్తాన్ని ఐదురెట్లకు పెంచడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడున్నారన్నారు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు వారి ఖాతాల్లో ఆరేసివేల చొప్పున జమ చేశామన్నారు. రైతుల రుణమాఫీ ఒక కొలిక్కొస్తోందన్నారు.

ఆదాయం వారికి.. అప్పులు మనకు

రాష్ట్ర విభజన నేపధ్యంలో ఆదాయం తెలంగాణాకెళ్ళగా అప్పులు మాత్రం మనకు మిగిల్చారని లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోటుబడ్జెట్‌లోనే సతమతమౌతోందన్నారు. సిద్ధాంత ప్రాతిపదికలేని విభజన వల్ల రాష్ట్రంపై భారం పెరిగిందన్నారు. రావాల్సిన ఆదాయానికి అప్పటి కేంద్రప్రభుత్వమే గండికొట్టిందన్నారు. విభజనలో స్పష్టమైన విధానాన్ని పాటించలేదన్నారు. అయినప్పటికీ చంద్రబాబు అవిరళ కృషి కారణంగా ఆంధ్రప్రదేశ్ తిరిగి ఆర్ధికంగా కోలుకుంటోందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలు గల పాలనా వ్యవస్థను ముఖ్యమంత్రి ఇక్కడ ప్రవే శపెట్టారన్నారు. పాలనలో పూర్తిపారదర్శకత అమ లౌతోందన్నారు.

గుడ్డిగా 'అణు' నిర్ణయాలు

ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి మహ్మద్ జావేద్

ఇరాన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ట్రంప్ తీసుకొస్తున్న అణు ఒప్పందం కొత్త విధానాలను ఉద్దేశించి ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి మహ్మద్ జావేద్ జారీఫ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో కూడా దీనిపై వ్యతిరేకత వచ్చిందని గుర్తు చేశారు. విధానాలను ట్రంప్ గుడ్డిగా తీసుకొస్తున్నారని అభిప్రాయపడ్డారు. అమెరికా చేస్తున్న ప్రయత్నాన్ని ఐక్యరాజ్య సమితే తిరస్కరించిందని జావేద్ అన్నారు. న్యూక్లియర్ డీల్‌తో పాటు దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యంపై కౌన్సిల్‌లోని మెజార్టీ సభ్యులు ముక్తకంఠంగా తిరస్కరించారు. ఇరాన్ వ్యతిరేకించిన ఐదు రోజుల తరువాత ఐక్యరాజ్యసమితిలో విదేశీ విధానంపై చర్చించడానికి అమెరికా పట్టుబట్టింది. ఇరాన్ కార్యకలాపాలపై బ్రిటన్‌తో పాటు ఫ్రాన్స్ సైతం మండిపడింది. నిరసనకారుల హక్కులను ఇరాన్ గౌరవించాలని కోరాయి. ఫ్రెంచ్ అంబాసిడర్ ఫ్రాన్‌కోయిస్ డెలాట్రిట్ మాట్లాడుతూ.. గతంలో జరిగిన ఘటనలు అంతర్జాతీయ శాంతి భద్రతకు విఘాతం కల్గించేలా ఉన్నాయని అన్నారు. చైనాతో పాటు ఇథియోపియా, కువైట్, స్వీడన్ కూడా ఇరాన్ వ్యవహారశైలిపై మండిపడ్డాయి. చర్చపై సమయం వృథా తప్ప మరేం లేదని ఇరాన్ అంబాసిడర్ ఘోలామలీ ఖుశ్రు అభిప్రాయపడ్డారు. అమెరికా, ఇతర దేశాల వైఖరికి నిరసనగా ఇరాన్ అధికారులు బుధవారం నుండి మూడు రోజుల పాటు భారీ ర్యాలీలు నిర్వహించారు. 2015లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాతో ఇరాన్ అణుఒప్పందాన్ని కుదుర్చుకుంది. అనంతరం ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. అమెరికా అధ్యక్షుడు సైతం అణు ఒప్పందం విషయమై తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ఇతర దేశాలు సంతకాలు చేయడంతో ఇరాన్ బలంగా ఉంది.

ప్రపంచం మిమ్మల్ని గమనిస్తుంది : నిక్కీ

ఇరాన్ వ్యవహార శైలిని ఉద్దేశించి అమెరికా అంబాసిడర్ నిక్కీ హేలీ ఘాటుగా స్పందించారు. మీరు ఏం చేస్తున్నారో ప్రపంచం మొత్తం చూస్తున్నదని నిక్కీ విమర్శించారు. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా కౌన్సిల్ పలు దేశాలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఫ్రాన్స్, రష్యా, చైనాతో పాటు మిగిలిన రెండు దేశాలు కలిపి మొత్తం 15 మంది బృందం ఇరాన్ నెలకొన్న పరిస్థితులపై చర్చించింది.

నిర్లక్ష్యంవల్లే కమలామిల్స్ అగ్నిప్రమాదం

ముంబై: కమలామిల్స్ అగ్నిప్రమాదానికి సంబంధించిన నివేదికను అగ్నిమాపకశాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమర్పించారు. గత నెల ముంబైలో జరిగిన మోజో బిస్ట్రో రెస్టారెంటులో తొలుత అగ్నిప్రమాదం జరిగి అనంతరం మంటలు వన్ అబౌ రెస్టారెంటుకు వ్యాపించాయని అధికారులు తెలిపారు. రెండు రెస్టారెంట్లలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం సరఫరా చేశారన్నారు. ఈ ప్రమాదం మానవ తప్పిదమే వల్లే జరిగిందని అధికారులు తమ నివేదికలో వెల్లడించారు. రెండు రెస్టారెంట్లలో అగ్నిప్రమాద నియంత్రణకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఘోర అగ్నిప్రమాదం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. ఈప్రమాదంలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల 14మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీరిలో ఎక్కువమంది ఊపిరాడక చనిపోయారని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. కాగా పోలీసులు ఇరు రెస్టారెంట్ల మేనేజర్లను అరెస్టు చేశారు. పబ్ యజమాని ఆచూకీ తెలిపినవారికి లక్ష రూపాయల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఈ నివేదికపై ముంబై మున్సిపల్ మేయర్ మాట్లాడుతూ కమలా మిల్స్ సముదాయంలో అక్రమకట్టడాలు నిర్మించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లింటన్ ఫౌండేషన్‌పై విచారణ

వాషింగ్టన్ : ఒబామా పాలనలో విదేశాంగ కార్యదర్శిగా ఉన్న హిల్లరీ క్లింటన్ కొనసాగిస్తున్న క్లింటన్ ఫౌండేషన్ లావాదేవీల విషయమై ఎఫ్‌బీఐ విచారణ చేపడుతున్నది. రాజకీయంలో ఉన్న సమయంలో ఫౌండేషన్‌కు ఏవిధమైనా డబ్బులు పెట్టారా..? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ గత కొన్నేళ్లుగా క్లింటన్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలపై, ఆర్థిక పరిస్థితులపై విచారణ జరపాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఎన్నికల ప్రచారం సమయంలో ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చారు. నేను గెలిస్తే మాత్రం విచారణ చేపట్టి అవినీతికి పాల్పడితే జైల్లో పెట్టిస్తా అంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారు. 2009 నుండి 2013 వరకు ఫౌండేషన్‌కు వచ్చిన విరాళాలు, ఇతర ఆర్థిక స్థితిగతులపై ఎఫ్‌బీఐ ఏజెంట్లు విశ్లేషిస్తున్నారు. అదేవిధంగా నాడు ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం ఉందనే కోణంలో సైతం విచారణ చేపడుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా బిల్ క్లింటన్ ఉన్న సమయంలో అనగా 1997లో ఫౌండేషన్‌ను స్థాపించారు.

దుర్గగుడి ఈవోపై బదలీ వేటు

ఇన్చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్‌కు బాధ్యతలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఊహించినట్లుగానే దుర్గ గుడి ఘటనకు సంబంధించి నిర్వహించిన విచారణలో ఆలయంలో క్షుద్రపూజలు జరగలేదని నివేదికలు ప్రాథమికంగా తేల్చినట్లు సమాచారం.ఈ ఘటనతోపాటు పరిపాలనపరమైన లోపాలకు కారణంగా పేర్కొంటూ ఈవో సూర్యకుమారిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఇన్చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధకు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఇందుకు సంబంధించిన విచారణను ఇక ముందు కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అయితే విచారణ సజావుగా జరగాలంటే ఈవో బాధ్యతల్లో ఉండకూడదనే కారణంతోనే ఈవోను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు ప్రకటించారు. ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్రంగా స్పందించి,అధికారులతో చర్చించారు. కాగా ఇందుకు సంబంధించిన రెండు రకాల నివేదికలు శనివారం ముఖ్యమంత్రి వద్దకు చేరాయి. పోలీస్ విచారణ నివేదికను సిటీ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ సమర్పించగా, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని నిజ నిర్ధరణ కమిటీ నివేదికను ఆ శాఖ మంత్రి మాణిక్యాలరావు ముఖ్యమంత్రికి అందజేశారు.జన్మభూమి కార్యక్రమాన్ని ముగించుకుని విజయవాడలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రిని కలిసి,స్వయంగా అందజేశారు. నిజనిర్ధణ క మిటీ నివేదికను తొలుత దేవాదాయ శాఖ కమిషనర్‌కు విచారణ కమిటీ సభ్యుడైన రఘునాథ్ అందజేశారు.

అనంతరం అనురాధ మంత్రి మాణిక్యాలరావును కలిసి, నివేదికను అందజేశారు. శనివారం రాత్రి మంత్రి మాణిక్యాలరావు ముఖ్యమంత్రిని క్యాంప్ కార్యాలయంలో కలిసి,నిజనిర్ధరణ కమిటీ ఇచ్చిన నివేదికను అందజేశారు.అయితే ఈ రెండు నివేదికలను ముఖ్యమంత్రి అధ్యయనం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రితో మంత్రి మాణిక్యాలరావు, సిటీ పోలీస్‌కమిషనర్ గౌతమ్‌సవాంగ్‌తోను, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి సతీష్‌చందర్, దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ తదుపరి చర్యలు నిమిత్తం సీఎంతో భేటీ అయ్యారు. సుదీర్ఘ భేటీ అనంతరం ముఖ్యమంత్రి ఘటనపై వారికి దిశ నిర్ధేశం చేశారు. అనంతరం భేటీలోతీసుకున్న నిర్ణయాలను మంత్రి మాణిక్యాలరావు విలేకరులకు వెల్లడించారు.

కరెంట్ చార్జీలు పెంచం..వీలైతే తగ్గిస్తాం

●ప్రజా దేవాలయంలా అమరావతిని అభివృద్ధి చేస్తా ●పోలవరంపై ప్రత్యేక దృష్టి ● రాష్ట్ర వ్యాప్తంగా 19 లక్షల ఇళ్లు నిర్మిస్తాం ●డ్వాక్రా మహిళల సేవలు మరువలేనివి: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు వినూత్న రీతిలో సరికొత్త విధానాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అన్ని సమస్యలను అధిగమించుకుంటూ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నాం... అందులో భాగంగానే విద్యుత్ ఉత్పాదనారంగంలో స్టోరేజి వ్యవస్థను మరింత పటిష్టం చేయబోతున్నాం... ఫలితంగా కరెంటు చార్జీలు తగ్గించే ప్రయత్నం కూడా చేయబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆయన ఐదవ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కోడూరుపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మహిళలనుద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. అంతకుముందు ఆయన వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన గావించి, జన్మభూమి గ్రామసభనుద్దేశించి మాట్లాడుతూ కొంతమంది పనిగట్టుకుని తమను విమర్శిస్తున్నారని, మరికొందరు అవమానిస్తున్నారని, అటువంటివారందరూ కుళ్ళికుళ్ళి ఏడ్చేలా నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తానని శపథం చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజా ఆశీస్సులతో అమరావతిని ప్రజా దేవాలయంగా తయారుచేస్తానన్నారు. అలాగే ప్రతి పేదవాడికి స్వంతఇంటి కల నెరవేర్చే దిశగా ఇప్పటికే నాణ్యమైన ఇళ్ళ నిర్మాణాన్ని చేపట్టామని, రాష్ట్రవ్యాప్తంగా 19 లక్షల ఇళ్ళ నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో పట్టణ ప్రాంతాల్లో 6 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 13 లక్షల ఇళ్ళు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకోసం నిర్మించిన రాజీవ్ స్వగృహ లాంటి నాసిరకం ఇళ్ళు నిర్మించడంతో ప్రస్తుతం అనేకమంది పేదలు ఆ ఇళ్ళలో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు భిన్నంగా పేదవాడి స్వప్నానికి దగ్గరగా తమ ఇళ్ళ నిర్మాణం ఉంటుందన్నారు. జన్మభూమి స్ఫూర్తితో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేపడుతున్నామన్నారు. పట్టణ ప్రాంతాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. అందుకోసం జన్మభూమి కార్యక్రమాన్ని ఒక వేదికగా చేస్తున్నామన్నారు. గ్రామీణ



ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు రెండు టీములను కూడా ఏర్పాటుచేశామన్నారు. 9 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో 9 విభాగాలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని

పోలవరంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతను పూర్తిస్థాయిలో అధిగమించేందు కు కొన్ని ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే నదుల అనుసంధానానికి పెద్దఎత్తున ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో చెరువుల అనుసంధానాన్ని కూడా చేపట్టడంతో పాటు గోదావరి, పెన్నా నది అనుసంధానం పనులను ఇప్పటికే ప్రారంభించామన్నారు. అలాగే వంశధార-నాగావళి, గోదావరి-కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తానన్నారు. వాటితో పాటు వర్షపు నీటిని వృధా కానీకుండా గ్రామీణ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, ఫాం పాండ్స్ నిర్మిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రరైతాంగానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టుపై కూడా ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకుందన్నారు.

పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పడినప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సదుపాయాలకు యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో భవనాన్ని కట్టించేందుకు నిధులను కూడా కేటాయించడం జరిగిందన్నారు. ప్రత్యేకించి మహిళా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోను అంగన్‌వాడికి స్వంత భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4,132 భవనాలు నిర్మించామన్నారు. అలాగే కాన్వెంట్ విద్యకు ధీటుగా అంగన్‌వాడి కేంద్రాల్లో ఆంగ్లబోధన అందిస్తున్నామన్నారు. అలాగే 594 స్త్రీశక్తి భవనాలను నిర్మించి మహిళలకు ఓ కొత్త వేదికను ఏర్పాటు చేశామన్నారు. దీంతో గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం శక్తితో ముందుకు సాగుతూ ప్రభుత్వానికి ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను ఆయన కొనియాడారు.

ఫిబ్రవరిలో మూడో విడత పారిశ్రామిక సదస్సు

రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలతో రెండు విడతలుగా ప్రత్యేక సదస్సును నిర్వహించామన్నారు. అదే తరహాలో ఫిబ్రవరి మొదటివారంలో మూడో విడత పారిశ్రామిక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు 973 మంది పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆ పరిశ్రమలు ఏర్పాటైతే రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గతంలో ఏర్పాటుచేసిన సదస్సుల వల్ల 11 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. విశాఖ, చెన్నై కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తద్వారా మరికొన్ని పరిశ్రమలు కూడా వచ్చే అవకాశముందన్నారు. 2029 నాటికి ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నెం.1 రాష్ట్రంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, పాశం సునీల్ కుమార్, పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణ రెడ్డి, బీద రవిచంద్ర, మాజీ మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి, పరసారత్నం, తాళ్లపాక రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయడెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సుభిక్ష రాష్ట్రం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ సుభిక్ష సుందర రాష్ట్రం అని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి డాక్టర్. మహేష్ శర్మ అన్నారు. కొత్త రాష్ట్రం అయినప్పటికీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తుందని హర్షం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రచార పోస్టర్లు, స్టిక్కర్లను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రి జోగు రామన్న కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానాలకు మహేష్ శర్మ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం గొప్ప పథకాలను రూపొందించి అమలు జరుపుతుందన్నారు. కెసిఆర్ విజన్ ఉన్న నాయకుడు అయినందుననే తెలంగాణ త్వరిత గతిన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న వినూతన నిర్ణయాలు తెలంగాణకు ఆయువు పట్టువంటివన్నారు. చారిత్రక ఘట్టాలకు తెలంగాణ నిలుపుటద్దం అని కేంద్ర మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రధానిమోదీకి ప్రత్యేక అభిమానం అని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని వివరించారు. హరితహారం తెలంగాణ మెడలో మణిహారం అని పేర్కొన్నారు. పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మంత్రి జోగు రామన్న వివరించారు.

ఇంటర్‌లో గ్రేడింగ్ లేనట్లే

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ ఇచ్చిన నివేదికను విద్యా శాఖ పక్కన పెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇంటర్‌లో ఈ ఏడాది నుంచే గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని ఇంటర్‌బోర్డు అధికారులు, కమిటీ ప్రతిపాదించింది. అయితే ఈ ఏడాది మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు గ్రేడింగ్ ఇవ్వాలని, వచ్చే ఏడాది వీరే ద్వితీయ సంవత్సరంలోకి వస్తారు కాబట్టి అప్పుడు కూడా గ్రేడింగ్‌ను ఇచ్చి ఇంటర్ మెమోలో గ్రేడింగ్‌ను అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. అయితే గ్రేడింగ్ విధానం అమలు చేస్తే కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఇంటర్‌లో గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తే ఎటువంటి సమస్యలు వస్తాయి, వాటిని ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలను తెలుసుకోవడం కోసం సర్కార్ మరో కమిటీని నియమించనున్నట్టు ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌లో గ్రేడింగ్ విధానం అమలు ప్రస్తుతానికి లేదని స్పష్టం అవుతోంది. అయితే భవిష్యత్‌లో ఉంటుందా? లేదా? అనే అంశాలపై త్వరలో ప్రభుత్వం నియమించబోయే కమిటీ ఇచ్చే నివేదికను బట్టి ఉంటుంది.

కేరళ, పశ్చిమబెంగాల్‌లో గ్రేడింగ్, మార్కులు ఇస్తున్నారు

దేశంలోని కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతోపాటు సీబీఎస్ఈలో మాత్రమే ఇంటర్మీడియట్ స్థాయిలో మార్కులను ఇస్తూ, గ్రేడింగ్‌ను కూడా అమలు చేస్తున్నారు. దేశంలోని రెండు రాష్ట్రాల్లో తప్ప మిగిలిన ఏ రాష్ట్రంలోనూ ఇంటర్ స్థాయిలో గ్రేడింగ్‌ను ఇవ్వడం లేదు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇంటర్మీడియ్ విద్యార్థులకు మార్కులనే ఇస్తున్నారు. పైగా జాతీయ స్థాయిలో ప్లస్ 2కి గ్రేడింగ్‌ను అమలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయడంపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది.



గ్రేడింగ్‌తో వచ్చే సమస్యలు...

జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో ఐఐటీ, జేఈఈకి అర్హత సాధించాలంటే ఇంటర్‌లో 75 శాతం మార్కులు వచ్చి ఉండాలి. ఇంటర్‌లో గ్రేడింగ్ అమలు చేస్తే బి1 గ్రేడ్‌ను 71 నుంచి 80 మార్కులు వచ్చిన విద్యార్థులకు ఇస్తారు. గ్రేడింగ్‌లో 75 మార్కుల కంటే తక్కువ అనేది లేదు. అప్పుడు బి1 గ్రేడ్ వచ్చిన వారిలో అందరూ జేఈఈ పరీక్షకు అర్హులు కారు. ఇదో సమస్యగా మారనుంది. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఎంసెట్‌కు ఇంటర్ మార్కులపై 25 శాతం వెయిటేజీ ఇస్తున్నారు. దీనిని ఎలా అమలు చేయాలనేది సమస్యగా మారనుంది. ఒక్క మార్కు మారిన వారికి ర్యాంకుల్లో సుమారు 250 వరకు తేడా వచ్చే అవకాశం ఉంటుంది. ఇటు వంటి సందర్భాల్లో విద్యార్థులకు అన్యాయం జరిగితే కోర్టుల ను ఆశ్రయించే ప్రమాదం ఉంటుంది. రాష్ట్రంలో గత రెండేళ్లు గా డిగ్రీ అడ్మిషన్లను దోస్తు ద్వారా ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. వీటిలో మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులకు సీట్లను కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఇంటర్మీడియట్‌లో మార్కులు ఇవ్వకుండా కేవలం గ్రేడింగ్ ఇస్తే డిగ్రీ అడ్మిషన్లలోనూ సమస్యలు తలెత్తనున్నాయి. ఈ నేప థ్యంలోనే ఇంటర్‌లో గ్రేడింగ్ ఇవ్వాలనే కమిటీ నివేదికను విద్యా శాఖ పక్కన పెట్టిన తెలుస్తోంది.

గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయడం కోసం ఏపి సర్కార్ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. తెలంగాణ సర్కార్ ఎలా అమలు చేస్తుందో చూసి తరు వాత వారు కూడా అమలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇంటర్‌లో గ్రేడింగ్ ఇవ్వకుండా మార్కులు ఇస్తే మార్కుల మూలంగా కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యా ర్థులు తీవ్ర మానసిక ఒత్తిడి గురవుతున్నారని, కొందరు ఆత్మ హత్యలకు సైతం పాల్పడుతున్నారని అందుకే మార్కులు కాకుండా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని ఇంటర్ బోర్డు అధికారులు, కమిటీ కూడా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

'అజ్ఞాతవాసి' విడుదలకు రండి

మంత్రి తలసానిని ఆహ్వానించిన చిత్ర బృందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈనెల 10న విడుదల కానున్న 'అజ్ఞాతవాసి' సినిమా కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణలు తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌ను కోరారు. ఇందుకు సంబంధించి శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ రామ్మోహన్‌రావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ, దర్శకుడు త్రివిక్రమ్ ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి అని అన్నారు. అజ్ఞాతవాసి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఎంతో ఎదురు చూస్తున్నారని తెలిపారు.

24 గంటల విద్యుత్ సమష్టి కృషితోనే సాధించాం: సీఎండీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాను సమిష్టి కృషితోనే సాధించామని ట్రాన్స్‌కో, జన్కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావు అన్నారు. శనివారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోషియేషన్ 2018 డైరీని సీఎండీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎండీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలపై ముఖ్యమంత్రికేసీఆర్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని ఇందులో ప్రతి ఉద్యగి కృషి ఉందన్నారు. సీఎం తమకు ఇచ్చిన స్వేచ్ఛవల్లనే వేగంగా నిర్ణయాలు తీసుకోగలిగామన్నారు. విద్యుత్ వినియోగదారుల సంతృప్తే మన లక్ష్యం కావాలన్నారు. సమస్యలపై వచ్చే ప్రతిటెలిఫోన్ కాల్‌కు సమాధానం ఇవ్వాలన్నారు. ఇదే విధంగా కృషి చేసి విద్యుత్ సంస్థలను మరింత ముందుకు తీసుకుపోదామని సీఎండీ ప్రభాకర్ రావు పేర్కొన్నారు. అషోషియేసన్ ఛైర్మన్ పి.రత్నాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండి జి.రఘుమారెడ్డి, ఎన్పీడీఎసీఎల్ సీఎండి గోపాల్ రావు అసోషియేషన్ వాల్ క్యాలెండర్ , టేబుల్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసోషియేషన్ కార్యదర్శి కె.కిరణ్ కుమార్, అదనపు కార్యదర్శి సదానందంతోపాటు పలువురు సీఈలు , ఎస్ఇలు డీఇలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీసీసీ నేతల కొనసాగింపు

కాంగ్రెస్ అధినేత రాహుల్ నిర్ణయం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులను యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిర్ణయించారు. వీరితో పాటు రీజినల్, టెరిటోరియల్ అధ్యక్షు లను కూడా కొనసాగించనున్నారు. సంస్థా గత ఎన్నికల పూర్తయినప్పటికీ ఇంకా అధ్యక్షుల మార్పుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కొత్త అధ్యక్షులను నియమించేంతవరకు పాత వారే అధ్యక్ష పదవుల్లో కొనసాగుతారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ ద్వివేదీ ఓ ప్రకటనలో వెల్లడించారు. నిజానికి రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అన్ని రాష్ట్రాలకు నూతన అధ్యక్షులను నియమించాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుల ఎంపికపై కసరత్తు ఇంకా పూర్తి కాలేదు. ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల ఆధారంగా సమర్థత కలిగిన యువ నాయకులను ఎంపిక చేయాలని రాహుల్ ఆలోచిస్తున్నారు. ఈ దిశగా రాహుల్ కార్యాలయం ఇప్పటికే పలువురు నాయకులను ఢిల్లీకి పిలిపించి వారితో రాహుల్‌గాంధీ నేరుగా మాట్లాడుతున్నారు. ఈ కసరత్తు పూర్తయ్యేందుకు మరికొంత సమయం పట్టనుండడంతో కొత్తవారిని నియమించే వరకు పాత కమిటీలనే కొనసాగిం చాలని నిర్ణయించారు. దాంతో తెలంగాణలో ఉత్తమ్, ఏపీలో రఘువీరారెడ్డి యథావిధిగా తమ పదవుల్లో కొనసాగనున్నారు.

ఉత్తమ్‌కే పార్టీ పగ్గాలు

- టీపీసీసీ చీఫ్‌గా కొనసాగిస్తూ రాహుల్ నిర్ణయం
- ఆదేశాలు జారీ చేసిన జనార్దన్ ద్వివేది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీ పీసీసీ చీఫ్ పదవికి మార్పు ఉంటుందని భావించిన కాంగ్రెస్ నేతలకు ఊహించని షాకే తగిలింది. టీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మార్చి.. కొత్తవారికి అవకాశం ఇస్తారని గత కొన్ని రోజులుగా కాంగ్రెస్‌లో ప్రచారం జరుగుతోంది. దీంతో ఉత్తమ్ వర్గీయుల్లోనూ ఆందోళన మొదలైంది. కాగా శనివారం ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం విడుదల చేసిన జాబితాలో టీ పీసీసీ చీఫ్‌గా ఉత్తమే కొనసాగుతారని వెల్లడించారు. ఉత్తమ్‌తో పాటు అన్ని దేశ వ్యాప్తంగా ఉన్న పీసీసీల్లో మార్పు ఉండదని కూడా ఆ పార్టీ సీనియర్ నేత జనార్దన్‌ద్వివేది ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలోని ఉత్తమ్ వ్యతిరేక వర్గీయులకు మింగుడు పడని అంశంగా మారిందని చెప్పుకోవచ్చు. టీపీసీసీ పదవి కోసం చాల మంది సీనియర్లు తమ వంతుగా ప్రయత్నాలు మొదలు పెట్టారని పార్టీలో చర్చ జరిగిన విషయం తెలిసిందే. టీ పీసీసీ రేసుల్ ప్రధానంగా సీఎల్పీ నేత జానారెడ్డి, మాజీ మంత్రులు డీకే అరుణ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపించాయి. టీ పీసీసీగా అవకాశం ఇస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటామని, అధికార టీఆర్ఎస్ పార్టీకి ధీటుగా ఎన్నికల ఖర్చును కూడా భరిస్తామని హై కమాండ్ వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కాగా రాహుల్‌గాంధీ మాత్రం ఉత్తమ్‌వైపే మొగ్గు చూపి టీ పీసీసీగా కొనసాగడానికి నిర్ణయం తీసుకున్నారని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

ఇక టీ పీసీసీ కార్యవర్గంతో పాటు ఏఐసీసీలోనూ భారీగానే మార్పులు ఉండే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉండేవారికి పార్టీ పదవులు ఇవ్వాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తుంది. అటు ఏఐసీసీలోనూ రాష్ట్రం నుంచి నలుగురైదురికి అవకాశం ఉండొచ్చని ఇటీవల జరిగిన మీడియా చర్చాగోష్టిలో ఉత్తమ్ వెల్లడించారు. కాగా పార్టీ కార్యక్రమాలను ఉత్తమ్ మరింత స్పీడ్ పెంచుతారని ఆయన వర్గీయులు అభిప్రాయపడు తున్నారు.

గాంధీభవన్‌లో సంబురాలు..

టీ పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కొనసాగిస్తున్నట్లు ఏఐసీసీ ప్రకటించడంతో ఉత్తమ్ వర్గీయులు గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీటు పంచుకున్నారు. ఈ సంబురాల్లో మాజీ ఎంపీలు మల్లు రవి, అంజన్‌కుమార్‌యాదవ్‌తో పాటు మరికొంత మంది నేతలు ఉన్నారు.

క్రమశిక్షణకు పట్టం : గుడూరు నారాయణరెడ్డి

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ పని చేసే నాయకులకే పదవులు అప్పగిస్తారని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. టీ పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌ను కొనసాగిస్తూ రాహుల్‌గాంధీ తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో తామందరం కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

ఎన్నికల నాటికి ఇంటింటికీ తాగునీరు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : మిషన్ భగీరత దేశానికే ఆదర్శమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం సాయంత్రం ఎల్ఎండీ వద్ద రా వాటర్ ప్లాంటు నిర్మాణం పనులను, ఇన్‌టెక్ వాటర్ ట్యాంకును రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, తెలంగాణ నీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ వేమూరి ప్రశాంత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సభర్వాల్‌లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి తాగునీరు అందేలా భగీరత పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనులు నడిపించాలని సూచించారు. అలసత్వం వహించకుండా పనులను వేగవతంగా అనుకున్న సమయానికి పూర్తయ్యేలా అడుగులు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న భగీరథ పనులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సీఎం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రాజెక్టు మిషన్ భగీరథ అని, ప్రాజెక్టు పనులను అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు నడిపించాలని కోరారు. జనవరి 30 లోగా లక్ష్యాన్ని పూర్తిచేసి నీటి సరఫరాకు మార్గం సుగమం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే తెలంగాణ సంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంథని, కోరుట్ల ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, దాసరి మనోహర్ రెడ్డి, సోమరాపు సత్యనారాయణ, పుట్ట మధు, కే.విద్యాసాగర్‌రావు, భగీరత సీఈ జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఈ అమరేంద్ర, ఈఈ శ్రీనివాస్, కరీంనగర్ ఇన్‌చార్జి కలెక్టర్ శరత్, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, ట్రేనీ కలెక్టర్ ప్రావిణ్యలతోపాటు ఆయా జిల్లాల మిషన్ భగీరత, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.






బ్రాహ్మణుల సంక్షేమానికి తెదేపా కృషి

సంఘం అధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బ్రాహ్మణుల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, సీఎం చంద్రబాబునాయుడు మరే రాష్ట్రంలోనూ లేని విధంగా తొలిసారిగా దేశంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అనేక సహాయ కార్యక్రమాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ అధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, ఉపాధి, నైపుణ్య అభివృద్ధి కోసం వృద్ధులు, వికలాంగులకు వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు ఫెన్షన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు నెలకొల్పిన ఈ సంస్థ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి ఆయా రాష్ట్రాలలో ఇటువంటి సంస్థల ఏర్పాటుకు స్ఫూర్తిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. సభలో ఉమ్మడి రాష్ట్రమాజీ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ అధ్యక్షులు కోట శంకరశర్మ, శాసనసభ్యులు భన్వర్‌లాల్‌శర్మ, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డి మున్నాభాయ్ ఆర్ఎంపీనే..

డాక్టరేట్ పట్టా నకిలీదే: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డిపై కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరోసారి విరుచుకు పడ్డారు. లక్ష్మారెడ్డి డాక్టరేట్ పట్టా నకిలీదేనని, ఆయన ముమ్మాటికి మున్నాబాయ్ ఆర్ఎంపీ డాక్టరేనని ఆయన దుయ్య బట్టారు. అయితే మంత్రి లక్ష్మారెడ్డి డాక్టరేట్ పట్టాను ఏ యూనివర్సిటి నుంచి పొందారో చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గాంధీ భవన్ లో కాంగ్రెస్ నేత మల్లు రవి, పటోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ రవీంద్రా నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 2004, 2014 ఎన్నికల్లోనూ వేర్వేరు అఫిడవిట్లు ఎన్ని కల కమిషన్‌కు దాఖలు చేశారని ఆయన వివరించారు. ఎన్నికల కమిషన్‌ను తప్పు దోవ పట్టించిన మంత్రి లక్ష్మారెడ్డి శిక్షార్హుడే అవుతారని ఆయన పేర్కొన్నారు. తాను చేసే విమర్శల్లో తప్పుని తేలితే ఏ శిక్షకైనా సిద్ధమేనని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. కేటీఆర్ ఒత్తిడితోనే రేవంత్‌రెడ్డిని తిట్టాన ని మంత్రి లక్ష్మారెడ్డి ఒక మధ్య వర్తిని తనవద్దకు పంపాడని, ఇక ముందు ఎవరూ తిట్టు కోవద్దని ఆ మధ్యవర్తి వివరించడంతో తాను కూడా సైలెంట్ అయినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

గవర్నర్‌పై వీహెచ్ ఆగ్రహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గవర్నర్ నరసింహన్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు విమర్శలు చేశారు. తన రాజకీయ జీవితంతో ఇలాంటి గవర్నర్‌ను ఎప్పుడు చూడలేదని ఆయన ఆరోపించారు. గవర్నర్‌గా పనికిరాడని, ఏదైనా గుడికి పర్మినెంట్ పూజారిగా పెడితే సరిపోతుందని వీహెచ్ ఎద్దేవా చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి సూచనలు చేయకుండా గుళ్లు, గోపురాలు తిరగడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. ఈ గవర్నర్ ముఖ్య మంత్రులకు అమ్ముడుపోయారని ఆయన విమర్శించారు.

పోరాడితేనే విజయం

- సమస్యలకు తలొగ్గి వెనకడుగు వేస్తే ఓటమే..
- ఎదురించి ముందడగు వేస్తేనే జీవితాన్ని జయించగలరు: ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి


మహబూబాబాద్, ప్రభ న్యూస్ : సమస్యలకు తలొగ్గి వెనుకడుగు వేస్తే జీవితంలో ఏం సాధించలేరని, వాటిని ఎదురొడ్డి ముందుకు సాగితేనే జీవితాన్ని జయించగలుగుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక యశోధ గార్డెన్‌లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిరుద్యోగ విద్యార్థులకు పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరిక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం శనివారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు దిశా నిర్దేశం చేసుకుని కష్టపడి చదివితేనే జీవితాన్ని జయించగలుగుతారని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతన జిల్లాలు ఏర్పాటు చేసిన దానిలో మానుకోట జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక జిల్లా ఎస్పీగా వచ్చిన నంద్యాల కోటిరెడ్డి గతంలో ఉపాధ్యాయునిగా ఉన్నారని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని సివిల్స్‌లో రాణించి జిల్లా ఎస్పీగా వచ్చి జిల్లాలోని ప్రజలను చైతన్యం వంతం చేసి, శాంతి భద్రతలను, అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేశారని ప్రశంసించారు. ఉన్నత విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న విద్యార్థులు పెడదారిని పట్టకుండా వారికి పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ ఇప్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని కొనియాడారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజదాని హైదరాబాద్‌లోని దూల్‌పేట ప్రాంతంలోని ప్రజలు దోపిడీలకు, దొంగతనాలకు మారుపేరుగా ఉండేదని, అలాంటి ప్రాంతాల్లో ప్రస్తుత రాష్ట డీజీపీ మహేందర్ రెడ్డి, భాగ్యకిరణ్ కోచింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా శిక్షణను ఇప్పించి ఆ ప్రాంతంలోని విద్యార్థులను ప్రయోజకులను చేశారని, ఇప్పుడు ఆ ప్రాంతంలో సుమారు 200 మంది వరకు ఉద్యోగ స్తులుగా రాణించారని పేర్కొన్నారు. అదే విధంగా మానుకోట జిల్లా ప్రాంతంలో గాయత్రి గ్రానైట్ అదినేత రవిచంద్ర సహకారాంతో భాగ్యకిరణ్ ఉచిత పోలీస్ శిక్షణ వారి సహకారంతో జిల్లాలోని డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఈ ప్రాంతంలోని విద్యార్థినీ విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు.



ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

తెదేపా తెలంగాణ రాష్ట్రస్థాయి సమావేశంలో రమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పల్లెపల్లెకు, బస్తీబస్తీకి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టి రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్. రమణ నేతలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో పల్లెపల్లెకు, మునిసిపాలిటీల్లో బస్తీబస్తీకి కార్యక్రమం ద్వారా ప్రజలను కలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం సన్నాహకంలో భాగంగా శనివారం పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ఎన్‌టిఆర్ వర్ధంతి రోజు ఈనెల 18 నుంచి పార్టీ ఆవిర్భావ దినోత్స వమైన మార్చి 29వరకు 70 రోజులపాటు ఈ కార్య క్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీచేసే విధంగా పార్టీ యంత్రాంగాన్ని తయారు చేసుకుందామని ఆయన చెప్పారు. పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమం ద్వారా గతంలో తెదేపా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను వివరిస్తూ తెరాస ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తెలంగాణ పార్టీ శాఖకు సహ కారం అందిస్తామని చెప్పారని, ఆయన ఇచ్చిన మరోధైర్యంతో మరింత ముందుకు పోదామని రమణ అన్నారు.



బడుగుల కోసమే తెదేపా ఆవిర్భావం : మోత్కుపల్లి


పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల సంక్షేమం కోసమే తెదేపా ఆవిర్భ వించిందని అన్నారు. ఎన్‌టిఆర్‌తోనే సబ్సిడీ బియ్యం, జనతా వస్త్రాలు, పక్కాఇళ్ళు పథకాలు పేదవాడికి అందాయని ఆయన గుర్తుచేశారు.

వచ్చే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలకం : గరికపాటి

జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడు గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలకం కానున్నాయని అన్నారు. జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడు సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ, ప్రభుత్వానికి తోడుగా గవర్నర్ కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని, ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయన పని చేస్తున్నారని దుయ్యబట్టారు. జాతీయ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సమన్వయ కర్తలను నియమించామని, నాయకుల పనితీరుపై సమాచారం సేకరించి వారిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తామని చెప్పారు.

రైతు సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

మంత్రులు పోచారం, జగదీష్‌రెడ్డి



చిట్యాల, ప్రభ న్యూస్: అన్నం పెట్టే రైతన్న సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా, చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో శనివారం సాయంత్రం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన రైతులతో మంత్రులు ముచ్చటించి సూచనలు, సలహాలను అందజేశారు. రైతులకు ఇస్తున్న 24గంటల విద్యుత్ వల్ల రైతులు సంతోషంగా ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ కానుకగా అందజేస్తున్న ఎకరాకు రూ.4వేలు అందజేస్తున్న లబ్ధిని ఏ విధంగా పొందాలో రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ రైతన్నలు ఎన్నో ఏళ్లుగా అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఏ ప్రభుత్వాలు కూడా పట్టించుకోలేదన్నారు. రైతన్నల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేయాలనే ఆలోచనతోనే ఎకరాకు రూ.4వేలు అందించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ఎకరాకు ఓ పంటకు రూ.4వేలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని, కేవలం మన రాష్ట్రంలోనే అమలు కానుందన్నారు. ఇదొక చారిత్రాత్మక నిర్ణయంగా పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న డబ్బులు నేరుగా రైతుల జేబులోకి వెళ్లాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని చెప్పారు. సీఎం సూచనల మేరకు తాము పర్యటిస్తున్నామన్నారు. తెలంగాణ వచ్చిన ఆరు మాసాలలోనే విద్యుత్ కష్టాల నుంచి విముక్తి కలిగిందన్నారు. వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ ఇవ్వడం దేశంలోనే మనది ప్రథమ రాష్ట్రమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసి కోటి ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ పలు సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, నల్లగొండ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంపీపీ బట్టు అరుణ అయిలేష్, జడ్పీటీసీ శేపూరి రవీందర్, ఎంపీటీసీ లక్ష్మమ్మ, కాటం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.







ఒకే చోట రజనీ, కమల్

- చిరునవ్వులతో కరచాలనం
- వేదిక కౌలాలంపూర్
- సినీతారల వేడుకలో సందడి
- తమిళ రాజకీయాల్లో అలజడి

కౌలాలంపూర్: ఒకరు గత కొద్ది కాలంగా సామాజిక మాధ్యమాలపై రాజకీయ దుమారం రేపుతుంటే మరొకరు ఆధ్యాత్మిక రాజకీయాలకు నాంది పలుకుతున్నట్టుగా గతేడాది చివరి రోజున రాజకీయ ఆరంగేట్రం ప్రకటించారు. వారే అంతర్జాతీయంగా పేరు గడించిన తమిళ సినీనటులు కమల్ హాసన్, రజనీకాంత్. ఇద్దరూ ఒకే వేదికను పంచుకున్న అరుదైన ఘట్టం శనివారం కౌలాలంపూర్‌లో ఆవిష్కృతమైంది. అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. ఇది తమిళనాట రాజకీయాల్లో కొత్త సమీకరణకు నాంది పలుకుతుందా అన్న సందేహాలను లేవనెత్తింది. నచ్చతిర విళా 2018 పేరిట సినీతారల వేడుక స్థానికంగా ఒక స్టేడియంలో మొదలైంది. ఆ కార్యక్రమానికి రజనీకాంత్, కమల్ హాసన్ ఒకే హెలికాప్టర్‌లో స్టేడియానికి చేరుకున్నారు. కిందకు దిగిన తర్వాత ఒక గోల్ఫ్ కార్ట్‌లో కొద్ది దూరం ప్రయాణించారు. అభిమానుల ఆనందోత్సహాలు, ఘన స్వాగతం నడుమ ఇరువురు వేదికపై నవ్వుతూ కరచాలనం చేసుకున్నారు. గత నెల 31న రాజకీయాల్లోకి వస్తున్నట్టు అభిమానుల సమక్షంలో రజనీకాంత్ ప్రకటించగా, కమల్ హాసన్ సైతం అతి త్వరలో రజనీ బాట పట్టవచ్చనే వార్తలు తమిళనాట వినిపిస్తున్నాయి. ఈ మేరకు కమల్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. కౌలాలంపూర్‌లో రెండు రోజులపాటు జరిగే నచ్చతిర విళా 2018 వేడుకను మాలిక్ స్ట్రీమ్స్ కార్ప్, మైఈవెంట్స్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో సౌత్ ఇండియా ఆర్టిస్టుల అసోసియేషన్ నిర్వహిస్తున్నది. వేడుకల్లో సినీనటులు, గాయకుల ప్రదర్శనలకు తోడు భారత్-మలేసియా సినీ కళాకారుల మధ్య క్రికెట్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. తమిళ సినీ పరిశ్రమకు చెందిన 200కు పైగా కళాకారులు, సంగీత దర్శకులు ఈ మెగా వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించే నిధులను నడిగర సంఘం కొత్త భవనం నిర్మాణానికి వెచ్చిస్తారు.



మలేసియా ప్రధానితో రజనీ భేటీ

సినీ నటుడు రజనీకాంత్ మలేసియా ప్రధానమంత్రి మొహ మ్మద్ నజీబ్ రజాక్‌తో భేటీ అయ్యా రు. ఈ సందర్భంగా ఇరువురు చిరునవ్వులతో ఆలింగనం చేసుకున్నారు. రజనీకాంత్‌తో భేటీ అనిర్వచనీయమైందిగా మలేసియా ప్రధాని ట్వీట్ చేశారు.

పెట్టుబడిపై పీపుల్ పల్స్..!

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాతో బోరుబావుల కింద గరిష్ఠ విస్తీర్ణంలో పంటలు సాగుచేసే అవకాశం ఉన్నందున సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు పెట్టుబడి రాయితీని అందించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విజయవంతం చేసి ప్రతిష్ఠను నిలబెట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రి సూచనల మేరకు మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెట్టుబడి మద్దతు పథకం అమలు ఏప్రిల్ నెలాఖరు నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలోగా అన్ని జిల్లాలు పర్యటించి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వెల్లడించనున్నారు. ఈ పథకంలో అర్హులైన ప్రతి రైతు కుటుంబం ఏ విధంగా లబ్ధి పొందవచ్చునన్న విషయాన్ని కూడా వెల్లడిస్తారు. అదే సమయంలో 24 గంటల ఉచిత విద్యుత్ ద్వారా పొందుతున్న ప్రయోజనాలను, ఈ నిర్ణయంపై మెజారిటీ రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటారు.

విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల రెండవ వారంలో ప్రారంభం కానున్న మంత్రివర్గ ఉపసంఘం జిల్లా పర్యటనలు దాదాపు నెల రోజులపాటు కొనసాగనున్నాయి. అనంతరం క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు, అన్నదాతల అభిప్రాయాలను క్రోడీకరించి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పిస్తారు. ఆలోపే రెండు, మూడు పర్యాయాలు పెట్టుబడి మద్దతు పథకంపై సీఎం అధ్యక్షతన సమావేశాలు నిర్వహించేందుకు సమాలోచనలు జరుపుతున్నారు. మే 15 నాటికి చిన్నా, పెద్దా తేడా లేకుండా రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి రాయితీ మొత్తాన్ని అందించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఉన్నతాధికారులు. మొత్తం 71.75 లక్షల రైతు కుటుంబాలు ఈ పథకానికి అర్హత ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలింది. అదే సమయంలో రెవెన్యూ శాఖ అధికార యంత్రాంగం నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ద్వారా రైతు కుటుంబాల సంఖ్యను ధృవీకరించింది. ప్రస్తుతం 1.42 కోట్ల ఎకరాలు సాగు యోగ్యమైన భూమికి ఈ పథకం వర్తిస్తుంది. ఎకరాకు రూ.4వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.8వేలు అందించేందుకు ఆర్థికశాఖ గణాంకాల ప్రకారం రూ.5,700 కోట్ల నిధులు అవసరమవుతాయి. 2018-19 ఖరీఫ్ సీజన్‌లో సాగవుతాయని నిర్ధారించిన భూ విస్తీర్ణానికి సంబంధించి ఈ మొత్తాన్ని సూచనప్రాయంగా ఖరారు చేశారు. ఈ వ్యవసాయ సంవత్సరంలో పెట్టుబడి రాయితీ పథకం మంచి ప్రయోజనాలను అందిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. రాయితీ మొత్తంతో పంటల విస్తీర్ణం పెరిగితే వచ్చే వ్యవసాయ సంవత్సరంలో మరో రూ.1000 కోట్లు అదనపు నిధులు అవసరమవుతాయని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నిరంతర ఉచిత విద్యుత్‌పై పొరుగు రాష్ట్రాల దృష్టి

వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరాచేసి రైతు కుటుంబాల ఆర్థిక పరిపుష్టికి కృషిచేస్తున్న తెలంగాణ రాష్ట్రంపట్ల పొరుగు రాష్ట్రాలు దృష్టి కేంద్రీకరించాయి. వ్యవసాయ రంగానికి ఇక్కడ ఎనలేని సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నందున ఈ రంగాన్ని ప్రధానంగా ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలు ఇక్కడి పథకాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించాయి.

ఇప్పటికే నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న మొదటి రాష్ట్రంగా రికార్డు సొంతం చేసుకున్న తెలంగాణ త్వరలోనే అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువనుంది. సంక్షేమ పథకాల్లో మొన్నటి వరకు అగ్రస్థానంలో ఉన్న తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలవుతున్న పథకాలపైవ దృష్టి పెట్టడం రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచుతోంది. ఈ కోణంలో చూసినా నిరంతర విద్యుత్ వ్యవసాయ రంగం అభివృద్ధికే కాకుండా అనుబంధంగా ఉన్న 16 రంగాల పురోగతికి ఎంతగానో దోహద పడుతుందని నిపుణులు, శాస్త్రవేత్తలు స్పష్టంచేస్తున్నారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి మార్గాలు మెరుగు పడనున్నాయి.

రేపటి నుంచి అఖిల భారత విప్స్ కాన్ఫరెన్స్

జైపూర్: జనవరి 8నుంచి 18వ అఖిల భారత విప్‌ల సమావేశాలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగనున్నాయి. ఈ సమావేశాలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఆయా రాష్ట్ర శాసనసభల్లో, పార్లమెంటులో పేపర్ రహిత పనితీరు, డిజిటల్ విధానంపై చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన విప్‌లు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో పార్లమెంటు, శాసనసభల్లో అత్యంత ప్రభావిత పనితీరుపై విప్‌లు పలు సూచనలు చేయనున్నారు. ఈ విప్‌ల సదస్సులో అజెండా ప్రకారం ఈ-విధానంపై చర్చించనున్నారు. విప్‌లు ఆయా రాజకీయపార్టీ సభ్యులుగా ఉంటూనే పార్టీలో క్రమశిక్షణకు కృషి చేస్తారు.



ముంబై: ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర, భారీగా తరలివచ్చిన భక్తులు

ఆ నాలుగు జిల్లాలకు గుర్తింపేదీ...?

- చిన్న లోపంతో అనేక సమస్యలు
- స్టాఫ్ ప్యాటర్న్స్ మొదలు.. వ్యవస్థల దాకా చిక్కులే
- ఆర్థికశాఖ ఆమోదం లేక విలవిల
- అధికారిక గుర్తింపు కోసం అల్లాడుతున్న ఆ నాలుగు కొత్త జిల్లాలు
- నిర్మల్, పెద్దపల్లి, సిరిసిల్ల, గద్వాలకు అధికారిక హోదా దక్కలేదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో స్థానిక పాలన మరింత చేరువై ఇప్పుడిప్పుడే వాటి ఫలాలు ప్రజలకు దక్కుతున్నాయి. ఇతర రాష్ట్రాలు కూడా తమ జిల్లాల పునర్వ్యవస్థీకరణలో తెలంగాణను స్ఫూర్తిగా తీసుకుంటున్నాయి. ఈ తరుణంలో అనుకోని అవాంతరంలా చిన్న లోపం...ఇంకా సవరించని తప్పు...ఆ నాలుగు జిల్లాలకు శాపంగా మారింది. 2016 అక్టోబర్ 10న 10 జిల్లాల తెలంగాణ 27 జిల్లాలుగా విస్తరిస్తూ అధికారిక తుది నోటిఫికేషన్ జారీ అయింది. అదే రోజు ఆయా అన్ని జిల్లాల్లో రెవెన్యూ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతించింది. అయితే మర్నాడే మరో నాలుగు జిల్లాలను పెంచుతూ ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది జరిగి ఏడాదిన్నర కావొస్తున్నది. ఇక్కడే జరిగిన పొరపాటు కొత్తగా ఏర్పడ్డ నాలుగు జిల్లాలకు కొంత ప్రతిష్ఠంభనకు కారణమైంది. ఆర్థిక శాఖ ఆమోదం దక్కని ఆ నాలుగు జిల్లాలు ఇంకా ప్రభుత్వపరంగా అధికారికంగా గుర్తింపు దక్కించుకోలేదు. 31 జిల్లాల తెలంగాణ రాష్ట్రం పరిపాలనలో దూసుకు పోతున్నా...నిర్మల్, పెద్దపల్లి, సిరిసిల్ల, గద్వాల జిల్లాలకు అధికారిక హోదా దక్కలేదని స్టాఫ్ ప్యాటర్న్ చూస్తే స్పష్టమవుతోంది. తద్వారా ఈ నాలుగు జిల్లాల్లో నిధుల విడుదలకు, సిబ్బంది సర్దుబాట్లకు అనేక సమస్యలు వస్తున్నాయి. దీనికి సంబంధించిన దస్త్రంపై ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేయకపోవడంతో ప్రతిష్ఠంభన నెలకొంటోంది. 318మందితో కూడిన జిల్లా స్టాఫ్ ప్యాటర్న్‌కు నిధుల సమస్యలు పేరుపోతు న్నాయి. జిల్లా పోస్టుల్లో ప్రధానమైన ప్యాటర్న్ ఇలా ఉండాలని కొత్తగా కలెక్టర్ల స్వరూపంలో ప్రభుత్వం పనికిర్ణయించింది. దీని మేరకు డిప్యూటీ కలెక్టర్లు 2, తహశీల్దార్లు 26, సీనియర్ అసిస్టెంట్లు 152, జూనియర్ అసిస్టెంట్లు 23, కార్యాలయ సబార్డినేట్ 56, డ్యూటీ సర్వేయర్ 2, డ్రైవర్స్ 7, చౌకీదార్ 10 పోస్టులుగా ఉండాలని నిర్ణయించారు. కానీ ఈ నాలుగు జిల్లాలకు ఇది వర్తించడంలేదు.



స్వాతంత్ర్యం

సిద్ధించిన నాటినుంచి తీరు మారని కలెక్టరేట్ల సమగ్ర స్వరూపాన్ని తెలంగాణ ప్రభుత్వం గతేడాది మార్పులు చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కలెక్టరేట్ల స్వరూపం మార్చుతూ నిర్ణయం తీసుకుంది. పరిపాలనా సౌలభ్యం, వృథా, జాప్యం నివారించేలా ఇందులో కీలక జాగ్రత్తలు తీసుకున్నది. ఈ ప్రతిపాదనల మేరకు కలెక్టర్ ఆఫీసుల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) ఉంటారు. 13

స్వరూపం మారదేమి...

మంది శాఖాధిపతులు పర్యవేక్షణలో మొత్తం అధికారులు, సిబ్బంది ఉంటారు. కలెక్టరేట్‌లో 7 సెక్షన్లను ప్రభుత్వం ఆమోదించింది. అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏవో) సెక్షన్‌లో ఏ, బీ సెక్షన్లు, ఏసీబీలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉండనున్నారు. ఏదుగురు సూపరింటెండెంట్లకు ఒక్కొక్కరికి ఇద్దరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. ఎన్నికల విభాగం కూడా కలెక్టరేట్‌లో కొనసాగిస్తారు. ఇందులో ఒక సీనియర్ అసిస్టెంట్‌ను కేటాయిస్తారు.

పనిలోపనిగా వినూత్న ఆలోచనల దిశగా సర్కార్ పావులు కదుపుతోంది. జిల్లాలు ఏర్పాటుతో అందివచ్చిన ఫలాలను భేరీజు వేసుకుంటూ మరిన్ని సంస్కరణలు యోచిస్తోంది. శాఖల్లో వృధాను కట్టడి చేయాలని నిర్ణయించింది. సుమారు 40 ప్రభుత్వ శాఖలు (డిపార్ట్‌మెంట్)లలో వృధాను అరికట్టి ఏటా రూ. 2వేలనుంచి రూ. 10వేల కోట్లను ఆదా చేసుకోవాలని సర్కార్ యోచిస్తోంది. ప్రభుత్వ శాఖల వారీగా వృధా అవుతున్న నిధులను గుర్తిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని రీతిలో ప్రభుత్వ శాఖల విలీనంతో కొంత మేర ఫలితాలు సాధించిన ప్రభుత్వం తాజా కార్యాచరణను సత్వరమే అమలులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వశాఖల్లో అడ్డగోలుగా ఉప శాఖలను ఏర్పాటు చేసి అనవసర వ్యయం చేస్తుండడాన్ని

వ్యవస్థల్లూ పెరిగాయ్...

సమగ్ర పరిపాలనా ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇప్పుడిప్పుడే అందుతున్నాయి. వివిధ శాఖల స్వరూపాలు, నిర్వహణ యూనిట్ల హేతుబద్ధీకరణతో సరళీకృత పరిపాలనా విధానాలు అవకాశాలు మెరుగయ్యాయి. తద్వారా రాష్ట్రంలోని మొత్తం జిల్లాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వ్యవస్థల సంఖ్య 21,208నుండి 26,846కు చేరింది. దీంతో కొత్తగా అదనంగా 563 8వ్య వస్థలు జిల్లాల్లో ప్రజా సేవలకు ఊపిరి పోసుకున్నాయి. దీంతో స్థానిక పాలన మునుపటి కంటే మరింత పటి ష్ఠంగా ప్రజలకు చేరువగా వెళ్లిందని ఫలితాలు రుజువు చేస్తున్నాయి. మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ, భూరికార్డుల ప్రక్షాళన, కేసీఆర్ కిట్ల పంపిణీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పించ న్లు, హాస్టళ్లకు సన్న బియ్యం, గురుకులాలు, అంగన్‌వా డీలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల నిర్మా ణం వంటి అనేక పథకాలు, పనుల్లో పారదర్శకత, పర్యవేక్షణ పెరిగింది. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లోనూ ప్రచారం వేగం గా పెరిగి వారు చైతన్యవంతులు వుతున్నారని ప్రభుత్వానికి చేరిన నివేదికలో వెల్లడైంది.

ఖర్చును నియంత్రించేలా....

సీరియస్‌గా పరిశీలిస్తోంది. విద్యాశాఖలో 18 ఉప శాఖలు, వ్యవసాయ శాఖలో 16, ఆరోగ్యశాఖలో 10, సంక్షేమ శాఖలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప శాఖల్లో పదికి మించి ఉప శాఖలను ఏర్పాటు చేసారని తేల్చింది.

వీటిని కుదించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం. శాఖల కుదింపు, ఉప శాఖల తొలగింపుతో శాఖలన్నింటినీ పునర్వ్యవస్థీకరణ జరిపి అవసరం ఉన్న మేరకు కొనసాగించేలా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు బాధ్యతలను అప్పగించారు.

జపాన్‌లో అమెరికా హెలీకాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

టోక్యో: అమెరికాకు చెందిన మిలటరీ హెలికాప్టర్ ఒకినోవా బీచ్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయినట్టు అధికారులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదని అగ్నిమాపకశాఖ అధికారి ఒకరు వివరించారు. యూహెచ్-1 జనుకలో అత్యవసర ల్యాండింగ్ కావడంతో జపాన్ పోలీసులు దాన్ని ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఈ విషయమై అమెరికా మిలటరీ ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత నెలలో అమెరికా మిలటరీ హెలికాప్టర్‌కు చెందిన ఓ తలుపు ఒకినోవాలోని పుటెన్మా మెరైన్ ఎయిర్ బేస్ సమీపంలోని ఓ పాఠశాల మైదానంలో పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రెండు నెలల క్రితం అమెరికా మిలటరీ చాపర్ మంటలు అంటుకుని ఐస్‌ల్యాండ్‌లో ల్యాండ్ అయ్యింది.

కాంగ్రెస్ వస్తే రూ.2 లక్షల రుణమాఫీ



(మొదటిపేజీ తరువాయి)

రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఆ పార్టీ వెల్లడించింది. 'రైతు సంక్షేమం- వ్యవసాయ ఉత్తత్తులకు గిట్టుబాటు ధర' అంశంగా ఆర్మూర్ డిక్లరేషన్ను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఆర్మూర్‌లో జరిగిన సదస్సులో ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఈ మూడున్నరేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోకపోవడం కాకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. రైతు రుణమాఫీ అమలు కాకపోవడం రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారని ఆయన వివరించారు. పంటలకు కనీస మద్దతు ధర, కరువు కాటకాలు, ఆకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడం తెలంగాణ ప్రభుత్వం విఫలమైందన్నారు. పంట నష్టానికి 7 లక్షల మంది బీమా ప్రీమియం ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించినా పైసా నష్టపరిహారం అందలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ ఏకకాలంలో రూ. 2 లక్షలు మాఫీ చేస్తామన్నారు. పంట బీమా పథకం కేంద్రంతో రైతులకు ప్రీమియం భారం పడకుండా సమగ్ర పంట బీమా పథకం అమలు చేస్తామన్నారు.

ఆర్మూర్ డిక్లరేషన్‌లో పంటలకు మద్దతు ధరల వివరాలు..

క్రమ సంఖ్య	వివిధ పంటలు	కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధర	2019లో రాబోయే ఇప్పుడోచే కనీస ధర
1	వరి (ఏ గ్రేడ్)	రూ.1,510	రూ.2,000
2	వరి (సాధారణ రకం)	రూ.1,470	రూ.2,000
3	పత్తి	రూ.4,160	రూ.6,000
4	పత్తి (మధ్యరకం)	రూ.3,860	రూ.6,000
5	సోయాబిన్	రూ.2,775	రూ.3,500
6	కందులు	రూ.5,050	రూ.7,000
8	మినుములు	రూ.5,000	రూ.7,000
9	పెసలు	రూ.5,225	రూ.7,000
10	వేరుశనగ	రూ.4,220	రూ.5,000
11	పొద్దు తిరుగుడు	రూ.3,950	రూ.5,000
12	సజ్జలు	రూ.1,330	రూ.2,000
13	జొన్నలు (హైబ్రిడ్)	రూ.1,625	రూ.2,000
14	జొన్నలు (మలదండి)	రూ.1,650	రూ.2,000
15	మిర్చి	--	రూ.10,000
16	పసుపు	--	రూ.10,000
17	ఎర్రజొన్నలు	--	రూ.3,000

సినీ స్టూడియోలో అగ్నిప్రమాదం

- ముంబై 'సినీ విస్టా'లో దుర్ఘటన
- అదే సమయంలో రెండు టీవీ సీరియల్స్ షూటింగులు




ముంబై: ముంబైలోని సినీ విస్టా స్టూడియోలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సబర్బన్ కంజూర్ మార్గ్(పశ్చిమ)లో శనివారం రాత్రి దాదాపు ఎనిమిది గంటలకు అగ్ని ప్రమాదం సంభవించిందని జోన్ 7 డీసీపీ అఖిలేష్ సింగ్ తెలిపారు. మంటలు అర్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఘటనలో ఎవ్వరైనా గాయపడినదీ లేనిదీ తెలియరాలేదని ఆయన చెప్పారు. ఒక అంతస్తును కలిగి ఉన్న స్టూడియోలో ఎలక్ట్రిక్ వైరింగ్ ముందుగా తగలబడిందని తెలిపారు. మంటలను ఆర్పడం కోసం ఎనిమిది అగ్నిమాపకశకటాలు, వాటర్ ట్యాంకర్లు రంగంలోకి దిగాయి.

ఇమ్రాన్‌కు మళ్లీ పెళ్లి

- మూడో వివాహంపై పాక్ వార్తా కథనాలు
- ఒకటో తేదీన ఆధ్యాత్మిక సలహాదారుతో నిఖా
- తోసిపుచ్చిన పార్టీ వర్గాలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ విపక్ష నేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ తనకు ఆధ్యాత్మిక సలహాలు ఇచ్చే ఒక మహిళను వివాహం చేసుకున్నారని పాకిస్తాన్‌కు చెందిన ఓ దినపత్రిక శనివారం తెలిపింది. జనవరి ఒకటవ తేదీ రాత్రి లాహోర్‌లో మూడవ వివాహం అన్నట్టుగా ఆమెను పరిణయమాడిన పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ ఛైర్మన్ ఇమ్రాన్ ఖాన్ అక్కడి నుంచి నేరుగా ఇస్లామాబాద్ వెళ్లి ఉగ్రవాద వ్యతిరేక న్యాయస్థానం ఎదుట హాజరయ్యారని పేర్కొంది. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసిందని తెలిపింది. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు ముఫ్తీ సయీద్ నిఖా నిర్వహించారని తెలిపింది. వధువు ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్తతో విడాకులు కోసం కొద్ది మాసాల క్రితం దరఖాస్తు చేసిందని సదరు దినపత్రిక పేర్కొంది. అయితే వివాహం జరిగినట్టుగా వార్తలను ఖాన్ రాజకీయ కార్యదర్శి



ఆన్ చౌద్రి, పార్టీ అధికార ప్రతినిధి నయీమ్ ఉల్ హక్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఇమ్రాన్‌కు ఇది మూడవ వివాహం. మొదటగా ఆయన 1995, మే 16న జెమీమా గోల్డ్ స్మిత్‌ను వివాహం చేసుకున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత 2004, జూన్ 22న ఆమెతో విడాకులు పొందారు. ఆ తర్వాత టీవీ యాంకర్ రెహమ్‌ఖాన్‌ను ద్వితీయ వివాహం చేసుకున్నారు. అయితే ఆ వివాహం బంధం పట్టుమని 10 నెలలు కూడా నిలబడలేదు.





లాలూకు మూడున్నరేళ్ల జైలు

● దాణా కుంభకోణం కేసులో శిక్ష ఖరారు ● లాలూతో పాటు ఏడుగురికి ఒకే శిక్ష ● న్యాయ వ్యవస్థపై తేజస్వి విశ్వాసం ● హైకోర్టులో బెయిల్ తెచ్చుకుంటామని వ్యాఖ్య

రాంచీః దాణా కుంభకోణం కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ కోర్టు మూడున్నరేళ్ల జైలు శిక్ష.. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. సీబీఐ రెండో కేసులో పేర్కొన్న రూ.89.27 లక్షల దాణాకుంభకోణంలో లాలూతో పాటు మరో ఏడుగురికి న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. మరో ఏడుగురికి కూడా మూడున్నరేళ్ల జైలుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. గడువులోపు జరిమానా కట్టకుంటే నిందితులందరికీ మరో ఆరునెలల జైలు శిక్ష పెరుగుతుందని న్యాయమూర్తి శివపాల్ సింగ్ ప్రకటించారు. నిందితుల్లో పూల్ చంద్,మహేష్ ప్రసాద్, బేక్ జూలియన్,సునిల్ కుమార్, సుశీల్ కుమార్, సుధీర్ కుమార్,రాజారామ్ ఉన్నారు. శిక్ష ఖరారు సందర్భంగా న్యాయమూర్తి నిందితుల నుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వీళ్లందరికీ ఓపెన్ జైలు సరిపోతుంది. ఎందుకంటే ఇంతకు ముందు వీళ్లకు ఆవులను పెంచిన అనుభవం ఉంది. అని వ్యాఖ్యానించారు.

సామాజిక న్యాయం కోసం సంతోషంగా చనిపోతాఃలాలూ

లాలూకు శిక్ష ఖరారైన తర్వాత ఆయన అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి బీజేపీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. మమ్మల్ని అనుసరించండి.లేదంటే మేం ఫిక్స్ చేస్తాం. అనేది వారి తత్వం. సామాజిక న్యాయం, సమానత్వం, సామరస్యం కోసం నేను సంతోషంగా మరణిస్తాను. అని లాలూ వ్యాఖ్యానించినట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

నాన్నకు బెయిల్ వస్తుంది..

లాలూకు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసిన తర్వాత ఆయన కుమారుడు బీహార్ మాజీ మంత్రి తేజస్వి యాదవ్ స్పందించారు. తమకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందని..హైకోర్టులో లాలూకు బెయిల్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీబీఐ న్యాయస్థానం తీర్పుతో తాము నిరాశ చెందడం లేదని చెప్పుకొచ్చారు. లాలూకు లాలూకు 3 నుంచి నాలుగేళ్ల జైలు శిక్ష పడితే త్వరగానే బెయిల్ మంజూరు అవుతుందని న్యాయనిపుణులు పేర్కొంటున్న నేపథ్యంలో హైకోర్టులో తన తండ్రికి బెయిల్ వస్తుందని తేజస్వి ధీమాగా ఉన్నారు. దాణా కుంభకోణంలో ప్రత్యక్షంగా తన పాత్ర ఏమీ లేదని..తనపై దయతలచి శిక్షను తగ్గించాలని వేడుకున్నారు.తన ఆరోగ్యం, వయస్సు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని శిక్ష తగ్గించాలని లూలూ కోరారు. అయినా న్యాయమూర్తి కనికరం చూపకుండా మూడున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించారు.

ఇదీ కేసు

1991-1994 మధ్య లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఈ దాణాకుంభకోణం 1997 లో వెలుగులోకి వచ్చింది. పశువుల దాణా కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో లాలూసహా మరికొందరిపై కేసు నమోదైంది. దీంతో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేసి తన భార్య రబ్రీదేవిని సీఎంగా చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదు కాగా ప్రస్తుతం మూడు కేసులు పెండింగ్ లో ఉన్నాయి. తాజాగా తీర్పు వెలువరించిన కేసు 1994-1996లో లాలూ దేవ్‌గఢ్ జిల్లా ట్రెజరీ నుంచి 89 లక్షల 27వేల రూపాయలను అక్రమంగా విత్ డ్రా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో మొత్తం 38మందిపై కేసులు నమోదుకాగా వారిలో 11 మంది విచారణ సమయంలో మృతి చెందారు. ముగ్గురు అప్రూవర్లుగా మారారు. మరో ఇద్దరు నేరాన్ని ఒప్పుకోవడంతో 2006లో శిక్ష పడింది.ఇటీవల లాలూ సహా 15మంది దోశులుగా తేలగా..మరో ఏడుగురు నిర్దోషులుగా న్యాయస్థానం స్పష్టం చేసింది.

మీసా భారతిపై ఈడీ రెండో చార్జ్ షీట్

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కు దాణా కుంభకోణంలో రాంచీ సీబీఐ కోర్టు మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించిన రోజే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయన కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేష్ కుమార్ లపై ఢిల్లీ కోర్టులో రెండో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ కు సంబంధించిన కేసులో ఈ చార్జ్ షీట్ దాఖలైంది. గత నెల 23న దాఖలు చేసిన చార్జ్ షీట్‌తోపాటు తాజా చార్జ్‌షీట్‌పై ఫిబ్రవరి 5న న్యాయస్థానం విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే ఈ కేసులో వెంటవెంటనే రెండు చార్జ్‌షీట్‌లు దాఖలు చేయడంపై ఈడీపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కేసులో విచారణ ప్రారంభమౌతుందా.. మీరు ఇంకా చార్జ్ షీట్లు దాఖలు చేస్తూనే ఉంటారా.. ఇంకెన్ని అదనపు చార్జ్ షీట్లు దాఖలు చేస్తారు. ఈడీ అంటే ప్రధాన దర్యాప్తు సంస్థ. కానీ మీరు అలా నడుచుకోవడం లేదు. అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. దక్షిణ ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో మీశైల్ పాకర్స్ అండ్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఫాం హౌస్ ను ఈడీ సీజ్ చేసింది. 2008-09 సంవత్సరంలో దీని కొనుగోలు కోసం కోటి 20 లక్షల మనీలాండరింగ్ చేశారని ఈడీ ఆరోపించింది. డొల్ల కంపెనీలకు కోట్లలో నగదును బదిలీ చేశారని మీసా భారతి, ఆమె భర్తపై ఈడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసులో సురేంద్రకుమార్ జైన్,వీరేంద్ర కుమార్ జైన్ అనే వారిద్దరి నివాసాలు, ఆఫీసుల్లో దాడులు నిర్వహించి మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద వారిని అరెస్ట్ చేసింది.వారితో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన చార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్ అగర్వాల్ ను కూడా ఈడీ అరెస్ట్ చేసింది.

దాణా కుంభకోణం కేసు టైం లైన్

జనవరి 6,2018
స్పెషల్ సీబీఐ కోర్టు ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్‌కు
✓ మూడున్నరేళ్ల జైలు
✓ రూ. 10లక్షల జరిమానా

దేవగఢ్ ట్రెజరీ నుంచి రూ.89.27 లక్షల మోసపూరితంగా విత్ డ్రా

రూ. 37.7 కోట్లు

"చైబాసా ట్రెజరీ నుంచి మోసపూరితంగా విత్‌డ్రా చేసినందుకు 2013లోనే న్యాయస్థానం లాలూని దోషిగా తేల్చింది."

21	56	64
ఏళ్లు	నిందితులు	మందిపై కేసులు



జనవరి 1996: చైబసా డిప్యూటీ కమిషనర్ పశుసంవర్ధక శాఖలో సోదాలతో వెలుగులోకి దాణా కుంభకోణం
మార్చి 1996: లాలూ ప్రసాద్ యాదవ్ పై సీబీఐ చార్జ్‌షీట్
జూలై 1997: బీహార్ సీఎం పదవికి లాలూ రాజీనామా.. సీబీఐ ముందు లొంగుబాటు, జ్యుడిషియల్ కస్టడీకి లాలూ
ఏప్రిల్ 2000: కేసులో లాలూ భార్య రబ్రీదేవి పేరు
అక్టోబర్ 2001: కేసును జార్ఖండ్ హైకోర్టుకు మార్చిన సుప్రీంకోర్టు



ఫిబ్రవరి 2002: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2006: ఆస్తుల కేసులో లాలూ, రబ్రీదేవి నిర్దోషులుగా తేల్చిన కిందిస్థాయి కోర్టు
మార్చి 2012: లాలూ, జగన్నాథ్ మిశ్రాలపై ఛార్జ్‌షీట్లు
సెప్టెంబర్ 2013: లాలూ, జగన్నాథ్ మిశ్రా సహా 45 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
డిసెంబర్ 2013: లాలూకు సుప్రీంకోర్టులో బెయిల్
మార్చి 2014: లాలూపై ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
మార్చి 2017: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2017 : లాలూతో పాటు 15 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ కోర్టు, జైలుకు తరలింపు

బడ్జెట్‌పై మోడీ ముద్ర

పిఎంవోలో గంటల తరబడి సమావేశాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎన్నికలకు ఏడాది ముందు ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ పై ప్రధానమంత్రి తనదైన ముద్ర వేయనున్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ తర్వాత ఆర్థిక వృద్ధి మందగించి నిరుద్యోగం ప్రబలుతున్న నేపథ్యంలో దానిని అధిగమించే దిశగా పలు చర్యలు ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. ఎన్నికల బడ్జెట్ కావడంతో పలు ప్రజాకర్షక పథకాలు ప్రతిపాదించే అవకాశముందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయంతో పాటు గ్రామీణ రంగానికి పెద్దపీట వేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్వయంగా ప్రధాని మోడీయే బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని ఉన్నతాధికారులకు సూచనలు చేస్తున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బడ్జెట్‌కు ప్రధాని మెరుగులు దిద్దుతున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం అధికారులు, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు బడ్జెట్‌పై ఆయా వర్గాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ప్రధానమంత్రి కార్యాలయం ప్రోయాక్టివ్ పాత్ర పోషించడం వల్ల బడ్జెట్‌ను ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించే అవకాశముంటుందని ఆర్థికశాఖ అధికారులుచెపుతున్నారు. వినూత్నమైన ఆలోచనలతో పథకాలను ప్రతిపాదించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తన మంత్రివర్గ సహచరులను కోరుతున్నారు. గతంలోనూ సైతం బడ్జెట్, గత పథకాలకు , భవిష్యత్ పనికి లింక్‌గా ఉండాలని ప్రధాని సూచించారు.



గతంలోనూ బడ్జెట్ సమావేశాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నప్పటికీ, ఈసారి నేరుగా ప్రధాని కార్యాలయంలోనే గంటల తరబడి బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నేరుగా బడ్జెట్ సమావేశాలకు హాజరుకావడం వల్ల ఆయన సూచనలకు అనుగుణంగా మరింతస్పష్టంగా బడ్జెట్ రూపొందించే అవకాశముంటుందని అధికారవర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ సారి బడ్జెట్‌లో ప్రధానంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, వ్యవసాయ సంక్షోభ నివారణ, ప్రైవేట్ పెట్టుబడులపై ప్రధానమంత్రి మోడీ దష్టి సారించినట్లు అధికార వర్గాలు చెపుతున్నాయి. వచ్చే వారంలో దేశ ఆర్థిక స్థితిపై ఆర్థికనిపుణులతో ప్రధాని సమావేశం కానున్నారని తెలిసింది. పిఎం ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులతో సమావేశం జరిగే అవకాశం ఉంది. ఆర్థికవృద్ధి వేగవంతం చేయడానికి చర్యలు ప్రతిపాదించే అవకాశముంది.

కులాల కార్చిచ్చును ఆర్పేదెలా?

● బీజేవైఎం పదాధికారుల సమావేశంలో మేధోమథనం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ సామాజిక వర్గాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను తరిమికొట్టాలని భారతీయ జనతా యువ మోర్చాకు బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చింది. ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'బీజేవైఎం రాష్ట్రీయ పదాధికారి బైఠక్'లో దేశవ్యాప్తంగా రోడ్డెక్కిన కులాల ఆందోళనలపై ప్రధానంగా చర్చించారు. తాజాగా మహారాష్ట్రలో దళితులు, బ్రాహ్మణుల మధ్య తలెత్తిన ఘర్షణలపై బీజేపీ ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. బీజేపీని దళిత వ్యతిరేకిగా, మైనారిటీ వ్యతిరేకిగా తరచుగా కాంగ్రెస్ పార్టీ పేర్కొంటోంది. ఈ ప్రచారం బీజేపీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని పార్టీ అధినేతలు గ్రహించారు. ముఖ్యంగా యువతరమే ఈ తరహా ప్రచారాన్ని నమ్ముతోందని, వారి ద్వారా మిగతా వర్గాలు సైతం ప్రభావితమవుతున్నాయని గుర్తించారు. పార్టీ యువజన విభాగం బీజేవైఎంను రంగంలోకి దింపాలని పార్టీ అధినేతలు నిర్ణయించి సమావేశం ఏర్పాటు చేసింది. కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలని చూస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వైఖరిని బయటపెట్టాలని, ఆ రెండు పార్టీలను సమాజ విద్రోహ పార్టీలుగా పేర్కొంటూ ప్రచారం చేయాలని పదాధికారులకు సూచించినట్టు సమాచారం.



దేశద్రోహులతో కాంగ్రెస్ దోస్తీ: విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం ఏపీ అధ్యక్షుడు

రాష్ట్రీయ పదాధికారి బైఠక్ ముగిసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ యువమోర్చా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలపై విరుచుకుపడ్డారు. ఆ రెండు పార్టీలూ జే.ఎన్.యూలోని దేశద్రోహులతో చేతులు కలిపి కులాల మధ్య చిచ్చుపెడుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమాజంలోని అన్ని వర్గాల ఆదరణ పొందుతూ అత్యంత బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిన బీజేపీని ఎదుర్కోలేక, కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అందుకే ఉమర్ ఖాలిద్ వంటి దేశద్రోహులను, జిగ్నేష్ మేవానీ వంటి కుల నేతలను ప్రోత్సహిస్తూ వారి ద్వారా హింసాత్మక ఆందోళనలు చేయిస్తున్నారని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు.

సభా హక్కుల సంగతులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహల్‌కి వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ యాదవ్ ఇచ్చిన సభా హక్కుల నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యానాయుడు లోక్‌సభ స్పీకర్‌కు పంపించడంతో సభా హక్కుల అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తదుపరి ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ నీడలో సభా హక్కుల నోటీసుకు ఉన్న ప్రాధాన్యత, సంబంధిత సంఘాల కార్యకలాపాలు, విధి విధానాలపై ప్రత్యేక కథనం.

సభా హక్కులపై ప్రశ్న

సభా హక్కులకు సంబంధించిన నియమాలకు లోబడి ఎవరైనా సభ్యుడు ఛైర్మన్ అనుమతితో మరో సభ్యుడు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడినారనే ప్రశ్నను లేవనెత్తవచ్చు.

సభా హక్కుల ప్రశ్నను లేవనెత్తాలనుకునే సభ్యుడు ప్రతిపాదిత ప్రశ్నను సభలో ప్రస్తావించడాని కంటే ముందే సెక్రటరీ జనరల్‌కు లిఖితపూర్వక నోటీసు సమర్పించాలి. ఒక డాక్యుమెంట్ ప్రాతిపదికగా ప్రశ్నను లేవనెత్తుతున్న పక్షంలో సదరు డాక్యుమెంట్‌ను సైతం నోటీసుతో జతపరచాలి.

187వ రూల్ కింద సభా హక్కులపై ప్రశ్నను లేవనెత్తడానికి ఛైర్మన్ అంగీకరించిన పక్షంలో సంబంధిత సభ్యుడు లేచి నిలబడి తన ప్రశ్నను సభలో ప్రస్తావిస్తారు.

సభా హక్కుల కమిటీకి నోటీసు

190వ రూల్ కింద నోటీసును సంబంధిత సభ్యుడు లేదా మరే ఇతర సభ్యుడి ద్వారా సభా హక్కుల సంఘానికి సిఫార్సు చేసే అంశంపై రాజ్యసభ ఒక నిర్ణయం తీసుకుంటుంది. రాజ్యసభకు సంబంధించి 10 మంది సభ్యులతో సభా హక్కుల కమిటీ ఉంటుంది. కమిటీకి కోరంగా ఐదుగురు సభ్యులు ఉండాలి. తనకు అందిన ప్రతి నోటీసును సంఘం సునిశితంగా పరిశీలిస్తుంది. అనంతరం సంఘం తన నివేదికను ఛైర్మన్‌కు పంపిస్తుంది. అనంతరం నివేదికపై సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెడతారు. అనంతరం సభా హక్కులను ఉల్లంఘించిన సభ్యుడిపై చర్యకు ఆదేశించవచ్చు. ఇక లోక్‌సభ సభా హక్కుల కమిటీలో 15 మంది సభ్యులను స్పీకర్ నామినేట్ చేస్తారు. రాజ్యసభ తరహాలో ఇది పనిచేస్తుంది.

లోక్‌సభకు రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

న్యూఢిల్లీ: రాహుల్‌పై వచ్చిన సభాహక్కుల నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యానాయుడు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహజన్‌కు పంపించినట్టు సంబంధిత వర్గాలు శనివారం వెల్లడించాయి. రాహుల్ లోక్‌సభ సభ్యుడు కావడంతో సభా హక్కుల ఉల్లంఘన జరిగిందని తేలినందునే మున్ముందు చర్య కోసం ఛైర్మన్ నోటీసును స్పీకర్‌కు పంపించారని తెలిపాయి. అద్వానీ అధ్యక్షతన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ వద్ద సైతం రాహుల్‌పై ఒక ఫిర్యాదు నమోదైంది. రాజ్యసభ అధికారాన్ని, దాని నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేసిన ట్వీట్‌పై బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు భూపేందర్ యాదవ్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. సభా నేత జైట్లీ పేరును జైట్‌లైగా వక్రీకరిస్తూ ట్వీట్ చేయడం ద్వారా రాహుల్ గాంధీ సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని యాదవ్ ఆరోపించారు. ఆయన ఉద్దేశ్యపూర్వకంగానే ఆ పని చేశారని అన్నారు. శీతాకాల సమావేశాల చివరి రోజున నోటీసు ఏమైందని యాదవ్ సభ ఛైర్మన్‌ను తెలుసుకొనగోరగా తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదం

ముంబై: కమలామిల్స్ అగ్నిప్రమాదానికి సంబంధించిన నివేదికను అగ్నిమాపకశాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమర్పించారు. గత నెల ముంబైలో జరిగిన మోజో బిస్ట్రో రెస్టారెంటులో తొలుత అగ్నిప్రమాదం జరిగి అనంతరం మంటలు వన్ అబౌ రెస్టారెంటుకు వ్యాపించాయని అధికారులు తెలిపారు. రెండు రెస్టారెంట్లలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం సరఫరా చేశారన్నారు. ఈ ప్రమాదం మానవ తప్పిదమే వల్లే జరిగిందని అధికారులు తమ నివేదికలో వెల్లడించారు. రెండు రెస్టారెంట్లలో అగ్నిప్రమాద నియంత్రణకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఘోర అగ్నిప్రమాదం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. ఈప్రమాదంలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల 14మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. పబ్ యజమాని ఆచూకీ తెలిపినవారికి లక్ష రూపాయల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

మావోల చేతిలో సర్పంచ్ హతం

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో గ్రామ సర్పంచ్‌ను మావోయిస్టులు గొంతుకోసి హతమార్చారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బస్తర్ జిల్లాలోని చిందుగర్ గ్రామ సర్పంచ్ పాండ్రు (45)ను సాయుధ మావోయిస్టులు కొంతమంది అతని ఇంటినుంచి బయటకు లాగి గొంతుకోసి చంపేశారని డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ విలేఖరులకు తెలిపారు. రాజధాన్ రాయ్‌పూర్‌కు 350 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని సర్పంచ్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఈ ప్రాంతవాసులు గత కొంతకాలంగా మావోయిస్టుల కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నారని అందువల్ల మావోయిస్టులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు.

యూపీలో యువతిపై గ్యాంగ్‌రేప్

బండా: ముగ్గురు సాయుధ దుండగులు మహిళకు గన్ చూపి ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఈ ఘటన బదవల్ గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిందని పోలీసులు తెలిపారు. బండా చిత్రకూట్ సరిహద్దులో నదిని దాటుతుండగా మహిళను అపహరించారని ఎస్పీ లాల్ భరత్ కు మార్ పాల్ తెలిపారు. చిత్రకూట్‌లో నివసిస్తున్న మహిళ తన భర్త, సోదరుడిని కలిసేందుకు వచ్చిందని తిరుగు ప్రయాణంలో ఉండగా ముగ్గురు దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ముందు మహిళపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేశారని, గన్ చూపి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రాత్రి ముగ్గురు నిందితులను అరెస్టుచేశామని విచారణ చేస్తున్నామని విలేఖరులకు పోలీసులు తెలిపారు.

వైట్‌హౌస్‌లో 'ది పోస్ట్'

అమెరికా : ప్రముఖ హాలీవుడ్ రిపోర్టర్ స్పీల్‌బర్గ్ 'దిపోస్ట్'పేరుతో తీసుకొస్తున్న సినిమాను ప్రదర్శించడానికి వైట్‌హౌస్ ఆమోదం తెలిపింది. వైట్‌హౌస్, క్యాంప్ డేవిడ్ రెండింటిలోనూ ఈ చిత్రం చూపించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డొనాల్డ్ బృందానికి కోరిన అభ్యర్థనను వైట్‌హౌస్ వర్గాలు ఆదివారం నిర్వహించనున్న సదస్సులో ఉంచుతారు. మెరిల్ స్ట్రీప్, టామ్ హ్యాంక్స్ చిత్రంలో నటించారు. వియత్నాం యుద్ధం, పరిపాలన గురించి సినిమాలో చూపిస్తున్నారు. 70 ఏళ్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన పాత్రికేయుల కథపై ఈ సినిమా రూపొందించడం జరిగింది. చిత్ర నిర్మాత అమీ పాస్కల్ విలేకరులతో మాట్లాడారు. చాలా మంది రిపబ్లికన్ వ్యక్తులు సినిమా చూశారని, వారికి ఎంతో నచ్చిందన్నారు.

అమెరికా సరిహద్దు వెంట భారీగోడ

● 18 బిలియన్ డాలర్లతో నిర్మాణం

శాన్‌డైగో : అమెరికాకు సరిహద్దు దేశంగా మెక్సికో ఉంది. అమెరికా చుట్టూ ఓ పెద్ద గోడ నిర్మించడానికి ట్రంప్ పరిపాలనాధికారులు నిర్ణయించారు. 10ఏళ్లలో 18 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి గోడ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కస్టమ్స్, సరిహద్దు బలగాలు కలిసి ఈ గోడను నిర్మించనున్నారు. 505 కిలోమీటర్ల మేర బార్డర్ ఉంది. సెప్టెంబర్, 2027లోగా పూర్తి చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అమెరికా చుట్టూ మెక్సికో కాకుండా ఇతర దేశాలతో సరిహద్దు సుమారు 1,552 కి.మీ ఉండనుంది. 651 కి.మీ మేర రెండో భద్రతా వలయంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇరు దేశాల మధ్య అందమైన భారీ గోడ నిర్మాణం విషయమై మెక్సికోకు ట్రంప్ హామీ ఇచ్చారు. ఎంత ఖర్చు..? ఎక్కడ నిర్మిస్తామనే విషయమై ట్రంప్ క్లారిటీ ఇవ్వలేదు. ఈయేడు నిర్మాణం విషయమై ట్రంప్ పరిపాలనాధికారులు మెక్సికోను 1.6 బిలియన్ డాలర్లు అడిగారు. లేదంటే 74 మైళ్లు అనగా 118 కిలోమీటర్లు ఫెన్సింగ్ టెక్సాస్, కాలిఫోర్నియాలో నిర్మించాలని సూచించారు. వారు మాత్రం 1.6 బిలియన్ డాలర్లు ఇవ్వడానికి సుముఖంగానే ఉన్నారని, కానీ ఈ మొత్తం వచ్చే ఏడాది ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో విమానాలు ఢీ

టోరంటో : రెండు విమానాలు ఢీకొన్న ఘటన టోరంటో అంతర్జాతీయ విమానశ్రయంలో చోటు చేసుకుంది. ఓ విమానం తోక భాగం నుండి నిప్పురవ్వలు చెలరేగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. కానీ ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వెస్ట్‌జెట్ విమానం 168 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో మెక్సికోలోని కాంకున్ నుండి టోరంటో విమానాశ్రయానికి వచ్చింది. గేటు లోపలికి వెళ్తున్న సమయంలో సన్‌వింగ్ ఏయిర్‌క్రాఫ్ట్ తగలడంతో వెస్ట్‌జెట్ విమానం నుండి నిప్పురవ్వలు చెలరేగాయి. కొందరు వెస్ట్‌జెట్ ప్రయాణికులు కిటికీల నుండి ప్రమాద ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. విమానాశ్రయ భద్రతా సిబ్బంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల వెంట దించివేసి మరమ్మతు చర్యలు చేపట్టారు.

నిర్ణయం పాక్ చేతుల్లోనే...

వాషింగ్టన్ : అమెరికా మరోసారి పాకిస్థాన్‌పై విరుచుకుపడింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నారనే కారణంతో ఇప్పటికీ అన్ని విధాలుగా అమెరికా, పాక్‌ను కట్టడి చేసింది. అమెరికా వైఖరి కఠినంగానే ఉన్నట్టు మరోసారి స్పష్టమైంది. అన్ని విధాలుగా పరిశీలించిన తరువాతే అమెరికా ఈ చర్యలకు పాల్పడుతున్నది. పాక్‌నుద్దేశించి వైట్‌హౌస్ నుండి మరో ప్రకటన బయటకు వచ్చింది. పాకిస్థాన్‌ను డీల్ చేసే విషయంలో అన్ని రకాల దారులకు తాము సిద్ధంగానే ఉన్నాం. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ విషయంలో పాక్ కఠినంగా ఉండటం లేదు. ఉగ్రవాదులను గుర్తించి స్థావరాలను ధ్వంసం చేయకున్నా.. మేం ఏం చేయాలో అదే చేస్తున్నాం. ఏం చేయాలో పాక్ చేతుల్లోనే ఉంది అని వైట్‌హౌస్ నుండి ఓ ప్రకటన వెలువడింది.

ఖాతాలు బ్లాక్ చేయలేదు

న్యూఢిల్లీ : ట్విట్టర్ ఖాతాల బ్లాక్‌విషయమై సంబంధిత అధికారులు స్పందించారు. అభ్యంతరకరమైన పోస్టులు చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నాయకుల ఖాతాలను నిలువరించారని వచ్చే ఆరోపణలు వాస్తవం లేదని తేల్చి చెప్పారు. రాజకీయ పరిస్థితులు జనం మధ్యలోకి తీసుకెళ్లేందుకు ట్విట్టర్ ఓ వేదికగా ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అణు ఆయుధాల వినియోగం గురించి వెల్లడించారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ముప్పు పొంచి ఉందనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. దీంతో ట్విట్టర్ ఖాతాలు బ్లాక్ చేశారనే వదంతులు వినిపించాయి. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన రాజకీయ నాయకులు ట్విట్టర్ వేదికగా చేసే సంభాషణలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఇటీవల కాలంలో ట్రంప్ కూడా ఉత్తర కొరియానుద్దేశించి పలు పోస్టులు చేశారు. పెద్దది, శక్తివంతమైన బటన్ తన వద్ద కూడా ఉందని ట్రంప్ కిమ్‌ను ఉద్దేశించి అన్నారు. దీంతో కొంత మంది ట్రంప్ ట్విట్టర్‌ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో కొన్ని మార్పులు చేయనున్నట్టు ట్విట్టర్ ప్రకటించింది. అభ్యంతరకరమైన, హింసను ప్రోత్సహించే విధమైన పోస్టులు చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరించనుంది. ఇలాంటి వారిని గుర్తించి ట్విట్టర్ నుండి తొలగించేలా నిబంధనలు రూపకల్పలు చేస్తున్నది.

క్రీడాప్రభ


భారత్ 92-7... హేమా హేమీ బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట ఒకరు క్యూ కట్టారు... మిస్టర్ డిపెండబుల్ పుజారా దక్షిణాఫ్రికా పేసర్ల భీకర బంతుల్ని ఎదుర్కొని రెండు గంటలకు పైగా నిలిచినా భారీ స్కోరు సాధించలేకపోయాడు... 92 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జట్టును ఆదుకునేదెవరు? ఎవరా ఆపద్బాంధవుడు! ఇలా మథనపడుతున్న భారత క్రికెట్ అభిమాని మనసుకు ఊరట కలిగిస్తూ.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (93) ప్రతాపం చూపించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భయం అనేది తన నిఘంటువులోనే లేదన్నట్లు స్టెయిన్ బృందాన్ని ఢీకొన్నాడు. ఉపఖండపు పిచ్‌లపైనే కాదు... దక్షిణాఫ్రికా వంటి వికెట్లపైనా మొనగాడిలా బ్యాటింగ్ చేయగలనని చాటాడు. తాను వరల్డ్ క్లాస్ ఆల్‌రౌండర్‌నని చెప్పకనే చెప్పాడు. ఆల్‌రౌండ్ దిగ్గజంకపిల్‌దేవ్ వీరోచిత ఇన్నింగ్స్‌ను గుర్తుకు తెచ్చాడు! స్టెయిన్ పేస్ దళం బంతుల్ని చీల్చి చెండాడు. తన సహజసిద్ధమైన శైలిలో ఆడి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టాడు. భారీ ఆధిక్యం సాధిద్దామనుకున్న వారి ఆశలపై నీళ్లు చల్లాడు. ఆ జోరులో సెంచరీ సాధిస్తాడనుకున్న 7 పరుగుల తేడాలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అయితేనేం భారత్‌కు మ్యాచ్‌లో పోటీనివ్వదగ్గ స్కోరు సాధించిపెట్టాడు. జట్టు స్కోరులో సగం పాండ్య సాధించిందే! దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూల్చి బౌలింగ్‌లోనూ పాండ్య సత్తా చాటాడు. పాండ్య మెరుపులతో తొలి టెస్ట్ ఆసక్తికరంగా మారింది.

పాండ్యా ఎదురుదాడి

- 95 బంతుల్లో 93 పరుగులు
- తోడ్పాటునందించిన భువీ
- భారత్ 209 ఆలౌట్
- దక్షిణాఫ్రికా 65-2



పాండ్య 93



భువనేశ్వర్ 25

కేప్‌టౌన్

పాండ్య 93, 95 బంతుల్లో, 14 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ రెండో రోజుశనివారం తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు సాధించింది. పాండ్యకు భువనేశ్వర్ (25, 86 బంతుల్లో, 4 ఫోర్లు) సమయోచితంగా తోడ్పాటునందించాడు. వీరిద్దరు కలిసి 8వ వికెట్‌కు 99 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఆలౌటైన వెంటనే రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా.. పాండ్య ధాటికి 59 పరుగు లకే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు మర్‌క్రమ్ (34), ఎల్గర్ (25)లను పాండ్య పెవిలియన్ దారి పట్టించాడు. ఆట ఆఖరుకు దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. ఇప్పటికి భారత్‌పై 142 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి.

దూకుడే మంత్రం

పాండ్య వీరోచిత బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. ఉదయం సెషన్లో దక్షిణాఫ్రికా కీలక పుజారా (26, 92 బంతుల్లో, 5 ఫోర్లు) తీశారు. కానీ పాండ్య తిరుగులేని బ్యాటింగ్‌తో టీ విరామానికి భారత్ స్కోరును 185-7కు చేర్చాడు. అప్పటికి టీమ్‌ఇండియా ఇంకా 101 పరుగులు వెనుకబడింది. 15 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇచ్చిన క్యాచ్‌ను డీన్ ఎల్గర్ జారవిడడంతో పాండ్యకు జీవనదానం లభించింది. అయినా పాండ్య దూకుడు తగ్గించుకోలేదు. తొలి రోజు డివిలియర్స్, డు ప్లెసిస్ ఎదురుదాడిని చూసిన పాండ్య అదే బాటను ఎంచుకున్నాడు. ఫిలాండర్ (3-33) బౌలింగ్‌లో ఒకే ఓవర్లో మూడు బౌండరీలు సాధించి తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పాడు. మోర్నీ మోర్కెల్ (2-57) తనను పరీక్షించడానికి వేసిన షార్ట్ బంతిని పాండ్య తలపై నుంచి బౌండరీ దాటించాడు. అది అతనికి నాలుగో బౌండరీ. పాండ్య మిడాఫ్‌లోకి బంతిని బౌండరీ దాటించి 46 బంతుల్లో టెస్టుల్లో రెండో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. రెండో రోజు మూడు వికెట్లు పడగొట్టిన రబాడ (3-34)ను సైతం పాండ్య విడిచి పెట్టలేదు. అతని బౌలింగ్‌లోనూ థర్డ్ మ్యాన్ దిశగా కళ్లు చెదిరే బౌండరీ సాధించాడు. మరో వైపు భువీ గోడలా నిలబడడంతో పాండ్యకు దూకుడు సాధ్యమైంది. భువీ తొలి పరుగు చేయడానికి 34 బంతులు ఆడాడు. రబాడ బౌలింగ్‌లో కవర్ డ్రైవ్‌తో బౌండరీ సాధించాడు. వీరిద్దరు పేసర్లను అలవోకగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోవడంతో ఈ జోడీని విడదీయడానికి కెప్టెన్ డు ప్లెసిస్.. స్పిన్నర్ మహరాజ్‌ను ప్రవేశ పెట్టాడు. కానీ అతను ఓ ఓవర్లో ఏకంగా 12 పరుగులు సమర్పించుకున్నాడు. మహరాజ్ ఓవర్లో పాండ్య ఓ సిక్స్, ఫోర్ సాధించాడు. ఆ ఓవర్లో పాండ్యకు 73 పరుగుల వద్ద మరోసారి డి కాక్ ద్వారా జీవనదానం లభించింది. 67వ ఓవర్లో భువీ ఔటైన కొద్ది సేపటికే పాండ్య సెంచరీ పూర్తి కాకుండానే రబాడ బౌలింగ్లో 9వ వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 199-9. పాండ్య, కుమార్ ఔటవ్వడంతో భారత్ శిబిరంలో ఇన్నింగ్స్‌పై ఆశలు సన్నగిల్లాయి. అందుకు తగినట్టే మరో 10 పరుగులకే టీమ్‌ఇండియా కథ ముగిసింది. తొలి టెస్టు ఆడుతున్న బుమ్రా 2 పరుగులకే వెనుదిరిగాడు. 209 పరుగులకు ఆలౌట్ కావడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు భారత్ 77 పరుగులు వెనుకబడింది.

పుజారా పోరాటం

ఉదయం ఓవర్ నైట్ స్కోరు 28-3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. మరో 30 పరుగులకు రోహిత్ (11) వికెట్‌ను కోల్పోయింది. రోహితీ 59 బంతులాడినా 11 పరుగులే చేశాడు. మరో వైపు పుజారా దక్షిణాఫ్రికా బౌలర్లను ప్రతిఘటించాడు. 92 బంతులెదుర్కొని 26 పరుగులు సాధించాడు.

76 పరుగుల వద్ద ఫిలాండర్ బౌలింగ్‌లో ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. అనంతరం పాండ్య కంటే ముందొచ్చిన అశ్విన్ (12) ఎక్కువ సేపు నిలవలేదు. సాహాను స్టెయిన్ డకౌట్ చేశాడు. ఫిలాండర్, రబాడ మూడేసి వికెట్లు తీశారు.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, ధావన్ (సి అండ్ బి) స్టెయిన్ 16, పుజారా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, కోహ్లి (సి) డి కాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ (ఎల్బీ) (బి) రబాడ 11, అశ్విన్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 12, పాండ్య (సి) డి కాక్ (బి) రబాడ 93, సాహా (ఎల్బీ) (బి) ,స్టెయిన్ 0, భువనేశ్వర్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 25, షమి నాటౌట్ 4, బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబాడ 2, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం (73.4 ఓవర్లలో ఆలౌట్) 209, **వికెట్ల పతనం:** 1-16 (విజయ్), 2-18 (ధావన్), 3-27 (కోహ్లి), 4-57 (రోహిత్), 5-76 (పుజారా), 6-81 (అశ్విన్), 7-92 (సాహా), 8-191 (భువనేశ్వర్), 9-199 (పాండ్య), 10-209 (బుమ్రా).

బౌలింగ్: ఫిలాండర్ 14.3-8-33-3, స్టెయిన్ 17.3-6-51-2, మోర్కెల్ 19-6-57-2, రబాడ 16.4-4-34-3, మహరాజ్ 6-0-20-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34, ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్య 25, రబాడ బ్యాటింగ్ 2, ఆమ్లా బ్యాటింగ్ 4, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 65

వికెట్ల పతనం: 1-52 (మర్‌క్రమ్), 2-59 (ఎల్గర్)

బౌలింగ్: కుమార్ 6-3-16-0, బుమ్రా 4-0-14-0, షమి 5-1-15-0, పాండ్య 4-0-17-2, అశ్విన్ 1-0-3-0.

ఖవాజా సెంచరీ

- చివరి టెస్టుపై పట్టు బిగిస్తున్న ఆసీస్



సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో చివరి టెస్టు దాదాపు ఆస్ట్రేలియా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఉస్మాన్ ఖవాజా (171, 381 బంతుల్లో, 18 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీ నమోదు చేయడంతో శనివారం మూడో రోజు ఆఖరుకు ఆసీస్ 4 వికెట్లకు 479 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇప్పటికే ఇంగ్లండ్‌పై 133 పరుగుల ఆధిక్యం సంపాదించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. ఖవాజా.. యాషెస్‌లో తొలి శతకం సాధించాడు.

మార్ష్ సోదరులు షాన్ (98 బ్యాటింగ్, 207 బంతుల్లో, 10 ఫోర్లు), మిచెల్ (63 బ్యాటింగ్, 87 బంతుల్లో, 9 ఫోర్లు, 2 సిక్స్) అర్ధసెంచరీలు సాధించి ఇంకా క్రీజులో ఉన్నారు. ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 193-2తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. మూడో రోజు రెండే రెండు వికెట్లు కోల్పోయింది. ఓవర్ నైట్ స్కోరు 44 పరుగులతో క్రీజులోకి అడుగుపెట్టిన కెప్టెన్ స్మిత్ (83, 158 బంతుల్లో, 5 ఫోర్లు) అర్ధసెంచరీ పూర్తి చేసుకొని సెంచరీ దిశగా సాగిపోతున్న తరుణంలో స్పిన్నర్ అలీ అతణ్ని ఔట్ చేశాడు. అలీ బౌలింగ్లో అతనికే క్యాచ్ ఇచ్చి స్మిత్ వెనుదిరిగాడు. ఖవాజాతో కలిసి స్మిత్ మూడో వికెట్‌కు 188 పరుగులు జోడించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షాన్ మార్ష్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 101 పరుగు జత చేసి ఖవాజా వెనుదిరిగాడు. తర్వాత షాన్, మిచెల్ కలిసి ఐదో వికెట్‌కు అజేయంగా 104 పరుగులు జోడించారు. 1993లో లీడ్స్ టెస్టు తర్వాత ఆసీస్ జట్టు యాషెస్‌లో 3, 4, 5 వికెట్లకు సెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేయడం ఇదే తొలిసారి.

అతనికీ శతకం ప్రత్యేకం: ఏడేళ్ల క్రితం సిడ్నీలోనే టెస్టు అరంగేట్రం చేసిన ఖవాజాకు ఈ సెంచరీ ఎంతో ప్రత్యేకమైంది. యాషెస్‌లో శతకం సాధించాలన్నది అతని కల. అరంగేట్రం చేసిన సిడ్నీలోనే తన కలను సాకారం చేసుకోగలగడంతో ఖవాజా ఈ శతకాన్ని ప్రత్యేకమైనదిగా భావిస్తున్నాడు. దీనికి తోడు మ్యాచ్‌పై పట్టు బిగించేందుకు జట్టుకు తన సెంచరీ తోడ్పాటునందించడంతో తన సంతోషం రెట్టింపైందని ఖవాజా అంటున్నాడు. పాక్‌లో జన్మించిన ఈ 31 ఏళ్ల ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మన్ 515 నిమిషాలు క్రీజులో ఉండి 381 బంతులనెదుర్కొన్నాడు. 2015లో బ్రిస్బేన్‌లో న్యూజిలాండ్‌పై సాధించిన అత్యధిక టెస్టు స్కోరు 174కు మూడు పరుగుల దూరంలో ఆగిపోయాడు. అరంగేట్రంలో అతను 37 పరుగులు చేశాడు. ఇంతవరకు 29 టెస్టులాడిన ఖవాజా కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాడు.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 346, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** బాన్‌క్రాఫ్ట్ (బి) బ్రాడ్ 0, వార్నర్ (సి) బెయిర్‌స్టో (బి) అండర్సన్ 56, ఖవాజా (స్టంప్డ్) బెయిర్‌స్టో (బి) క్రేన్ 171, స్మిత్ (సి అండ్ బి) అలీ 83, షాన్ మార్ష్ బ్యాటింగ్ 98, మిచెల్ మార్ష్ బ్యాటింగ్ 63, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం (157 ఓవర్లలో 4 వికెట్లకు) 479.

వికెట్ల పతనం: 1-1, 2-86, 3-274, 4-375,

బౌలింగ్: అండర్సన్ 30-11-52-1, బ్రాడ్ 23-2-70-1, అలీ 37-9-125-1, కుర్రన్ 20-2-71-0, క్రేన్ 39-3-135-1, రూట్ 8-3-21-0.

నార్త్‌ఈస్టర్న్ వారియర్స్‌కు తొలి విజయం

- తృటిలో ఓటమి తప్పిన అక్సెల్‌సెన్
- ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ 3



చెన్నై: ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబీఎల్) 3 సీజన్‌లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్ తొలి గెలుపును సొంతం చేసుకుంది. శుక్రవారం రాత్రి ఇక్కడి నెహ్రూ ఇండోర్ స్టేడియంలో వారియర్స్ 3-2 తేడాతో బెంగళూరు బ్లాస్టర్స్‌పై గెలిచింది. బెంగళూరు బ్లాస్టర్స్ ఆటగాడు, ప్రపంచ నెంబర్ వన్ విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) ఓటమి కోరల నుంచి బయట పడ్డాడు. జు వీ వాంగ్‌తో జరిగిన పోరులో అక్సెల్‌సెన్ మొదటి గేమ్‌ను చేజార్చుకున్నాడు. వాంగ్ కళ్లు చెదిరే డ్రాప్ షాట్లతో, సుదీర్ఘ ర్యాలీలతో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేశాడు. ప్రత్యర్థి షాట్లకు ప్రపంచ నెంబర్ వన్ వద్ద సమాధానమే లేకపోయింది. దీంతో విక్టర్ అనేక తప్పిదాలు చేసి తొలి గేమ్‌ను వాంగ్‌కు సమర్పించ కున్నాడు. రెండో గేమ్‌లో విక్టర్ పుంజుకున్నాడు. తనకే సాధ్యమైన ఆటతో వాంగ్‌ను ముప్పుతిప్పలు పెట్టి రెండో గేమ్‌ను దక్కించుకున్నాడు. నిర్ణయాత్మక చివరి గేమ్‌లో విక్టర్ తీవ్రంగా శ్రమించాడు. ఓ దశలో వాంగ్ రెండు సార్లు ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ విక్టర్ ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండు పాయింట్లు సాధించి స్కోరును 10-10తో సమం చేశాడు. అక్కడి నుంచి పోరు రసవత్తరంగా సాగింది. చివరికి మ్యాచ్‌ను విక్టర్ 9-15, 15-13, 15-14తో సొంతం చేసుకున్నాడు. అంతకుముందు అజయ్ జయ రామ్ (వారియర్స్) 15-8, 15-13తో చాంగ్ వీ ఫెంగ్‌పై గెలిచాడు. మిచెలీ లి (వారియర్స్) 7-15, 15-14, 15-13తో కిర్టి గిల్‌మోర్‌పై గెలిచాడు. బ్లాస్టర్స్ తరపున మిక్స్‌డ్ డబుల్స్‌లో మను అత్రి, సిక్కి రెడ్డి జోడీ 12-15, 15-8, 15-9తో ప్రజక్త్ సావంత్, షిన్ బీక్ చోల్‌పై విజయం సాధించింది.



సస్నోవిచ్ జోరుకు స్వితోలినా బ్రేకు

ఫైనల్లో ఓటమి
బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టెన్నిస్



బ్రిస్బేన్: బ్రిస్బేన్ ఇంటర్నేషనల్‌లో బెలారస్ క్వాలిఫయర్ అలియాక్సండ్రా సస్నోవిచ్ జోరుకు బ్రేకు పడింది. శనివారం జరిగిన ఫైనల్లో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్వితోలినా 6-2, 6-1తో సస్నోవిచ్‌ను చిత్తు చేసింది. గత ఏడాది డబ్ల్యూటీఏ టూర్‌లో ఐదు టైటిల్స్ సాధించిన స్వితోలినా ఫైనల్లో తిరుగులేని ఆట ఆడింది. కేవలం 65 నిమిషాల్లో ప్రత్యర్థిని మట్టికరిపించి కెరీర్‌లో పదో టైటిల్‌ను వశం చేసుకుంది. సెమీస్‌లో స్వితోలినా 7-5, 7-5తో చెక్ క్రీడాకారిణి కరోలినా ప్లిస్కోవాపై గెలిచింది. 2017లో టైటిళ్ల సాధనలో మహిళల్లో స్వితోలినాదే అగ్రస్థానం. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో ర్యాంకుతో గత ఏడాదిని ముగించింది.

'టాప్స్'కు పీటీఉష గుడ్‌బై



న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు తేగల క్రీడాకారులను గుర్తించి సానపెట్టడడం కోసం ఏర్పాటైన టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) నుంచి దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష కూడా వైదొలగింది. విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు ఎదురవుతాయన్న ఆలోచనతో ఆమె టాప్స్ సభ్యత్వంతో పాటు అథ్లెటిక్స్‌కు జాతీయ పరిశీలకురాలి పదవికి కూడా ఉష రాజీనామా చేసింది. కోజికోడ్‌లో ఉషా స్కూల్ ఆఫ్ అథ్లెటిక్స్‌ను నడుపుతున్న ఉష... విరుద్ధ ప్రయోజనాల అంశం తెరపైకి వస్తుందన్న అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఉష అకాడమీలో శిక్షణ తీసుకున్న అగ్రశ్రేణి మహిళా అథ్లెట్లు టింటు లూకా, జిష్నా మాథ్యూ క్రమం తప్పకుండా నేషనల్ మీట్స్‌లో పాల్గొనే భారత అథ్లెటిక్స్ బృందానికి ఎంపికవుతున్నారు. ఈ అకాడమీలో శిక్షణ పొందుతున్న మరో 16 మంది అథ్లెట్లు కూడా భారత సెలెక్షన్ కమిటీ తలపులు తడుతున్నారు. డిసెంబరు చివరి వారంలో తాను జోడు పదవులకు రాజీనామా చేశానని ఉష వెల్లడించింది. ఐతే ఆలిండియా కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ (ఏఐసీఎస్) లో మాత్రం ఆమె కొనసాగుతుంది. ఈ కౌన్సిల్‌కు వీకే మల్హోత్రా చైర్మన్‌గా ఉన్నారు. ఖేలో ఇండియా ప్రాజెక్ట్ సభ్యురాలిగా కూడా ఉష కొనసాగుతుంది.

తొలి వన్డేలో పాక్‌పై కివీస్ గెలుపు

వెల్లింగ్టన్: వన్డేల్లో పాకిస్థాన్ 9 వరుస విజయాలకు న్యూజిలాండ్ ముగింపు పలికింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ డక్‌వర్త్ లూయిస్ విధానంలో 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా కివీస్ 7 వికెట్లకు 315 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (115, 117 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించా డు. పాక్ 30.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులతో ఆడుతున్న సమయంలో వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోయింది. అప్పటికి పాక్ డక్‌వర్త్ ప్రకారం గెలవాలంటే 227 స్కోరు చేయాలి. దీంతో కివీస్ 61 పరుగుల తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. ఫకర్ జమాన్ 82 పరుగులతో, ఫహీమ్ అష్రఫ్ 17 పరుగులతో నాటౌట్‌గా మిగిలారు. సౌథీ (3-22) మూడు వికెట్లు దక్కించుకున్నాడు.

'మూడు' కోల్పోయిన దక్షిణాఫ్రికా కోచ్



కేప్‌టౌన్: భారత్‌తో తొలి టెస్టులో మొదటి రోజు దక్షిణాఫ్రికా 12 పరుగులకే 3 వికెట్లు కోల్పోవడంతో నిరాశ చెందిన ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ డేల్ బెన్‌కెన్‌స్టిన్.. హోటల్‌కు వెళ్లిపోతానని పట్టుపట్టాడు. ''జట్టు 12 పరుగులకే 3 వికెట్లు కోల్పోవడం ఉండగా బ్యాటింగ్ కోచ్‌గా నాకు నచ్చలేదు. టాక్సీ తీసుకొని హోటల్‌కు వెళ్లిపోదామనుకున్నాను. ఈ వికెట్‌పై మేం ఎలా పరుగులు చేస్తామో నాకు అర్థం కాలేదు'' అని బెన్‌కెన్‌స్టిన్ చెప్పాడు. ''భారత బౌలర్లు నాణ్యమైన బౌలర్లు. ఏబీ డివిలియర్స్ క్లాస్, డు ప్లెసిస్ మొండితనం మ్యాచ్ పరిస్థితిని మార్చాయి. దక్షిణాఫ్రికా గాడిలో పడడానికి ప్రధానంగా డివిలియర్స్ ఇన్నింగ్సే కారణమని కొనియా డాడు. ''భువనేశ్వర్ వేసిన ఓ ఓవర్లో డివిలియర్స్ సాధించిన 17 పరుగులే మ్యాచ్ గతిని మార్చేశాయి. దక్షిణాఫ్రికా 286 స్కోరు గొప్పతనం ఏబీదే'' అని బెన్‌కెన్‌స్టిన్ చెప్పాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



నిన్న తుపాకీ → నేడు సినీ షూటింగ్!

మెహరీన్

Lively Interaction For Ever

ఆంధ్రప్రభ

lifepage2012@gmail.com

లైఫ్ I

ఆదివారం 7 జనవరి 2018

టాలీవుడ్‌లో భవిష్యత్ నాదేనంటూ గర్వంగా ప్రకటిస్తోంది అందాల భామ మెహరీన్. ఆమె ఇలా చెప్పుకునేంత ధైర్యన్నిచ్చాయి వరుస విజయాలు. నాని సరసన కృష్ణగాడి వీర ప్రేమగాథ చిత్రంతో తెరంగేట్రం చేసింది పంజాబీ సుందరి. 2016లో ఒక్క చిత్రమూ లేని మెహరీన్ తరువాతి ఏడాదంతా స్టార్ హీరోల సరసన నటించి పేరు తెచ్చుకుంది. ప్రేక్షకులను ఆకట్టుకుని అగ్ర నాయికగా ఎదిగింది. శర్వానంద్‌తో నటించిన మహానుభావుడు, రవితేజ సరసన చేసిన రాజా ది గ్రేట్ బాక్సాఫీస్ హిట్స్‌గా మారాయి. మెహరీన్ దశ తిరిగి... కావాల్సినన్ని అవకాశాలు చేతికొచ్చాయి. దీంతో చెప్పరాని సంతోషంలో ఉంది సుందరి. ఇంతకంటే ఎక్కువగా ఇంకేం కోరుకోను అంటోంది. ప్రస్తుతం తనకు దక్కిన గుర్తింపు నటిగా తన బాధ్యతను మరింత పెంచిందని చెబుతోంది. తీరిక లేకుండా ఉండటమే ఎక్కువ ఆనందాన్ని ఇస్తోందని, పని లేకుంటే నేను లేను... అంటోన్న మెహరీన్...నట ప్రయాణం, వ్యక్తిగత విశేషాలు ఆంధ్రప్రభ లైఫ్ పాఠకులకోసం-



పంజాబీ కుటుంబంలో పుట్టిన నేను మగరాయుడిలా పెరిగాను. చేతులకు గోరింటాకు, గోర్లకు రంగు వేసుకోవడం ఎప్పుడూ తెలియదు. సాహసవంతమైన ఆటలు ఆడేదాన్ని. ఇంట్లో ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడ నేర్చుకోవాలనే షరతు ఉండేది. చాలా మంది అమ్మాయిలు దూరంగా ఉండే షూటింగ్ క్రీడను నేను ఎంపిక చేసుకున్నాను. మంచి తుపాకి కొని సాధన చేసేదాన్ని. అలా జాతీయస్థాయి పోటీల దాకా వెళ్లాను. ప్రధాన టోర్నమెంట్ జరిగే సమయానికి పరీక్షలు రావడం వల్ల షూటింగ్ క్రీడకు దూరమయ్యాను.

ఆ భయం లేదు...

షూటింగ్ క్రీడ తర్వాత నా ఆసక్తి మోడలింగ్ సినిమాల పైకి మళ్లింది. తెలుగులో కొత్త నాయిక కోసం చూస్తున్నారని తెలుసుకుని ఆడిషన్‌కు వెళ్లాను. అలా కృష్ణగాడి వీర ప్రేమగాథలో అవకాశం వచ్చింది. అమెరికాలో చాలా ఏళ్లు ఉన్నాను కాబట్టి నా అలవాట్లు, వేష ధారణలో పాశ్చాత్య ధోరణి కనిపించేది. కానీ తొలి చిత్రంలో వచ్చిన పాత్ర పల్లెటూరి అమ్మాయి, లంగా వోణి వేసుకుంటుంది, కోపమెక్కువ, అనుకున్నది సాధించాలనుకుంటుంది. ఇలా నేను పెరిగిన వాతావరణానికి పూర్తి భిన్నమైన పాత్ర తొలి చిత్రంలో చేశాను. ఈ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు...దీని ప్రభావం రాబోయే సినిమాలపై పడుతుందా అనే సందేహం ఎప్పుడూ కలగలేదు. ఎందుకంటే నటన అంటేనే ప్రతిసారీ కొత్తగా కనిపించడం. ఒక్క తరహాకు పరిమితం చేస్తారని భయపడితే పరిశ్రమలో ఏదీ సాధించలేం.

2017 నా సంవత్సరంగా మారింది...

తొలి సినిమా విడుదలయి ఘన విజయం సాధించింది. ఆ తర్వాత తెలుగు, తమిళంలో కొన్ని కథలు విన్నాను. ఇంతలో బాలీవుడ్ నుంచి ఫిల్లూరి అనే చిత్రంలో అవకాశం వచ్చింది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా నాకు బాలీవుడ్‌లో చాలా గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పటికీ ముంబై వెళితే ఫిల్లూరి నటిగానే గుర్తుపడతారు. తొలి సినిమా విజయం తర్వాత సినిమాలు ఒప్పుకునేందుకు తొందరపడలేదు. నాకు నచ్చి, కథ, పాత్ర బాగుంటుంది అని నమ్మిన చిత్రాలే ఒప్పుకున్నాను. అలా ఒక ఏడాదంతా నా సినిమాలేవీ రాలేదు. అప్పుడు కొంత కంగారు పడ్డాను. సినిమాలు అంగీకరించినా...అవి ప్రారంభం కావడానికి ఆలస్యమవుతూ వచ్చింది. ఆ కొరత గతేడాది తీరిపోయింది. ప్రతి రెండు వారాలకు నా సినిమా ఒకటి తెరపైకి వచ్చింది. అలా 2017 పూర్తిగా నాదే అయ్యింది.

ఇప్పుడు ప్రతి ఉదయం ఉత్సాహమే...

నటిగా మారడం నా జీవితాన్ని మార్చేసింది. ఏ పనిలోనైనా ఏకాగ్రతగా ఉండటం, సమయాన్ని మరింత ఉపయోగించుకోవడం నేర్చుకున్నాను. నన్ను ఎప్పుడైతే ప్రేక్షకులు గుర్తించడం మొదలుపెట్టారో...అప్పటినుంచి నటిగా నా బాధ్యత పెరిగింది. చేసే పాత్రల్లో, ఎంచుకునే సినిమాల్లో ఇంకా శ్రద్ధ తీసుకోవడం మొదలుపెట్టాను. నాకు తీరికగా ఉండటం నచ్చదు. ఎప్పుడూ పనిచేస్తుండాలి. ఒకేసారి ఎక్కువ సినిమాలు చేయడాన్ని, ఒక చిత్రం నుంచి మరో చిత్రానికి ప్రయాణించడాన్ని ఆస్వాదిస్తాను. ఎప్పుడైనా తీరిక దొరికితే కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గడుపుతుంటాను. ప్రయాణాలు చేయడం బాగా ఇష్టపడతాను. నటిగా మారిన తర్వాతే ప్రతి ఉదయం ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా నిద్రలేస్తున్నాను.

కాజల్‌లా ఉండటం సంతోషమే కానీ...

నేను కాజల్‌లా ఉంటానని చెప్పడం సంతోషంగా అనిపిస్తుంటుంది. దశాబ్దానికి పైగా దక్షిణాది ప్రేక్షకులను అలరిస్తోంది కాజల్. ఆమెలా నేనూ ఎదిగితే అంతకన్నా కావాల్సింది ఏముంది. కాజల్ ఇప్పటికీ తన సత్తా చూపిస్తోంది. ఇక నుంచి నేనూ నా సామర్థ్యాన్ని చూపిస్తాను (నవ్వుతూ). ముఖ కవళికలు ఒకలా ఉన్నంత మాత్రాన నా అవకాశాలు ఆమెకు, ఆమె సినిమాలు నాకు ఇవ్వరు. ఎవరి ప్రతిభ వారికి ఉంటుంది. నేను చేసిన పాత్రలు కాజల్ చేయలేదు. ఆమెలా నేను నటించలేను.

అవి చెప్పను...

ప్రస్తుతానికి ఎవరి ప్రేమలోనూ పడలేదు. నా ప్రేమంతా సినిమాల మీదే. పెళ్లి చేసుకునే వయసు వచ్చిందని అనుకోను. నాకు కావాల్సిన వాడు బాగా నవ్వించాలి. ముఖ్యంగా నన్ను భరించగలగాలి. ఎందుకంటే నేను చాలా అల్లరి పిల్లను. నా పనులకు విసిగిపోకుండా ఉండాలి. మహిళలను గౌరవించే ప్రతి అబ్బాయి మంచివాడే అని నా అభిప్రాయం. కాబోయే వాడిలో కోరుకునే లక్షణాలు చాలా ఉన్నాయి. అవి చెప్పకూడదు.

ఆ సినిమాలో ఉపాధ్యాయురాలిగా...

2017లో బాలీవుడ్‌తో సహా దక్షిణాది సినిమాలు మర్చిపోలేని జ్ఞాపకాలను అందించాయి. ప్రస్తుతం గోపీచంద్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నాను. ఇందులో ఉపాధ్యాయురాలి పాత్రలో కనిపించబోతున్నాను. సామాజిక సేవలో భాగమయ్యే యువతి పాత్ర ఇది. కథానాయకుడితో కలిసి సామాజిక కార్యక్రమాలు చేస్తుంటాను. ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమవుతుంది. ఇప్పటిదాకా నేను నటించిన కామెడీ, రొమాంటిక్, హాస్య తరహా పాత్రలకు భిన్నంగా ఉంటుంది.

దక్షిణాదికే ప్రాధాన్యత

తెలుగు, తమిళం, హిందీలో సినిమాలు చేశాను. వీటిలో టాలీవుడ్ నాకు అమ్మ లాంటిది. మెహరీన్ అనే నాయిక పుట్టింది తెలుగులోనే. చాలా మంది నాయికలు దక్షిణాదిని మైదానంలా చూస్తారు. ఇక్కడ సాధన చేసి బాలీవుడ్‌కి వెళ్దామని అనుకుంటారు. కానీ నేను ఫిల్లూరి చిత్రంలో నటించాక దక్షిణాదికే ప్రాధాన్యమిచ్చాను.

రమేష్ గోపిశెట్టి

మెహరీన్ మాటల్లో హీరోలు..



నాని : నా తొలి చిత్ర కథానాయకుడిగా నాని అంటే నాకెప్పుడూ ప్రత్యేకమే. మొదటి సినిమా చిత్రీకరణ సమయంలో ఎంతో ప్రోత్సహించారు. ప్రతిభావంతమైన నటుడు.



రవితేజ : నేను ఎక్కువగా అభిమానించే కథానాయకుడు. దివ్యాంగుడి పాత్రలోనూ ప్రేక్షకులు అతన్ని చూసేందుకు ఆసక్తి చూపించారు. ఆయనతో నటించిన రాజా ది గ్రేట్ నాకు మంచి విజయాన్నిచ్చింది.




శర్వానంద్ : నాకు మంచి స్నేహితుడు. మేము ఎప్పుడు కలిసినా సరదాగా ఉంటాం. బాగా కలిసిపోతాం.


సల్మాన్ ఖాన్: నా అభిమాన కథానాయకుడు , నిజం చెప్పాలంటే నా అభిమాన తారల జాబితా చాలా పెద్దది..

రంగవల్లి

15 చుక్కలు
15 వరుసలు




దామరాజు రస్మిత
ఎ ఎస్ రావు నగర్
హైదరాబాద్



14 చుక్కలు
6 వరుసలు
6 వచ్చే వరకు

మద్దుల పద్మావతి
కొత్తపేట, తెనాలి



19 చుక్కలు
1 వచ్చేవరకు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

గుడిపాటి నాగలలిత
ఇ.సి.ఐ.ఎల్
హైదరాబాద్



16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చే వరకు

యోగా టైమ్

రెండు ఆసనాలు..మెండు ఫలితాలు!



గాయత్రి
యోగా ట్రైనర్

సుప్త ఉదరాకర్షణాసనం

రెండు కాళ్లను చాచి ప్రశాంతంగా పడుకోవాలి. తరవాత రెండు చేతులూ భుజాలకు ఇరుపక్కలా విశాలంగా చాపాలి. ఇప్పుడు రెండు మోకాళ్లు. పాదాలను కలిపి ఉంచి...మోకాళ్ల వద్ద వంచుతూ నడుము కింది భాగం నుండి శరీరాన్ని కుడివైపుకి తిప్పుతూ... రెండుకాళ్లు కుడివైపున ఒకదానిపై ఒకటి వచ్చేలా చేస్తూ నేలకు ఆనించాలి. ఇలా చేస్తున్నపుడు శ్వాసను వదలాలి. ఈ స్థితిలో తలను ఎడమవైపుకి తిప్పి ఉంచాలి. అలా ఉండగలిగినంతసేపు ఉండి...శ్వాస తీసుకుంటూ కాళ్లను ఎత్తి...ఇప్పుడు ఎడమవైపుకి వంచాలి. తలను కుడివైపుకి తిప్పాలి. ఇలా పదిసార్లు చేయాలి.

శవ ఉదరాకర్షణాసనం

ముందుగా రెండుకాళ్లనూ చాచి వెల్లకిలా హాయిగా పడుకోవాలి. చేతులను మోచేతుల వద్ద మడిచి...ఒక చేతి వేళ్లను మరొక చేతి వేళ్లతో పట్టుకుని తలకింద పెట్టుకోవాలి. రెండు మోచేతులను నేలకు ఆనేలా ఉంచాలి. ఇప్పుడు కుడి మోకాలిని మడిచి...చాచి ఉన్న ఎడమ మోకాలి వద్ద కుడి పాదం ఉండేలా వంచాలి. ఇప్పుడు కుడి మోకాలు నేలకు తాకుతున్నట్టుగా ఉంటుంది. ఈ స్థితిలో తల కుడివైపుకి తిప్పి ఉంచి ఎడమచేత్తో కుడి మోకాలిని పట్టుకోవాలి. శ్వాస సాధారణ స్థితిలో ఉండాలి. తరువాత కుడికాలుని నిటారుగా ఉంచి... ఎడమ మోకాలిని కూడా వంచుతూ...ఇలాగే చేయాలి. కాలుని కిందికి దించేటప్పుడు శ్వాసని వదులుతూ...కాలుని పైకెత్తేటప్పుడు శ్వాసని తీసుకుంటూ ఉండాలి. మొదట ఒకటి లేదా రెండు సార్లు చేస్తూ...ఆ తరువాత పెంచుకుంటూ పోవాలి.



మోడల్ :స్నేహిత

ఉపయోగాలు

ఈ రెండు ఆసనాలు పొట్టకండరాలను గట్టిపరుస్తాయి. పొట్టలోపలి అవయవాలకు మేలు చేస్తాయి. ఆకలిని పెంచుతాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. నిద్రబాగా పడుతుంది. ఎక్కువ సమయం కూర్చోవటం వలన కలిగే అలసట, కండరాలు బిగదీసుకుపోవటం లాంటి సమస్యలు తగ్గుతాయి.

చింతన

దినఫలాలు

మేష రాశి: ఆర్థికలావాదేవీలు, దూరప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయ ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. . గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిసితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.

8.1.2018 సోమవారం

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహవిషయాల్లో చిరు ఇబ్బందులు ఏర్పడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు అనుకూలం. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీలు ఉపకరిస్తాయి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరుసమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యపరీక్షలు ఉపకరిస్తాయి. గృహవిషయాలు అనుకూలం. కుటుంబ వ్యవహారాల్లో, ఆరోగ్యంలో శ్రద్ధ తప్పని సరి. కోర్టు వ్యవహారాల్లో విజయాలు సాధించగలుగుతారు. ఆర్థిక విషయాల్లో సమస్యలను అధిగమించగలుగుతారు.

కర్కాటక రాశి: గృహ సంబంధిత కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. వ్యాపార లావాదేవీలు కలసి వస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఆనందకర పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. శత్రుభీతిపోతుంది. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించ గలుగుతారు.

కన్యా రాశి: ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు, సంభాషణలు అనుకూలం. వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. స్థిరాస్తి ప్రతికూల పరిస్థితులు ఇంకా కొనసాగుతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ తప్పనిసరి. వ్యాపారంలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్లు వంటివి లాభిస్తాయి. విద్యాప్రయత్నాలు అనుకూలం. విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. గృహవిషయాల్లో ప్రోత్సాహం ఉంటుంది. విద్యావిషయాల్లో మెరుగైన పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. వ్యాపార, ఉద్యోగ ప్రతిబంధకాలు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో అనుకూల పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: వ్యాపార నిర్ణయాలలో ప్రతికూలత ఉంటుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని పొరపాట్ల ద్వారా విమర్శలు కొనసాగుతాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు ప్రయత్నంతో సాధ్యం.

మకర రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్య రక్షణ ఉంటుంది. వ్యాపార ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ఆర్థిక అసహన పరిస్థితులు కనుమరుగవుతాయి. గృహ విషయాల్లో శుభ ప్రయత్నాలు లాభిస్తాయి. పొరపాట్లు అనుకూలంగా మార తాయి. ఆదాయం సులభతరం.

కుంభరాశి: నూతన వాహనకొనుగోళ్ళు సంతృప్తిని కలిగిస్తాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. సంతోషవార్తలు వింటారు. స్త్రీలకు శుభపరిణామాలు ఉంటాయి. ఆకస్మిక ఆరోగ్య ఆందోళన ఉంటుంది. విజయాలు అన్ని రంగాల వారికి దగ్గరవుతాయి. ప్రత్యర్థుల ద్వారా చిరుసమస్యలు ఉంటాయి. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రోత్సాహ పరిసితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: మానసిక ధైర్యం పెరుగుతుంది. ఉద్యోగ వ్యవహారాల్లో ప్రోత్సాహం ఉంటుంది. ఆలోచన సంపత్తి పెరుగుతుంది. ఆరోగ్య అనుకూలత ఉంటుంది. చిరుసమస్యలు ఆర్థికంగా కొనసాగుతాయి. విద్యా విషయాల్లో ఆటంకాలు ఉన్నా నెట్టుకురాగలుగుతారు. కోర్టు వ్యవ హారాల్లో ఆందోళనలు ఉంటాయి. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

జీవితం పూర్వనిర్దేశితమే

కాలం ఎవరికోసమూ ఆగదు మన శక్తుల్ని ఎలా నిర్వహించుకుంటాం. ఏ దిశలో వాటిని కేంద్రీకరిస్తాం. మనం వాటిని వృద్ధి చేసుకుంటామా, తరిగించుకుంటామా- అంతా మన చేతుల్లోనే ఉంటుంది. కాని మన జీవితంలో అత్యంత ప్రధానమైన భాగం కాలం, ఇది మూడోది. ఇది ఎల్లప్పుడూ సాగుతూనే ఉంటుంది. మీరు దాన్ని వేగవంతం చేయలేరు. మెల్లగా నడిపించలేరు. మీరు మీ శక్తిని నిలువ చేసుకోవచ్చు. వృధా చేయవచ్చు. పెంచుకోవచ్చు. చాలా పెద్దదిగా చేసుకోవచ్చు. అల్పంగా కూడా చేసుకోవచ్చు. కాని కాలం మాత్రం జరిగిపోతూనే ఉంటుంది.



మనిషి పుట్టినప్పుడు అతనిలో ఒకనిర్దిష్టమైన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసి ఉంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ కాలం, శక్తి, సమాచారాల కలయిక. అది అతనితో పాటు కొనసాగుతుంది. జీవితంలోని వివిధ అంశాలను ఈ మూడూ కలిసి నిర్ణయిస్తాయి. ఒక మనిషి ఎంతకాలం జీవిస్తాడో, ఎలా జీవిస్తాడో కూడా ఈ మూడూ నిర్దేశిస్తాయి. సమాచారం కచ్చితంగా ముందు నిర్ణయింపబడిందే. అంటే మీరు కొత్త సమాచారం తీసుకోలేరని అర్థం కాదు. మీలో ఎటువంటి సమాచారం

సద్గురుబోధ

ఉన్నదో, దాన్ని బట్టి అది మిమ్మల్ని కొన్ని రకాల విషయాల వైపు లాగడమో, మరోవైపు నెట్టడమో జరుగుతుంది. అయితే మీరివ్వాళ, ఇప్పుడు కొత్త సమాచారం పోగు చేసుకోవడాన్ని ఇది ఆపదు.

ఈ మొత్తం సమాచార రాశినంతా కలిపి సంచిత కర్మ అంటారు. ఈ సమాచార స్వభావం ప్రకారం, జీవితంలోని వివిధ అంశాలకు శక్తిని కేటాయించడం జరుగుతుంది. ఒకవేళ మీ కర్మ సమాచారం గనక శారీరికత వైపు మొగ్గు చూపితే, మీలోని శక్తి సహజంగానే మీ శరీర నిర్మాణం వైపు కేటాయించుకుంటుంది. ఈ సమాచారం మీ మేధా ప్రక్రియ వైపు మొగ్గుచూపితే, దానికి తగినట్లు శక్తి తనను ఆ కార్యకలాపం వైపు కేటాయించుకుంటుంది. అది ఆధ్యాత్మిక కోణం వైపు మొగ్గుచూపితే, శక్తి కూడా తనను ఆ వైపే కేటాయించుకుంటుంది. ఈ కేటాయింపు సహజ ధోరణిలో జరుగుతుంది. కాని ఎవరైనా దీన్ని మరో విధంగా కేటాయించుకోలేరని అనలేము. అలా చేయవచ్చు. కాని పూర్వ నిర్దిష్ట రీతిలోనే మీరు వెళ్లినట్లయితే మీ జీవితం కూడా మళ్లీ అదేవిధంగా జరుగుతుంది. మీరు మీ ధోరణులకు 100శాతం బానిసలైతే మీ జీవితం పూర్వ నిశ్చితమే. ఏం జరుగుతుందో మనం తేలికగా ఊహించవచ్చు.

కాలం ఎవరికోసమూ ఆగదు

మన శక్తుల్ని ఎలా నిర్వహించుకుంటాం. ఏ దిశలో వాటిని కేంద్రీకరిస్తాం. మనం వాటిని వృద్ధి చేసుకుంటామా, తరిగించుకుంటామా- అంతా మన చేతుల్లోనే ఉంటుంది. కాని మన జీవితంలో అత్యంత ప్రధానమైన భాగం కాలం, ఇది మూడోది. ఇది ఎల్లప్పుడూ సాగుతూనే ఉంటుంది. మీరు దాన్ని వేగవంతం చేయలేరు. మెల్లగా నడిపించలేరు. మీరు మీ శక్తిని నిలువచేసుకోవచ్చు. వృధా చేయవచ్చు. పెంచుకోవచ్చు. చాలా పెద్దదిగా చేసుకోవచ్చు. అల్పంగా కూడా చేసుకోవచ్చు. కాని కాలం మాత్రం జరిగిపోతూనే ఉంటుంది.

కాలానికి సంబంధించి దాని మేధస్సు దానికుంటుంది. ఒక వ్యక్తి వ్యవస్థలో, అందుబాటులో ఉన్న శక్తి కేటాయింపు, కర్మ సమాచారాన్ని బట్టి అది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ విషయంలో మనమేమీ



చేయలేమా అంటే...? చేయగలం. కాని అది తక్కిన రెండు జీవనాంశాల కంటే కష్టం. తక్కిన రెండింటినీ నిర్వహించడం తేలిక. మనిషి జీవితంలో అవి వ్యక్తమవుతాయి. శక్తిని సృజించడం, దాన్ని మీ ఇష్టమొచ్చిన రీతిలో ఉపయోగించడం, మీ ధోరణులు మీ ఆలోచనా సరళిని మీ భావోద్వేగాలను, కార్యకలాపాలను నిర్ణయించడానికి అనుమతించడం, కాలాన్ని చేతిలో పెట్టుకోవడం కంటే చాలా తేలిక. చివరికి ఆదియోగి కూడా నిర్దిష్ట స్థితులలోనే కాలాన్ని తన ఆధీనంలో పెట్టుకున్నాడు. ఆయన అటువంటి స్థితులలో ఉన్నప్పుడు ఆయన్ని కాలభైరవుడంటాం.

ఒక వ్యక్తి ఆయుః ప్రమాణాన్ని, జీవన మరణాలను కాలం నిర్దేశిస్తుంది. జీవితం, మరణం రెండూ కాలం పరిధిలోనే ఉంటాయి. కాలంపై ఆధిపత్యం సంపాదించినవాడికి తన జీవితం, మరణంపై కూడా అధికారం ఉంటుంది. తన జీవన్మరణాలని తానే నిర్ణయించుకోగలడు. అదే తన శక్తులమీద ఆధిపత్యం ఉన్న వ్యక్తి, తన జీవిత స్వభావాన్నీ, జీవన విధానాన్నీ నిర్ణయించుకోగలడు. తన జీవితం మీద అతనికి సంపూర్ణాధికారం ఉంటుంది, కాని మరణం మీద ఉండదు.

తన సమాచారం మీద, లేదా ఆ సమాచారం ఏర్పరచిన ధోరణుల మీద అధికారం ఉన్నవాడు లేదా తాను మోస్తున్న కర్మ సమాచారం నుండి విముక్తుడైన వాడు తన జీవిత ప్రమాణాలపై ఆధిపత్యం సంపాదించగలడు. తాను లోపల ఆనందంతో ఉండాలా లేక దుఃఖంతో ఉండాలా అనేది తనే నిర్ణయించుకోగలడు. ఈ మూడు అంశాలూ కలిపితే జీవితం. మీరిప్పుడు ఈ మూడింటి సమాహారమే. తనలోని ఈ మూడు కోణాలనూ అర్థం చేసుకున్నవాడు, తాను కాలం, శక్తి, సమాచారాల సమాహారమని గ్రహించినవాడు ఈ మూడింటినీ స్పృహతో నడిపినట్లయితే అతడు అన్ని విధాలా విముక్తుడు. వంద శాతం విముక్తుడు. అదే ముక్తి.

- సద్గురు జగ్గీవాసుదేవ్

శాపానికి గురైన ఇంద్రుడు దేవగణాలను చూసి, 'నేను దేవకార్యార్థమై గౌతమునికి కోపం తెప్పించాను. అతనికి తపోభంగం కలిగించాను, అందువల్ల శాపానికి గురయ్యాను' అన్నాడు. నాకు అవి ప్రాప్తించేలా మీరు ప్రయత్నించండి' అన్నాడు. దేవతలు పితృదేవతల వద్దకు వెళ్ళి యజ్ఞంలో మానవులు సమర్పించిన మేకపోతు వృషణాలను ఇమ్మన్నారు. వారు ప్రసన్నులై మేకపోతు వృషణా లను ఇంద్రునికి అతికించారు అని విశ్వామిత్రుడు తెలిపాడు. అనంతరం 'నీ పవిత్ర పాదస్పర్శతో ఈ ఆశ్రమాన్ని పావనం చేయవయ్యా!' అన్నాడు. రాముడు ఆశ్రమంలో ప్రవేశించాడు. ఆయన పాద ధూళి సోకి భస్మ శాయిని అయిన అహల్య శాప విముక్తి పొందింది. రామలక్ష్మణులు అహల్య పాదాలకు నమస్కరించారు. అహల్య ఆదరాభిమానాలతో వారికి ఆతిథ్యం ఇచ్చింది. పవిత్రురాలయింది. ఆశ్రమం పూర్వ శోభను సంతరించుకుంది. గౌతముడు ప్రత్యక్షమయ్యాడు. అహల్యా గౌతములు ఆశ్ర మంలో ప్రత్యక్షం కావడం వల్ల వృక్షాలన్నీ పుష్పఫలభరితాలు అయ్యాయి. దేవతలు పుష్ప వృష్టి కురిపించారు.


మిథిలా నగర ప్రవేశం

విశ్వామిత్ర, రామలక్ష్మణులు అహల్యా గౌత ములను వీడ్కొని ప్రయాణించి మిథిలా నగరంలో ప్రవేశించారు. వారు నివాసయోగ్యమైన ఒక ప్రదేశాన్ని ఎంపిక

అహల్య ఇచ్చిన ఆతిథ్యాన్ని భక్తితో స్వీకరించారు. గౌతముని పూజలు అందుకున్నారు. శివధనుస్సును చూడగోరి ఇక్కడకు వచ్చారు అన్నాడు విశ్వామిత్రుడు.

విశ్వామిత్రుని మాటలు విని అహల్యాగౌతముల కుమారుడు శతానందుడు

అహల్యా శాప విముక్తి



చేసుకుని విడిది చేశారు. విశ్వామిత్రుని రాక జనకునికి తెలిసింది. జనకుడు తన పురోహితుడు శతానందుడు (అహల్యా గౌతముల తనయుడు) మొదలైన వారితో వెళ్లి వారిని యజ్ఞశాలకు తోడ్కొని వచ్చాడు. జనకుడు మహర్షులను యథోచితంగా పూజించాడు. ప్రీతిపూర్వకంగా అతిథి సత్కారాలను జరిపాడు. విశ్వామిత్రుని రాక వలన తన రాజ్యం పావనం అయిందని, తాను సంకల్పించిన యాగఫలం తనకు సిద్ధించిందని జనకుడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు. 'ఇక పన్నెండు రోజులకు యజ్ఞం పరిసమాప్తం అవుతుంది. హవిర్భాగాలు స్వీకరించడానికి రాబోయే దేవతలను మీరు చూడగలరు' అన్నాడు జనకుడు. అనంతరం సూర్య చంద్రులవలె తేజో విరాజమానులైన రామచంద్రులను చూసి వారి వివరాలు తెలుసుకొన గోరాడు. 'ఈ బాలురు వీరాధివీరులు. దశరథుని పుత్ర రత్నాలు. రామలక్ష్మణులు. సిద్ధాశ్రమంలో రాక్షస సంహారం చేసి నేను సంకల్పించిన యాగం నిర్వి ఘ్నంగా సమాప్తమయ్యేట్లు నాకు సహకరించారు. మార్గమధ్యంలో విశాల నగరాన్ని సందర్శించారు. రాముడు అహల్యకు శాప విముక్తి కలిగించాడు.

సంక్షిప్త రామాయణం

పరమానందాన్ని పొందాడు. తల్లి అహల్య శాప విముక్తిని, తండ్రి గౌతముడు మరల ఆశ్రమానికి చేరుకున్న సమాచారాన్ని, తల్లిదండ్రుల కలయికను గూర్చి విన్న శతానందుడు కృతజ్ఞతాపూర్వకంగా రాముని వైపు చూశాడు. భక్తితో విశ్వామిత్రుని చర్యను ప్రశంసించాడు. 'సమయానుగుణంగా నా కర్తవ్యాన్ని నిర్వహించాను' అన్నాడు విశ్వామిత్రుడు. తరువాత శతానందుడు విశ్వామిత్రుని కార్యదీక్షా దక్షతల్ని, సర్వోన్నతమైన వ్యక్తిత్వాన్ని, తపోనిష్ఠను గూర్చి ఇలా తెలిపాడు.

రామా! విశ్వామిత్రుని యాగ రక్షణ చేసిన నీవు ధన్యుడవు. నీవంటి పుణ్యాత్ముడు ముల్లోకాలలో మరొకడు లేడు. విశ్వామిత్రుడు కుశిక వంశంలో జన్మించిన రత్నం. ఇతడు నిరుపమాన శౌర్యపరాక్రమ సంపన్నుడు. భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించాడు. ఒక అక్షౌహిణి సైన్యంతో భూమండలం అంతా దిగ్విజయ యాత్ర చేసి ఒకనాడు వసిష్ఠుని ఆశ్రమం చేరాడు. వసిష్ఠుని ఆశ్రమ ప్రశాంతత చూసి విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు. పుష్పఫలభరిత వృక్షాలతో, పరస్పర జాతి వైరం మరచి సహ జీవనం సాగిస్తున్న మృగాలతో చెంగు చెంగున గంతులు వేస్తూ నిర్భయంగా క్రీడిస్తున్న లేళ్ళతో శుక పిక శారికాది పక్షుల మధుర కూజితాలతో వసిష్ఠుని ఆశ్రమం చూడముచ్చటగా ఉంది. నిరాహారులు, వాయు భక్షకులు, ఆకులు మాత్రమే తినేవారు, కందమూల ఫలాలు మాత్రమే తినేవారు, జితేంద్రియులు అయిన మహర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులతో అది అపర బ్రహ్మ లోకం వలె ప్రకాశిస్తోంది.

కె.ఓబులేశు
9052847742



భగవద్గీత

అన్నీ నాపైనే ఆధారపడి ఉన్నాయి

అధ్యాయం7

శ్లోకం 7:

**మత్తః పరతరం నాన్యత్
కించిదస్తి ధనంజయ।
మయి సర్వమిదం ప్రోతం
సూత్రే మణిగణా ఇవ ॥**

తాత్పర్యం


ఓ ధనంజయా ! నా కన్న శ్రేష్ఠమైన సత్యము వేరొక్కటి లేదు. దారమునందు ముత్యములు కూర్చబడినట్లు సమస్తమూ నాపైనే ఆధారపడియున్నది.

భాష్యం

పరమ సత్యము నిరాకారమా లేదా సాకారమా అనే వాదన తరచు వస్తూ ఉంటుంది. అయితే భగవద్గీత అడుగడుగునా పరమ సత్యము, దేవాదిదేవుడు, ఒక వ్యక్తి యని అతడు శ్రీకృష్ణుడేనని తెలియజేయటమైనది. ప్రత్యేకించి ఈ శ్లోకములో అదే విషయము నొక్కి వక్కాణించడమైనది. బ్రహ్మ సంహితలో సైతమూ బ్రహ్మదేవుడు, గోవిందుడే సర్వ కారణములకూ కారణమని వేరే వాదనకు తావివ్వలేదు. కొందరు శ్వేతాశ్వతర ఉపనిషత్తు (3.10) శ్లోకము నందు 'అరూపం' అని చెప్పబడినదని వాదిస్తారు. అయితే దానికి ముందు రెండు శ్లోకములలో పురుషునిగా వర్ణించటం దీనికి సరైన అవగాహనను ఇస్తుంది. అనగా భగవంతుని రూపము భౌతికము కాదని, దివ్య మంగళ స్వరూపము అని దాని అర్థము. కాబట్టి పరమ సత్యము, ఒక వ్యక్తి అని, దేవాదిదేవునిగా తన భౌతిక ఆధ్యాత్మిక శక్తులచే సర్వత్రా విస్తరించి ఉన్నాడని అవగతమవుతుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

కింపురుష వర్షము-అధిదేవత



కింపురుష వర్షమున శ్రీమన్నారాయణుడు సీతాభిరాముడైన శ్రీరాముని రూపంలో అధివసించి హనుమంతుడు మొదలగు పరమ భాగవతోత్తములతో కింపురుషులతో కలిసి సేవించ బడుతుంటారు.

**ఓం నమో భగవతే ఉత్తమ శ్లోకాయ నమః
ఆర్యలక్షణ శీలవ్రతాయ నమః
ఉపశిక్షితాత్మనే ఉపాసితలోకాయ నమః
సాధువాద నికషణాయ నమో
బ్రహ్మణ్య దేవాయ మహాపురుషాయ మహారాజాయ నమః॥**

ధర్మం-మర్మం

మనలో కామ, క్రోధ, లోభ, మోహ, మదమత్సరం అనే అరిషడ్వర్గాలు ఉన్నాయి. వీటిని నవవిధ భక్తులతో నివారించుకొనుట సాధ్యము కాదు. అందువలన ఈ మంత్రాన్ని యధావిధిగా భక్తిశ్రద్ధలతో భాగవతం మూలం నుంచి గ్రహించి తప్పులు లేకుండా జపించాలి. ఈ శ్రీరామ మంత్రాన్ని ఏ అపచా రములు, అనాచారములు అశ్రద్ధ, అనాదరము లేకుండా పఠించాలి. ఈ శ్రీరామ మంత్రాన్ని జపించు వారు ప్రలోభాలకు లోనవకుండా నియమనిష్ఠలతో సకల లోక కళ్యాణ వాంఛ కలిగివుండాలి. ఈ మంత్రము జపించు వారికి కృతజ్ఞత, లోకజ్ఞత, ప్రియముగా మాట్లాడుట, అధర్మాన్ని సహించకుండుట మొదలగు గుణాలు అలవడతాయి.

మంత్ర జప విధానం

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమాలను ముగించుకుని నిశ్చలమైన, పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.




- డా॥ కందాడై రామానుజాచార్య



కళకు పరిశీలనే పునాది

సంస్కృతి



మానవునిలో పరిశీలనల వలన అతనిలోని అంతః చైతన్యం దేదీప్యం అవుతుంది. అది కట్టిపడేస్తుంది. హృదయం ద్రవిస్తుంది. మెదడు ప్రకంపనలు సృష్టిస్తుంది. అపుడది కళారూపంగా వెలుపలికి వస్తుంది. దీన్ని చూసిన చూపరులలో ఇదే భావం కలుగుతుంది. అతడు కళను ఆస్వాదించగలుగుతాడు. అతడూ కళాకారుడైతే అతని ద్వారా ఇదే చైతన్యం వ్యక్తమవుతుంది.

మన దైనందిన జీవితంలో మనుగడ కోసం, కొన్ని శక్తులను వాడుకుంటుంటాం. మన దృష్టి, వాక్కు, స్పర్శ, ఘ్రూహణ శక్తి, రుచి, వీటితో మన జీవనాన్ని సాగిస్తుంటాం. మనిషి నాగరికునిగా మారుతున్న కొద్దీ తన జీవన కార్యాలు సాధించుకోవడానికి తన శక్తులను మరింత పెంచుకోవడానికి కృషి చేస్తుంటాడు.

కళ అన్నది అనేక విషయాల కలయిక. కళ అన్నది ఒక మానసిక, వ్యక్తిగత అనుభవం. ఈ కళ అన్నది పరిశీలన ద్వారా మరింత ముందుకు సాగగలదు. ఏ కళకైన పరిశీలన అన్నది ప్రాధమికాంశం. మన జీవనానికే పరిశీలన పరమావధిగా చెప్పవచ్చు. మన పరిశీలనల వలన మనలో కలిగే ఆలోచనలు, ఆవేశాలు, భావాలు, అనుభవాలు అన్నీ కూడా కళారూపాలుగా వ్యక్తమవుతున్నాయి. కళ అన్నది మానవునిలో భావాలను రాజేయడానికి ఉపకరించే ఒక సాధనం. పరిశీలనతో ఇది మరింత రాటు తేలుతుంది. మానవునిలో పరిశీలనల వలన అతనిలోని అంతః చైతన్యం దేదీప్యం అవుతుంది. అది కట్టిపడేస్తుంది. హృదయం ద్రవిస్తుంది. మెదడు ప్రకంపనలు సృష్టిస్తుంది. అపుడది కళారూపంగా వెలుపలికి వస్తుంది. దీన్ని చూసిన చూపరులలో ఇదే భావం కలుగుతుంది. అతడు కళను ఆస్వాదించగలుగుతాడు. అతడూ కళాకారుడైతే అతని ద్వారా ఇదే చైతన్యం వ్యక్తమవుతుంది. అతడు కళాపోషకుడు అయినప్పుడు అతని హృదయం ద్రవించి ఆనంద భాష్పాల రూపంలో అతనిలోని కళాజీవి మేల్కొంటాడు.

''కళ'' వల్ల మనలను, మనచుట్టూ గల వ్యక్తులను, పరిసరాలను మరింత చైతన్యవంతంగా మార్చుకోవచ్చు. మనలోనున్న సౌందర్య ప్రతిభ సృజనాత్మక అంశాలకు దారితీస్తుంది. దీనికి కావాల్సినది ''పరిశీలన''.


ఫ్రెడ్రిక్ ఫ్రాంక్ అనే విమర్శకుడు చెబుతూ ''ఈ సమాజంలోని ప్రతి ఒక్కటి కూడా మనకందిన ఒక బహుమతి, అది అంతా మనం చూడడంలోనే ఉంది'' అంటాడు. మనం చూడడం అన్నది కేవలం విషయంగా అనిపించవచ్చు కానీ, ఇదే మనలో భావాలకు, ఆలోచనలకు, ఆవేశాలకు, ప్రతిస్పందనలకు దోహదపడుతుంది. ఇక్కడ ఒక విషయం చెప్పబడుతుంది. ''చూడటం'' అంటే కేవలం కళ్లు తెరచి చూడడమని అనుకోరాదు. మరింతగా చెబితే ''పరిశీలన''గా అనుకుందాం.

అప్పుడు ఒక్క కళ్లు మాత్రమే కాక, మెదడు, హృదయం కూడా ఇందులో పాలుపంచుకుంటాయి. జెఫ్ బెర్నర్ చెబుతూ- ''విషయాన్ని పరిశీలనగా కాక కేవలం చూడటం వల్ల ఎక్కువ లాభం పొందలేం. పరిశీలనగా చూడగలిగినప్పుడే అది అర్థమయ్యేట్టు ఉంటుంది. దాన్ని మరో మారు మననం చేసుకుంటే సరిపోతుంది'' అంటారు.

ఈ పరిశీలనా శక్తి వల్లనే మామూలు వ్యక్తులు కూడా కళాకారులు కావచ్చు. కళాకారులు, కథకులు, సాహిత్యకారులు వంటి వారందరూ మంచి పరిశీలనాపరులై ఉంటారు. వారెప్పుడూ తమ చుట్టూ ఉన్న వస్తువులు, మనుషులను, పరిసరాలను, పరిశీలిస్తూనే ఉంటారు. మంచి పరిశీలకులు కావాలంటే నాణ్యతగా పరిశీలనలు జరపాలి. మనం తీసుకున్న ఏ రంగమైనా నాణ్యతా పరిశీలనలు మంచి ఫలితాలను ఇస్తుంది. చూసిన విషయాన్ని తార్కికంగా, క్రమపద్ధతిలో, అర్థవంతంగా ప్రదర్శించగలగాలి. బయటున్న ప్రపంచాన్ని మన అంతరంగంలోకి తీసుకుపోయి కావాల్సినది తీసుకుని మిగిలినది వదలివేయాలి. మనం గ్రహించిన దానిని కళగా రూపొందించాలి. ఇది కొంత సాధనతో, అభ్యాసంతో, అనుభవంతో సాధ్యపడుతుంది.

మనం ఏదైతే కళారూపాన్ని కూర్చామో, అది తప్పక మన అభ్యాస, అనుభవాల నుండే వచ్చి ఉంటుంది. అలాకాక అనుకరణలతో వచ్చినవి అనతికాలంలోనే అంతమవడం కూడా చూస్తూనే ఉంటాం. కొన్ని సామాన్య పరిశీలనల గురించి చెప్పుకుందాం. రాయి ఎంత పెద్దగా ఉంది. ఎంత చిన్నగా ఉంది అన్న విషయంలో దాని పరిమాణం చెప్పబడుతుంది. ఒకరాయి విసరాలనుకున్నప్పుడు దాని ఆకారం, పరిమాణం బట్టి అంచనావేస్తాం. విసరాలనుకున్నప్పుడు ''దూరం'' అన్నది చెప్పబడుతుంది. మనం చూస్తున్న దాన్ని బట్టి ఒక వస్తువు ఆకార, పరిమాణాలుంటాయి. మన చేతిలో రాయి చిన్నదిగానే ఉంటుంది. కొంచెం దూరాన గల రాయి పెద్దదిగానే ఉంటుంది. కానీ దూరాన ఉన్న కొండ మాత్రం చిన్నదిగానే కనబడుతుంది. కారణం మనమున్న దూరం.

ఈ దూరం దగ్గర అన్న విషయాలు చిత్రకళా రంగాన్ని పునీతం చేశాయి. వాటిలో వచ్చిన అభివృద్ధి నేడు చిత్ర కళారంగాన్ని మరింత రంగులమయం చేసింది. మరెన్నో కళలు, శాస్త్రాలకు పునాది అయింది. ఈ దూరం, దగ్గర అన్న విషయాలన్నీ చిత్రకళలో ''దృష్టిప్రక్రమత'' లేక పెర్‌స్పెక్టివ్ అంటారు'' రెండు అయతనాల ఉపరితలం పైన మూడవ అయతనంగా లోతును చూపడం'' దీన్నే పెర్‌స్పెక్టివ్ అంటారు. అంతవరకూ ఉన్న మనకళా దృష్టి ఈ విషయం ప్రదేశంతో విప్లవాత్మక మార్పుతో, రెట్టించిన వేగంతో దూసుకెళ్లగలిగింది.




విట్రూవియస్ అనే శిల్ప శాస్త్రకారుని ప్రకారం ''అగతార్కస్ అనే చిత్రకారుడు మొదటి పర్‌స్పెక్టివ్‌ను'' చూపగలిగాడు. క్రీ.పూ. 5వ శతాబ్ది నాటి ఈస్కలస్ నాటక రచనలో ప్రస్తావించాడు. దీన్ని ఆధారం చేసుకుని అనగ్జగోరస్, డెమోక్రిటస్ అనే తత్త్వవేత్తలు పురోగామి, తిరోగామి వస్తువులు సమతలంపై కనబడే తీరు గురించి, ఇంకా చిత్రకారుని దృష్టి కేంద్రం నుంచి స్థితి బిందువు మధ్య పయనించు రేఖల గురించి తెలిపారు. మధ్యయుగాలలో మరీ ముఖ్యంగా సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో ఈ అంశంపై విశేష కృషి కనిపిస్తుంది. క్రీ.శ. 1413లో ప్రసిద్ధ ఇటాలియన్ చిత్రకారుడు, వాస్తు శిల్పి బ్రూనెలిషి చిత్రం ''బాప్టిస్ట్రి ఇన్ ఫ్లోరెన్స్''లో ప్రాధమిక పెర్‌స్పెక్టివ్ లక్షణాలున్నాయి. 1435లో అతని సహచర చిత్రకారుడు ఎనోస్కీ పెర్‌స్పెక్టివ్ చిత్ర లక్షణాలు ఎన్నో ఉన్నాయి. నేటికి ఇదొక గొప్ప విషయంగా చెప్పబడుతుంది. ఇలా పెర్‌స్పెక్టివ్ వృద్ధి చెందడాన్ని ఏనోస్కీ కళ శాస్త్రంగా వృద్ధి చెందింది అంటాడు.

ఆల్ బర్టీ తయారుచేసిన ''ఆల్‌బర్టీ విండో'' అన్న విధానంతో చుట్టు చెక్క చట్రంలో నిలువు, అడ్డు ఊచలుంటాయి. దీని నుంచి మనం చిత్రించాల్సిన వస్తువును చూస్తాము. అదేవిధంగా కాన్వాస్‌పై నిలువు, అడ్డువరుసలతో గీతలు గీయబడి ఉంటాయి. వీటినే ''గ్రిడ్'' అంటారు. అలా ఈ విధానంగా, ఈ పరికరాలు వాడి చిత్రాన్ని ఖచ్చితత్వంతో గీయడానికి అవకాశం ఉంటుంది. ఇదే పద్ధతిలో జొనాథన్ కారీ, డేవిడ్ హాకనీలు ఈ మధ్యకాలంలో ''ఆల్‌బర్టీ విండో'' విధానంలో ఫోటోగ్రఫీలో కృషి చేస్తున్నారు.

బ్రూనెలిషి ''పెయింటింగ్‌కు, అద్దంకు మధ్య ఉన్న దూరం'' విధానంలో చిత్రాలు గీయడం తెల్పాడు. పెయింటింగ్ నఖలు, అద్దం ఒకే రంధ్రం గుండా చూస్తూ చిత్రం, ప్రతిబింబం అద్దంపై పడుతుంది. దీన్ని పరిశీలించి చిత్రం చిత్రించడం, దీనివలన సరైన కొలతలతో చిత్రం గీయవచ్చునని భావించాడు.

అయోనార్డో డావిన్సీ తన అభిప్రాయం చెబుతూ- ''పెర్‌స్పెక్టివ్ అన్నది గ్లాసు ముక్క నుండీ చూసి గానీ, అడ్డు నిలువు వరుస గీతలతో గీచే విధానాల వల్ల గానీ, మరింత ఎక్కువ ఖచ్చితత్వంతో గీయగలరు. కానీ పరిశీలనలోనే వాటి దూరాలు, ఆకారాల నిష్పత్తులు అంచనా వేయగలగడం మంచిది'' అంటాడు. చిత్రాన్ని గీస్తున్న పెన్సిల్‌తోనే మన ముందున్న వస్తువు పొడవు, వెడల్పులు కొలవమనే విధానం, ప్రవేశపెట్టబడింది.

పెనఫ్కోస్కీ చెబుతూ-'' పెర్‌స్పెక్టివ్ అన్నది మనుషులకు, వస్తువులకు మధ్య గల



దూరం'' అంటూ చమత్కరిస్తారు. పెర్‌స్పెక్టివ్ విధానాన్ని ఫ్రాన్‌సెస్కా పావరో ఉచ్చెల్లో, ఆల్ బ్రెక్ట్‌డ్యూరర్, మొదలైన చిత్రకారులు తమదైన శైలిలో ఆవిష్కరణలు చేశారు.

పెర్‌స్పెక్టివ్‌ను ''దృష్టిప్రక్రమత'' అంటారని చెప్పుకున్నాం. ఇది సమాంతర దృష్టి ప్రక్రమత, కోణీయ దృష్టిప్రక్రమత, తిర్యక్ దృష్టిప్రక్రమత అని మూడు విధాలు 18వ శతాబ్ది నుండి కళావేత్తలు యాంత్రికంగా ఈ ప్రక్రమతను వాడడాన్ని నిరసిస్తూ మరికొన్ని కొత్త పదాలు తెరపై తెచ్చారు. దీంతో స్వేచ్ఛా చిత్రణ ప్రారంభమైంది.

ఎల్ .ఆర్. వెంకట రమణ

జనపదాలలో విప్రవినోదులు

తెలుగు రాష్ట్రాలలో ఎక్కడో చెదురుమదురుగా విప్రవినోదం ప్రచారంలో ఉందని చెప్పలేం కాని 1600నుండి 1700సంవత్సరాలలో ఈ వినోదాలు వ్యాప్తిలో ఉన్నాయి అంటే అది విజయనగరసామ్రాజ్యం కాలం. ఈ కళ ఆనాటిదని చెప్పవచ్చు. విప్రులనగా బ్రాహ్మణులు. వారు వినోదం చేయడం వలన విప్రవినోదమని పేరు వచ్చింది.

బ్రాహ్మణులలో ఒక తెగ బ్రాహ్మణులు, దేవతోపాసన వలననో, మంత్ర తంత్రాల వలననో, ఒక విచిత్రమైన గారడీలు చేస్తూ ఉంటారు.

అష్ఠావధాన్ని కూడా చేస్తూ ఉంటారు. ఆంధ్రదేశంలో ఈ వినోదం చేసేవారు అక్కడక్కడా వున్నారు. గుంటుపల్లి ముత్తరాలనే విప్రవినోది గోలకొండ సుల్తానుల తుదికాలంలో వున్నట్లు సురవరం ప్రతాపరెడ్డిగారు తెలిపారు.



చాటువు

సంతత మారగించు నెడ సజ్జనకోటుల
పూజ సేయు శ్రీమంతుడు గుంటుపల్లి
కులమంత్రి శిఖామణి ముత్త మంత్రి దౌ
బంతియె బంతిగాక కడువంద గులా
ముల బంతు లెల్ల దూల్ బంతులు దుక్కి
టెడ్ల యెడ బంతులు విప్రవినోది
గారడీ బంతులు మమ్ము ధరాతలంబునన్

అని వర్ణించాడు. ఈ విధంగా ఆ కాలంలో విప్రవినోదాలు జరుగుతుండేవి. విప్రవినోదం చేసేవారు ఆంధ్రదేశమంతటా వున్నట్లు మనకు ఆధారాలున్నాయి.

మాణిక్యాలపురం విప్రవినోదులు

తెలంగాణాలో ఈ విప్రవినోదులు కరీంనగర్ జిల్లా మాణిక్యాలపురంలో ఉన్నట్లు సమాచారం. వీరి వృత్తి విప్రులను యాచించడమే. వీరి ప్రదర్శనం కూడ ఇంద్రజాలమే. వీరి దళసభ్యులు నలుగురుంటారు. వీరి ప్రదర్శనం విపుల ఇండ్లలోనూ, విశాల బహిరంగ స్థలాల్లోనూ కూడా ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శన సామాగ్రి అయిదు శాలువలు, ఒక కొయ్య అలమారా, ఒక తాళపత్ర గ్రంథం, ఎండు జతల తాళాలు, ప్రదర్శనం విశాల ప్రదేశంలో ఒక చిన్న పందిరిలో జరుగుతుంది. పందిరి చుట్టూ కాలువలు కడతారు. ఆ తెరల మధ్య ఖాళీ అలమారా ఉంచుతారు. ఇరువురు వ్యక్తులు చెరో ప్రక్క చేరి తాళాలతో భజన చేస్తారు. ఇంతలో ప్రేక్షకులు గుమికూడతారు. తెరలన్నీ ఎత్తి ఖాళీ అలమారా చూపిస్తారు. తరువాత దళసభ్యుడు ప్రాచీన తాటాకుల గ్రంథంలో తెర మధ్యకు వెళతాడు. ఒక పావుగంట వరకూ ఆయన బయటకు రాడు. ఈలోగా భజన జరుగుతూనే ఉంటుంది. లోపల ఏం జరుగుతూందో అనే ఆసక్తి ప్రేక్షకులలో రేకెత్తిస్తుంది.

ఇంతలో తెరను తొలగిస్తారు. అదివరకు ఖాళీగా వున్న అలమారా లో దేవతా విగ్రహాలు, దీపారాధన కుందులూ, పుష్పాలూ, ఫలాలూ, పిండివంటలూ, గంట శంఖం వివిధ పూజాపాత్రలు అనేక రకాల పిండివంటలు ప్రత్యక్షమౌతాయి. అలాగే ఒక మామిడిటెంకను పాతిపెట్టి పదినిమిషాల్లో అడుగు ఎత్తున పెరిగిన మామిడి మొక్కను చూపిస్తారు. ఈ ప్రదర్శనం ప్రేక్షకులను ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ప్రదర్శనానికి ముందే అలమారాలను పరీక్షించవచ్చు. అంతేకాక వీరు ఇంటింటికి తిరుగునప్పుడు విగ్రహాలను, కప్పలను, చిలకలను, విభూతిని, అరచేతిలో సృష్టించి ఇంద్రజాల మహేంద్ర జాల విద్యను ప్రదర్శిస్తారు.

రాయలసీమ విప్రవినోదులు

రాయలసీమ విప్రవినోదులు, జాతర్ల లోనూ, తిరునాళ్ల లోనూ, గుడారాలను నిర్మిస్తారు. ఈ గుడారాల్లో రామాయణం మొదలైన కథలను అత్యద్భుతంగా చిత్రిస్తారు. వీరు గొప్ప మాట కారులు, హాస్య ప్రియులు, చెప్పింది చెప్ప కుండా చెపుతారు. ప్రేక్షకులను తమ హాస్య ప్రసంగాలతో ఆనందంలో ముంచెత్తుతారు. వీరు భలే తమాషాలు చేసి, ప్రేక్షకులను ఆనందపరుస్తారు. వీరు ముందు పేరు అడిగి తెలుసుకుంటారు. దూరంగా వుండే తమ జట్టు వారికి అర్థమయ్యే రీతిలో పద్యాల ద్వారా, సైగలు ద్వారా, మన పేరును తెలియచేస్తారు. వారు అక్కడ నుంచే మన పేరులను వారితోనే చెప్పించి చుట్టూ మూగిన ప్రేక్షకులను ఆశ్చర్య చకితుల్ని చేస్తారు. వీరు రాయలసీమ ప్రాంతాల్లో ఒకప్పుడు విరివిగా ప్రదర్శనలిచ్చేవారు. ఈనాడు వీరి జాడ వున్నట్లు ఆధారాలు లేవు.

విప్రవినోదుల రోప్ ట్రిక్

విప్రవినోదులు ఆరోజుల్లో రోప్ ట్రిక్‌ను చేసేవారు. అంటే ఒక త్రాడును ఆకాశంలో ఎగరేస్తే అది అలాగే నిలబడితే, దానిమీద మనిషి ఎక్కి అంతర్థానమయ్యేవాడట.

- ఉన్నం వెంకటేశ్వర్లు
8919479134

రసవత్తరమైన నాటకం సతీసావిత్రి



సతీసావిత్రి నాటకం మైలవరం రాజాగారి సృష్టి. శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారు ఆయన 1889-1954 ప్రాంతంలో జీవించారు. ఈ నాటకాన్ని మైలవరం కంపెనీవారు బెజవాడలో భారీ సెట్టింగులతో వ్యయప్రయాసలతో గొప్పగా ప్రదర్శించారు. ఇందులో యముడు సత్యవంతుడు, సావిత్రి, ప్రధానపాత్రలు.

యముడుగా గురజనాయుడుగారు, వేమూరి గగ్గయ్యాగారు, తరువాత గగ్గయ్యగారి కుమారుడు రామయ్యగారు, వేమూరి సీతారామశాస్త్రిగారు మొదలైనవారు నటించేవారు.

సత్యవంతుడిగా యడవల్లి సూర్యనారాయణగారు, సి.ఎస్.ఆర్.గారు నిడుముక్కల సుబ్బారావుగారు మొదలైనవారు నటించేవారు.

సావిత్రిగా ఉప్పులూరి సంజీవరావుగారు ఆ పాత్రకు ప్రాణం పోశారు. ఆయన ఆడకంఠం అచ్చెరువొందించేది. ఆయన సావిత్రి పాత్ర వేయటం కోసమే పుట్టారనిపిస్తుంది.

నేను ఒక తడవ నా చిన్నతనంలో మా బంధువు రమ్మంటే ఆయన వెంట సంజీవరావుగారింట సత్యనారాయణపురం విజయవాడకు వెళ్లాను. నేను బైట కూచున్నాను. మా బంధువు లోపలికి వెళ్లాడు. ఎవరో ఆడవాళ్లు మాట్లాడుతున్నారనుకున్నాను చాలాసేపు. తీరా లోపలికి వెళ్లి చూస్తే అది ఉప్పులూరివారే. సారంగధరుడు లాగా సత్యవంతుడు కూడా సి.ఎస్.ఆర్.గొప్పగా నటించేవాడని సురభి రామారావుగారు నాతో ఒక తడవ అన్నారు.



ఏమైనా సినిమా దాకా వచ్చేసరికి ఆ అవకాశం యముడుగా వేమూరి గగ్గయ్యాగారికి సత్యవంతుడు నిడముక్కల సుబ్బారావుగారికి వచ్చింది. ఆరోజుల్లో గగ్గయ్యగారి 'ధిక్కారమును సైతునా' అనే పాట ఎంతో పేరు తెచ్చుకున్నది. సంగీతం పాపట్ల కాంతయ్యగారు సమకూర్చేవారు. ప్రేక్షకులకు అడ్డురాకుండా మైలవరం కంపెనీవారు ఒక గొయ్యి తవ్వించి అందులో ఆర్కెస్ట్రా పెట్టేవారు. దాన్ని హార్మోనిస్టు గొయ్యి అన్నారు. బెజవాడ మైలవరం నాటకం చూడటానికి హైదరాబాదు, సికిందరాబాద్ మొదలైన దూరప్రాంతాల నుంచి కూడా ప్రేక్షకులు ఆసక్తితో వచ్చేవారు. ఇక చుట్టుప్రక్కలవాళ్లు నడిచి బండ్లు కట్టుకొని రావటంలో ఆశ్చర్యం లేదు. యడవల్లి వారు ''పోయెన య్యో సతిననుబాసి'' అనే పాట శకుంతలలోను, సతీసావిత్రిలోను పాడేవారు. సతీసావిత్రి నాటకాన్ని ఏలూరి మోతీనారాయణరావుగారు ప్రదర్శించేవారు. కొద్ది మార్పులతో ప్రచురించిన నాటకం అది. నేను 1950 బెజవాడ చెట్ల బజారు (గోపాలరెడ్డిరోడ్)లో సీతారామ సమాజం వాళ్లు వేయిస్తే చూశాను. గగ్గయ్యగారు యముడు, టి. రామకృష్ణశాస్త్రిగారు నారదుడు ఎస్.పి.లక్ష్మణస్వామి (తెనాలి రామకృష్ణఫేమ్) పువ్వుల అనసూయ సావిత్రి వేయగా చూశాను. అద్భుతంగా ఉంది. 197లో రవీంద్రభారతీలో వేమూరి సీతారామశాస్త్రిగారు యముడుగా, రాధారాణి సావిత్రిగా నేను సత్యవంతుడుగా సావిత్రి నాటకాన్ని ప్రదర్శించాం. తరువాత రామయ్యగారు యముడుగా, విమలకుమారి సావిత్రిగా నేను సత్యవంతుడుగా త్యాగరాయగానసభలో వేశాము. రసవత్తరమైన నాటకం సావిత్రి.

- అయ్యదేవర పురుషోత్తమరావు
9290448444

నిండు దుస్తుల్లో కూడా గ్లామర్ ఉంటుంది



అనుపమ పరమేశ్వరన్

టాలీవుడ్ తెరపై మాలీవుడ్ (మళయాల) భామల హవా నడుస్తోంది. వారికి మంచి మంచి అవకాశాలు వస్తున్నాయి. గ్లామర్, అభినయం రెండు ప్రదర్శించే వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. శతమానంభవతి, ఉన్నది ఒకటే జిందగి చిత్రాలు అనుపమ కెరీర్‌ను మరింత వేగం చేశాయి. ఉన్నత విద్యనభ్యసించిన ఆమెకు కెరీర్‌పరంగా కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఒకవైపు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే మరోవైపు ఇష్టంలేని పాత్రలను సున్నితంగా తిరస్కరిస్తోంది. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నుండి పిలువు వచ్చింది. మంచి పారితోషికం ఆఫర్ చేశారట. కానీ నటించేందుకు నిరాకరించింది. కారణం ఏమంటే ఇప్పటికంటే ఇంకా ఎక్కువ గ్లామర్‌తో కనిపించాలి అని షరతు విధించారు. నేను కేవలం గ్లామర్‌కే పరిమితమా? అనిపించింది అందుకే చేయడానికి నిరాకరించాను అని చెప్పింది అనుపమ. సినిమారంగంలో గ్లామర్ పాత్రలు చేయనంటే కుదరదు. కానీ గ్లామర్ అంటే కురచ దుస్తులు ధరించడం కాదనేది నా అభిప్రాయం. నిండు డ్రస్‌లు వేసుకుని కూడా గ్లామర్‌గా కనిపించవచ్చు. అలాగే మరో సినిమాలో నా పాత్ర చనిపోతుంది అని చెప్పారు. అది నాకు నచ్చలేదు. అందుకే చేయలేదు. నాది మధ్యతరగతి కుటుంబం. కుటుంబసభ్యులంతా చూసి ఆనందించే సినిమాలే చేస్తాను అని స్పష్టం చేసింది.

తను భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించనని చెప్పింది. అలా ఆలోచించడం అంటే సమయాన్ని వృథా చేయడమే అనేది నా అభిప్రాయం. రోజు చేస్తున్న పనిని ఆస్వాదించాలి. అంతేకానీ ఎలా ఉంటుందో తెలియని రోజుల గురించి ఆలోచించడం అనవసరం. కెరీర్‌పరంగా కానీ మరేదైనా కానీ ఇంతవరకు ప్లాన్ చేసుకోలేదు. దాని గురించి ఆలోచించడం లేదు అని అనుపమ తెలిపింది. ఇక ఖాళీగా ఉంటే ఏం చేస్తుంటారు? అని అడుగుతుంటారు. నిజానికి నాకు ఖాళీ సమయం చాలా తక్కువ. మా ఇంట్లో విస్కి అనే డాగ్ ఉంది. దానితోనే కాలక్షేపం చేస్తుంటాను. పాటలు వింటూ ఉంటాను. వీలుంటే సాంకేతిక అంశాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తాను అని చెప్పింది. వ్యాయామం గురించి చెబుతూ పరిమితంగానే చేస్తాను. ఆర్టిస్టు అయ్యాక తిండి విషయంలో కొంత జాగ్రత్తగా ఉంటున్నాను అని అనుపమ తెలిపింది.



అండగా నిలబడే గ్యాంగ్

-సూర్య

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన తమిళ చిత్రం తాన సేంద్ర కూట్టమ్..తెలుగులో గ్యాంగ్ పేరుతో అనువాదమవుతోంది. ఈ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ తెలుగులో సూర్య సినిమాను విడుదల చేస్తోంది. సంక్రాంతి పోటీలో చేరిన గ్యాంగ్..జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. పాటలను విడుదల చేసిన అనంతరం సూర్య మాట్లాడుతూ....తాన సేంద్ర కూట్టమ్‌కు తెలుగులో గ్యాంగ్ అంటూ యూవీ క్రియేషన్స్ చాలా మంచి పేరు పెట్టారు. అందరికీ త్వరగా తెలిసిపోయే టైటిల్ ఇది. మన జీవితంలో ప్రతి దశలోనూ ఓ గ్యాంగ్ వెంట ఉంటుంది. పాఠశాల, కళాశాలలో చదువుకుంటున్నప్పుడు, ఉద్యోగాలు చేస్తున్నప్పుడు మనవాళ్లైన మనుషులు ఒకరికొకరు అండగా ఉంటారు. జీవితంలో చాలా కీలకమైనదీ గ్యాంగ్. అరవింద్‌గారు నాకు ఎప్పటి నుంచో మిత్రులు. కొత్తగా మా జట్టులో యూవీ క్రియేషన్స్ వంశీ ప్రమోద్ కలిశారు. దర్శకులు విఘ్నేష్ శివన్ ఈ చిత్రంలో నన్ను కొత్తగా చూపించారు. ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించే సినిమా అవుతుంది. రమ్య కృష్ణ ప్రత్యేక పాత్రలో నటించారు. కీర్తి సురేష్ తో పనిచేయడం సంతోషంగా ఉంది. తెలుగులో ఈ సినిమాకు నేను డబ్బింగ్ చెప్పుకున్నాను. అన్నారు. కీర్తి సురేష్ మాట్లాడుతూ...నాకు ఈ సినిమా అవకాశం ఎంతో ప్రత్యేకమైంది. సూర్య గారితో నటించడం గొప్ప అనుభవం. రమ్యకృష్ణగారు సహ నటి కావడంతో ఎంతో నేర్చుకున్నాను. కథను చెప్పడంలో దర్శకుడి పనితనం మీకు భిన్నమైన అనుభవాన్ని అందిస్తుంది. అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ....గజినీ సినిమా నుంచి సూర్య గారితో నాకు మంచి అనుబంధం ఉంది. మేమిద్దరం కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. కానీ కుదరడం లేదు. త్వరలో మా కాంబినేషన్ సినిమా వస్తుంది. అన్నారు. దర్శకులు మారుతి మాట్లాడుతూ....గ్యాంగ్‌తో మరో అద్భుతమైన చిత్రాన్ని సూర్య మన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సంక్రాంతి పండక్కి అగ్ర కథానాయకుల చిత్రాలతో పాటు సూర్య సినిమా వస్తోంది. విఘ్నేష్ శివన్ నాన్ రౌడీ దాన్ చూశాను. చాలా కొత్తగా అనిపించింది. ఆయన చిత్రాల్లో హాస్యం బాగుంటుంది. అనిరుధ్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని అందించారు. సంక్రాంతికి ఆయనవి రెండు సినిమాలు వస్తున్నాయి. సూర్య తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పడం గొప్ప విషయం. అన్నారు. దర్శకులు విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ...తెలుగు ప్రేక్షకులు సినిమా ప్రేమికులు. బాగున్న చిత్రం ఎవరిదైనా ఆదరిస్తారు. మనమంతా జనవరి 10న పవర్‌స్టార్ అజ్ఞాతవాసి చూస్తున్నాం. అలాగే 12న సూర్య గ్యాంగ్ చూడబోతున్నాం. అన్నారు.

జయ దర్శకత్వంలో బి.ఎ.రాజు కొత్త చిత్రం



బి.ఎ.రాజు

జయ బి. దర్శకత్వంలో లోగడ ప్రేమలో పావని కల్యాణ్, చంటిగాడు, గుండమ్మ గారి మనవడు, లవ్‌లీ, వైశాఖం వంటి చక్కటి చిత్రాలను నిర్మించి, అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్న బి.ఎ.రాజు ఆదివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్.జె. సినిమాస్ పతాకంపై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ, ప్రేమలో పావని కల్యాణ్ చిత్రం ద్వారా నిర్మాతగా మారి పదిహేను సంవత్సరాలు పూర్తయింది. మా బేనర్‌లో నిర్మించిన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. తాజాగా మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో జయ దర్శకత్వంలో నిర్మించబోయే చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాను మొదలుపెడతాం. మేము నడుపుతున్న సూపర్‌హిట్ మేగజైన్ 24వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది అని అన్నారు.

గృహిణిగా విలక్షణ పాత్రలో

నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు...తర్వాత సంగతి తర్వాత అనే డైలాగ్‌ను చూస్తే ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యం ఎలాంటిదో ఇట్టే అర్థమైపోతుంది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలే కాదు ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించిన శ్రియ గృహిణి పాత్రలలో కూడా మెప్పించారు. తాజాగా ఆమె నటిస్తున్న చిత్రం గాయత్రి. ఇందులో మధ్యతరగతి గృహిణిగా మరో విలక్షణ పాత్రలో నటిస్తున్న ఆమె ఈ స్టిల్‌లో చక్కటి చీరకట్టుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు ప్రధాన పాత్రలో, విష్ణు మంచు, శ్రియ జంటగా మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరం మొదటి రోజున విషు, శ్రియలు ఆదర్శ దంపతులుగా కనిపించే పోస్టర్ విడుదల కాగా తాజాగా చిత్రబృందం శ్రియ పోస్టర్‌ను విడుదలచేసింది. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో నిఖిల విమల్, బ్రహ్మానందం తదితరులు నటిస్తుండగా, కథ, మాటలు: డైమండ్ రత్నబాబు, సంగీతం: ఎస్.ఎస్.తమన్, ఛాయాగ్రహణం: సర్వేష్ మురారి. ఆర్ట్: చిన్న, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ, ఫైట్స్: కనల్ కణ్ణన్.



శ్రియ

హాస్య ప్రధానంగా ఆచారి అమెరికా యాత్ర



విష్ణు మంచు,

హీరో విష్ణు మంచు, దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి కలయికలో దేనికైనా రెడీ, ఈడోరకం..ఆడోరకం వంటి చిత్రాలొచ్చిన సంగతి తెలిసిందే. మళ్లీ వారిద్దరి కలయికలో రూపుదిద్దుకుంటున్న ఆచారి అమెరికా యాత్ర చిత్రం ఈ నెల 26న విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా ఈ చిత్రం టీజర్‌ను ఆదివారం విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుందని, అందరినీ అలరింపజేసే హాస్యంతో చిత్రం చాలాబాగా వచ్చిందని చెప్పారు. ఈ చిత్రంలో విష్ణు సరసన ప్రజ్ఞ జైస్వాల్ నటిస్తుండగా, బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో తనికెళ్ళ భరణి, కోట శ్రీనివాసరావు, పోసాని, పృథ్వీ, ప్రవీణ్, విద్యుల్లేఖ, రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రావా, ఠాకూర్ అనూప్‌సింగ్, సురేఖవాణి తదితరులు తారాగణం.ఈ చిత్రానికి రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి, మాటలు: డార్లింగ్ స్వామి, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్, సంగీతం: ఎస్.ఎస్.థమన్, ఎడిటింగ్: వర్మ, యాక్షన్: కనల్‌కణ్ణన్, ఆర్ట్: కిరణ్, సమర్పణ: ఎం.ఎల్.కుమార్‌చౌదరి, నిర్మాతలు: కీర్తిచౌదరి, కిట్టు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జి.నాగేశ్వర్‌రెడ్డి.

హృతిక్ సూపర్30


విద్యావేత్త ఆనంద్ కుమార్ జీవిత కథలో నటించబోతున్నారు బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్. వికాస్ బాల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ పాత్ర గురించి తెలుసుకునే స్వయంగా ఆనంద్‌కుమార్ వద్దే శిక్షణ తీసుకుంటున్నారు హృతిక్. పాట్నా నగరానికి చెందిన ఆనంద్...సూపర్ 30 అనే కార్యక్రమం ద్వారా అత్యంత ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి వాళ్లకు ఐఐటీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి దాకా సూపర్ 30 ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఐఐటీలో



హృతిక్ రోషన్

ప్రవేశం పొందారు. ప్రపంచంలో ఎందరినో ఆలోచింపజేసింది ఆనంద్ కుమార్ కృషి. సమాజం పట్ల ఆయనకున్న సేవాదృక్పథం ఇప్పుడు బాలీవుడ్‌ను ఆకర్షించింది. త్వరలో ఆనంద్ కుమార్ జీవిత కథ తెరపైకి రాబోతోంది. ఈ కథలో భాగమవడంపై హృతిక్ స్పందిస్తూ....మన జీవితాల్లో అత్యంత గొప్ప విషయం సేవ. సమాజానికి, మన తోటి మనుషులకు సాయం చేయడం అనేది అత్యుత్తమం. నా పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పాలని ప్రయత్నిస్తుంటాను. రేపు నేను వాళ్లకు ఇవ్వబోయే అసలైన ఆస్తి సేవా దృక్పథమే అనుకుంటాను. ఈ సామాజికసేవ మన చుట్టూ సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. తద్వారా ప్రపంచాన్ని మార్చే శక్తినిస్తుంది. అన్నారు. ప్రస్తుతం ఈ చిత్రంతో పాటు హృతిక్ సూపర్‌హీరో ఫిల్మ్ సిరీస్ క్రిష్ 4లో నటిస్తున్నారు.

థ్రిల్‌కు గురిచేసే స్ట్రీట్ లైట్స్



మమ్ముట్టి

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం స్ట్రీట్ లైట్స్. శ్యామ్‌దత్ సైనుద్దీన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ప్లే హౌస్ మోషన్ పిక్చర్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. కాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసిన సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, విభిన్నమైన కథల్ని ఎంచుకునే మమ్ముట్టి ఈసారి కూడా ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే ఈ చిత్ర కథాంశాన్ని ఎంచుకున్నారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని తమిళ, మ లయాళ భాషలతో పాటు తెలుగులోనూ వి డుదల చేయనున్నాం. లోగడ మమ్ముట్టి న టించిన చాలా చిత్రాలు తెలుగులో పెద్ద వి జయాలు సాధించాయి. ప్రత్యేకం గా ఆ యనకు తెలుగులో వీ రాభిమానులున్నారు. అందుకే ఈ చి త్రాన్ని తెలుగులో భారీగా విడుదల చేసేందుక ు సన్నాహాలు చేస్తున్నాం. తెలుగు టీ జర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ద ర్శకుడు ఆవిష్కరించిన కథ, కథనాలు ప్రే క్షకు లను ఎంతగానో ఆకట్టుకుంటాయి. అలాగే మమ్ముట్టి కెరీర్‌లోనూ ఓ మైలురాయి చి త్రంగా నిలిచిపోతుంది అని అన్నారు. ఈ చి త్రంలోని ఇతర పాత్రల్లో స్టంట్ శివ, మొట్ట రా జేంద్ర, పాండిరాజన్, మ నోబాల, బ్లాక్‌పాండి, శ్రీరామ్, పృథ్వీ, పాండిరాజ్, సంపత్‌రామ్, రోనీ, మాస్టర్ ఆశిష్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాదత్ సైనుద్దీన్, సంగీతం: ఆదర్శ్ అబ్రహాం, ఆర్ట్: సాబురామ్, స్టంట్స్: శివ, ఎడిటింగ్: మనోజ్.

అదితి మళ్లీ వచ్చేసింది



అదితీరావ్

చెలియా.. అదితీరావ్ హైదరీ గు ర్తుందా..లేకుంటే గుర్తు చేసేందుకు మళ్లీ తెలుగు తె రకొస్తోంది. ఈ బాలీవుడ్ నాయిక దక్షిణాది చి్త్ర త్రాలతో కెరీర్ ప్రారంభించింది. మలయాళ, తమిళ సినిమాలు చేసిన తర్వాత బాలీవుడ్ వెళ్లి అక్కడ పేరున్న నాయిక అయ్యింది. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం పద్మావతి, ఔర్ దేవదాస్ అనే భారీ సినిమాల్లో నటిస్తోంది. ఇంతలో అదితీ గాలి టాలీవుడ్ మీద సోకుతోంది. సుధీర్‌బాబు కొత్త సినిమాలో నాయికగా ఎంపికైన ఈ హాట్ భామ...త్వరలో వెంకటేష్ సరసన కూడా ఓ చిత్రంలో నటించనున్నట్లు సమాచారం. ఈ రెండు సినిమాలు పూర్తయేలోపు ఆమెకు మరిన్ని అవకాశాలూ రావొచ్చు. దీంతో ఆమె బాలీవుడ్‌తో దక్షిణాది భాషల నాయిక అయ్యింది. ఈ విషయంపై అదితీ స్పందిస్తూ....చిత్రాల ఎంపికలో భాషా బేధాలు చూడనంది, భావోద్వేగాల కలయిక అయిన చలన చిత్రాలకు ఏ తేడాలు ఉండకూడదని చెప్పింది. అదితీ మాట్లాడుతూ...సినిమా కథలు మనిషి భావోద్వేగాలను చూపిస్తాయి. ఈ ఫీలింగ్స్‌కు భాషా బేధాలు ఉండవు. సంతోషాలకు, బాధలకు మనుషులంతా ఒకేలా స్పందిస్తారు. నేను ఎంచుకునే చిత్రాలకూ హద్దులు చూడను. భాష, ప్రాంతం లాంటి తేడాలు నన్ను నటించకుండా అడ్డుకోవడం ఇష్టముండదు. గొప్ప గొప్ప దర్శకులతో పనిచేయాలని ఉంది. అని చెప్పింది.